ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

28-9-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 238 పేజీలు: 10+4 వెల: 8.00



ఆవుల మెదడులో న్యూరో ఇంప్లాంట్ల అమరిక
దక్షిణ అమెరికా పర్యటనకు రాహుల్ గాంధీ
5లో


# తెలుగుజాతిని నం.1 చేస్తా

## డబుల్ ఇంజిన్ సర్కార్‌వల్లే 15 నెలల్లో ఇంత ప్రగతి

### 4న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేలు

### వచ్చే జూన్‌కు 6.15లక్షల ఇళ్లు అందుబాటులోకి

### స్త్రీశక్తి పథకం నాకు చాలా సంతృప్తి నిచ్చింది..

### సూపర్‌సిక్స్, మేనిఫెస్టో అమలుపై అసెంబ్లీలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఊపిరి ఉన్నంత కాలం పేదల కోసమే పని చేస్తానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.పేదల కోసమే అనునిత్యం ఆలోచన చేస్తున్నాను. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేయడం, తెలుగు జాతిని నెంబర్1 రాష్ట్రంగా చేయడానికి తాను పనిచేస్తున్నా అని అన్నారు. అలాగే అందరూ పని చేయాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంది కాబట్టే 15నెలల కాలంలో ఇన్ని కార్యక్రమాలను చేయగలిగామన్నారు. ప్రధాని మోడీ, పవన్ కళ్యాణ్ సహకారంతో ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోందని తమదో టీం అన్నారు.ఈ టీంలో ఏ ఒక్కరు తప్పు చేసినా, విఘాతం కలిగించేలా వ్యవహరించినా రాష్ట్రానికి చాలా నష్టం జరుగుతుందన్నారు. శనివారం అసెంబ్లీలో సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీల అమలుపై చర్చ జరిగింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ ప్రసంగించారు.ఎమ్మెల్యేలు పర్సనల్ అజెండాలు పెట్టుకుని మాట్లాడితే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి అడ్డంకి కలుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించనున్నట్టు సభలో సీఎం ప్రకటించారు. రాష్ట్రాభివృద్ధి విషయంలో కలిసి కట్టుగా పని చేయాలని ప్రజా ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి ఎన్నికలకు వెళ్లాయి. అభివృద్ధిసంక్షేమంసుపరిపాలన ద్వారా రాష్ట్ర పునర్ నిర్మాణం చేస్తామని చెప్పాం. నాడు చెప్పాం.. నేడు చేసి చూపుతున్నాం. కలిసి ఉన్నాం కాబట్టే ఇవన్నీ చేయగలుగుతున్నాం. దీన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. అక్టోబర్ 4వ తేదీనఆటో డ్రైవర్ల సేవల్లో పథకాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ పథకం కింద సొంత వాహనం కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.15వేల చొప్పున అందిస్తాం. ఈ పథకానికి అర్హులుగా 2,90,234మంది డ్రైవర్లు ఉన్నారు. ఏదైనా కారణాలతో లబ్దిదారుల జాబితాలో అర్హులైన వారి పేరు లేకపోతే. వారి సమస్యలను పరిష్కరించి వారినీ లబ్దిదారుల జాబితాలో చేరుస్తాం. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆటో డ్రైవర్ల సేవలో స్కీంను వర్తింప చేస్తాం. ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి యేటా రూ.435 కోట్ల ఖర్చు అవుతుంది. గత ప్రభుత్వం రూ.12 వేలు మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.15 వేలు అందించేందుకు నిర్ణయించింది అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతినెలా ఇచ్చే ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు ఎంతో ఆలోచించి పేదల సేవలో అని పేరు పెట్టాం. ప్రతి నెలా ఫించన్లు అందించే కార్యక్రమంలో పాల్గొనడం నాకు చాలా సంతృప్తినిస్తోంది. ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం కింద పెద్ద ఎత్తున ఫించన్లు ఇస్తున్నాం. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో ఇవ్వనన్ని ఫించన్లను మన రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఫించన్లను ఇవ్వకుండా వృద్ధులను ఇబ్బంది పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో ఫించన్ల పంపిణీ >>2




2లో
అసెంబ్లీ నిరవధిక వాయిదా




# ర్యాలీలో ఘోరం

### నటుడు విజయ్ కరూర్ రోడ్‌షోలో తొక్కిసలాట

### 10మంది చిన్నారులు సహా 38 మంది మృతి

### మరణించిన వారిలో 17 మంది మహిళలు

### హీరో విజయ్‌పై కేసు నమోదుచేసినపోలీసులు

### మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించిన సిఎం స్టాలిన్

### గాయపడిన వారికి రూ.లక్ష చొప్పన సాయం

**కరూర్, సెప్టెంబరు 27:** తమిళనాడులో ప్రముఖ నటుడు, టివికె వ్యవస్థాపకుడు విజయ్ హోరెత్తిస్తున్న తన పర్యటనల్లో అపశృతి చోటుచేసుకుంది. శనివారం కరూర్ రోడ్‌షోలో కనీసం 38 మంది చనిపోగా వారిలో 10మంది చిన్నారులు కూడా ఉన్నారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. సుమారు 30వేలమందికిపైగా వచ్చిన ఈ రోడ్‌షోకు విజయ్ ఆరుగంటలు ఆలశ్యంగా అక్కడికి చేరుకోవడంతో అభిమానులు, పార్టీకేడర్‌లో ఒక్కసారిగా హుషారుపెరిగింది. దీనికితోడు విజయ్ ప్రసంగానికి చప్పట్లు కొడుతూ కేరింతలు కొడుతున్న అభిమానులను కట్టడిచేయడం పోలీసులకు కూడా సాధ్యంకాలేదు. ఒక్కసారిగా జరిగిన తొక్కిసలాటలో ఊపిరాడక స్పృహతప్పి చనిపోయిన వారు 34 మందికిపైగా ఉన్నారు. మరో 46మందికిపైగా తీవ్రగాయాల పాలయితే వారిని కరూర్‌లోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో >>2

## ఒడిశాలో రూ.50వేలకోట్ల ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధాని మోడీ

**ఝార్సుగూడ(ఒడిశా), సెప్టెంబరు 27:** ఒడిశా పర్యటనలో ప్రధానిమోడీ రూ.50 వేలకోట్లకుపైగా అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. టెలికమ్యూనికేషన్స్, రైల్వేలు, ఉన్నతవిద్య, హెల్త్‌కేర్ నైపుణ్య అభివృద్ధి, గ్రామీణ పక్కా ఇళ్లపథకాలను ప్రారంభించారు. 11 వేలకోట్ల విలువైన మౌలికవసరుల విస్తరణ ప్రాజెక్టులు ఎనిమిది ఐఐటిలు ప్రారంభించారు. తిరుపతి, పాలక్కడ్, భిలాయి, జమ్ము, ధార్వాడ్, జోధ్‌పూర్, పాట్నా, ఇండోర్‌లలో వీటిని ఏర్పాటుచేసారు. వచ్చే నాలుగేళ్లలో 12వేల సీట్లు అదనంగా ఈ ఐటిఐలలో పెరుగుతాయి. సంబల్‌పూర్ నగరంనుంచి సరళా వరకూ ఐదు కిలోమీటర్ల ఫ్లైఓవర్‌నిర్మాణానికి భూమిపూజచేసారు. 273కోట్లతో ఈ ఫ్లై ఓవర్ నిరానమణం అవుతుంది. అలాగే ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ ఉత్పత్తి(ఇఎస్‌డిఎం) పార్కును ఐఐటి భువనేశ్వర్‌తో కలిసి ఏర్పాటుచేసేందుకు ప్రాథమిక పనులు పూర్తిచేసారు. అలాగే బహుళ క్రమశిక్షణ విద్యాపరిశోధన అభివృద్ధి సాంకేతిక విద్యస్కీం 'మెరిట్'కింద 275రాష్ట్ర ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ సంస్థలనున ప్రారంభించారు. ఒడిశా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు రెండోదశ పనులు ప్రారంభించారు. 1979 కోట్లతో వరల్డ్ స్కిల్ సెంటర్లు ఏర్పాటుచేస్తున్నట్లు మోడీ తెలిపారు. సంబల్‌పూర్, బెర్హాంపూర్‌లలో వీటిని ఏర్పాటుచేస్తున్నారు. ఐదు ఐటిఐలను ఉత్కర్ష్ ఐటిఐలుగా అప్‌గ్రేడ్‌చేసారు. 25 ఐటిఐలు ఎక్సలెన్స్ కేంద్రాలుగా అభివృద్ధిచేస్తున్నారు.

## 'కల్తీనెయ్యి' కేసులో మళ్లీ సిట్ విచారణ

### రెండు మూడురోజుల్లో రంగంలోకి అధికారులు

**తిరుమల,సెప్టెంబరు 27ప్రభాతవార్తప్రతినిధి:** సరిగ్గా ఏడాదిక్రిందట తిరుమల లడ్డూకు కల్తీనెయ్యి సరఫరాచేశారనే కేసులో విచారణ మొదలై ఆ తరువాత సిబిఐ సిట్ చేతికి వెళ్ళింది. ఇప్పుడు మళ్ళీ ఆ దేవుని బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలతో మళ్లీ కల్తీనెయ్యి ఘటన కేసులో విచారణ కొనసాగింపుకు సిబిఐ సిట్ రంగంలోకి దిగనుంది. తిరుమల లడ్డూల తయారీలో కల్తీనెయ్యి పాపానికి కారకులను గుర్తించిన సిబిఐ సిట్ అధికారులు కొందరిని అరెస్టులు చేసింది. వారంతా బెయిల్‌పై ఉండటంతో మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి మాజీ పిఏ చిన్నప్ప సుప్రీంకోర్టుకెళ్ళడంతో ఆయన పిటిషన్ తిరస్కరించడం, మళ్ళీ సిట్ విచారణకు ఆదేశించడం జరిగింది. దీంతో మళ్ళీ సిట్ బృందం చర్యలకు సిద్ధమవుతోంది. కల్తీనెయ్యి కేసులో సిట్ బృందంలోని ఢిల్లీనుండి, విశాఖపట్నం నుండి వచ్చిన నలుగురు డిఎస్పీ స్థాయి అధికారులు ,తిరుపతిలో జిల్లా అదనపు ఎస్పీ వెంకట్రావుతో కలసి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కార్యాలయం కేంద్రంగా పూర్తిగా నివేదికలు సుప్రీంకి అందజేసింది.

## న్యాయ విద్య, పరిశోధనకు

# అంతర్జాతీయ విశ్వవిద్యాలయం



### కౌన్సిల్‌లో మంత్రి లోకేష్

### ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు, సవరణ బిల్లును మండలిలో ప్రవేశపెట్టిన మంత్రి

### ఆయా బిల్లులకు కౌన్సిల్ ఆమోదం

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనమండలిలో న్యాయ విద్య, పరిశోధనకు భారత అంతర్జాతీయ విశ్వవిద్యాలయం బిల్లు(ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ద బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఎట్ ద ఆంధ్రప్రదేశ్ బిల్2025), ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, సవరణ బిల్లుతో పాటు ఏపీ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు2025ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టారు. ఆయా బిల్లులకు మండలి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1986లో నేషనల్ లా స్కూల్‌ను బెంగళూరులో ఏర్పాటుచేయడం జరిగింది. ఇదొక మోడల్ లా యూనివర్సిటీ. దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇలాంటి సంస్థలను అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలని 1993లో జరిగిన ప్రధాన న్యాయమూర్తుల కాన్ఫరెన్స్‌లో తీర్మానించారు. ఇందుకు బీసీఐ ఒక ట్రస్ట్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగా ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌ను గోవాలో ఏర్పాటుచేశారు. ఈ బోర్డులో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు ఉన్నారు. రాష్ట్రానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో గవర్నర్ గారు ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లే ఈ యూనివర్సిటీని సాధించుకోవడం జరిగింది. అమరావతిలో అంతర్జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. యూనివర్సిటీతో పాటు ఆర్బిట్రేషన్ సెంటర్, మీడియేషన్ అండ్ కన్సల్టేషన్ సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ లీగల్ ఎడ్యుకేషన్, జ్యుడీషియల్ ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. ఇందుకోసం ప్రత్యేకంగా కూటమి ప్రభుత్వం అమరావతిలో 55 ఎకరాలను కేటాయించింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ను >>2

## స్వదేశీ 4జితో కనెక్టివిటీ విప్లవం

### బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు27,ప్రభాతవార్తప్రతినిధి:** స్వదేశీ 4జీ నెట్వర్క్‌తో దేశంలో కనెక్టివిటీ విప్లవం వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దేశీయంగా తయారు చేసుకున్న సాంకేతికతతో దేశంలోని మారుమూల ప్రాంతాలన్నీ అనుసంధానం కావటం ప్రగతికి సూచిక అని సీఎం స్పష్టం చేశారు. శనివారం విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్వర్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం ప్రపంచ అంతా నాలెడ్జ్ ఎకానమీ దశలో ఉందని.. దీనిని మనదేశ యువత అందిపుచ్చుకోవాలని అప్పుడే సంపద సృష్టి జరుగుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీలో మొబైల్ ఫోన్ ద్వారా 735 పౌరసేవలను వాట్సప్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. 4జీ లాంటి సేవల ద్వారానే ఇది సాధ్యమైందని సీఎం వివరించారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశంలో తయారైన సెల్‌ఫోన్లు ప్రపంచ >>2

## సౌందరరెడ్డి అరెస్ట్‌పై

# దర్యాప్తు చేయండి

### సిబిఐకి హైకోర్టు ఆదేశం, విచారణ అక్టోబరు 13కు వాయిదా

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** వాలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన కుంచాల సౌందరరెడ్డి(సవేంద్రరెడ్డి) అరెస్ట్ విషయంలో పోలీసులు చట్టవిరుద్ధ చర్యలు కప్పిపుచ్చుకునేందుకు ఆయన్ని గంజాయి కేసులోకి లాగినట్లు హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. వారెంట్ లేకుండా అరెస్ట్ చేశారని,సుప్రీం కోర్టు వివిధ తీర్పుల్లో ఇచ్చిన మార్గదర్శకాలను పాటించలేదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశించింది. ఏపీహెచ్‌సీ లా బులిటిన్ ఈ విషయాన్ని వెల్లడించింది. సీబీఐ ఏపీ విభాగాధిపతి(విశాఖ)ని సుమోటోగా వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చింది. దర్యాప్తు చేసి ప్రాథమిక నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను అక్టోబరు 13కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు,జస్టిస్ టీసీడీ శేఖర్‌ల ధర్మాసనం ఈ మేరకు కీలక ఉత్తర్వులిచ్చింది.ఈ నెల 22వ తేదీన తన భర్తను పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ సౌందరరెడ్డి భార్య లక్ష్మీప్రసన్న 23న హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్‌ను దాకలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 24న జరిగిన విచారణలో ప్రత్తిపాడు ఎస్‌హెచ్‌వో హైకోర్టుకు హాజరై సౌందరరెడ్డిని గంజాయి రవాణా కేసులో తాము అరెస్ట్ చేశామన్నారు. అరెస్ట్ సమయంలో పోలీసు యూనిఫాం ఎందుకు ధరించలేదని ధర్మాసనం అడిగిన ప్రశ్నకు నిందితుడు అప్రమత్తమై తప్పించుకుపోయే ప్రమాదం ఉందని బదులిచ్చారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ 'సౌందరరెడ్డిని 22న రాత్రి 7.30 నుంచి 8.45 మధ్య అరెస్ట్ చేశామని మీరు చెబుతున్నారు. అదే రోజు తన భర్తను అపహరించారని సాయంత్రం 7 గంటలకు సౌందరరెడ్డి భార్య తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తరపు న్యాయవాది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఠాణా సీసీ టీవీ ఫుటేజ్‌ను తమ ముందు ఉంచాలని తాడేపల్లిపోలీసులను ఆదేశించాం. మరోవైపు సెల్‌ఫోన్ లొకేషన్ వివరాలను సమర్పించాలని కోరామని పేర్కొంది.ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ధర్మాసనం..కోర్టు ముందున్న ఆధారాలను పరిశీలిస్తే పోలీసుల చట్ట విరుద్ధ చర్యలను కప్పిపుచ్చుకోడానికి సౌందరరెడ్డిని ఎన్‌డీపీఎస్ (గంజాయి) కేసులోకి లాగారని ప్రాథమికంగా స్పష్టమవుతోంది. అరెస్ట్ సమయంలో పోలీసులు యూనిఫాంలో ఉండాలని డీకే బసు కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది.ప్రస్తుత కేసు విషయంలో >>2




# తెలుగుజాతిని నం.1 చేస్తా

>> కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సచివాలయాల ఉద్యోగులు పోటీ పడి తొలిరోజునే 97 శాతం ఫింఛన్ల పంపిణీని పూర్తి చేస్తున్నారు. నెలకు రూ.2745 కోట్లను ఫింఛన్లకు ఖర్చు చేస్తున్నాం. మొత్తంగా 63.50 లక్షల మందికి ఫింఛన్లను పంపిణీ చేస్తున్నాం. ఫింఛన్లు అందుకుంటున్న వారిలో 59 శాతం మంది మహిళలే ఉన్నారు. ఫింఛన్లు ఇవ్వడమే కాకుండా.. పంపిణీ ఎలా జరుగుతుందన్న అంశం మీద లబ్దిదారుల నుంచి అభిప్రాయాలు కూడా తీసుకుంటున్నాం. ఏడాదికి రూ.32,143 కోట్లు పెన్షన్ల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఏపీ తర్వాత తెలంగాణ, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి. తెలంగాణలో ఏడాదికి రూ.8,179 కోట్లు, కేరళ రూ.7295 కోట్లు పెన్షన్లు కింద ఖర్చు పెడుతున్నాయి. అంటే పెన్షన్ల కోసం ఏపీ ఖర్చు పెట్టే దాంట్లో పావు వంతు ఖర్చు పెడుతున్నాయి." అని సీఎం వివరించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకు మహిళలు 8.86 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారు. స్త్రీ శక్తి వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది. ఉచిత బస్సు స్కీంకు ఏడాదికి రూ.2963 కోట్లను ప్రభుత్వం ఖర్చు పెడుతోంది.. అయినా ఫర్వాలేదు.. ఆనందంగా ఖర్చు పెడతాం. స్త్రీ శక్తి పథకం నాకు చాలా సంతృప్తినిచ్చిన పథకం. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు స్త్రీ శక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న 97 శాతం మందికి స్త్రీ శక్తి పథకం గురించి తెలుసు. 85 శాతం మంది స్త్రీ శక్తి పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు.స్త్రీ శక్తి పథకం అమలుతో సోషల్ గేదరింగ్ పెరిగింది. మహిళలకు ఉచిత ప్రయాణాల వల్ల డబ్బు కూడా ఆదా అయింది. ఆడబిడ్డల ఆర్థిక ఎదుగుదలకు స్త్రీ శక్తి పథకం తోడ్పడింది" అని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకాన్ని సమర్థవంతంగా అమలు చేశాం. ఈ పథకానికి రూ. 10,090.74 కోట్లను ఖర్చు పెట్టాం.ఎంత మంది పిల్లలు ఉంటే.. అంత మంది పిల్లలకు తల్లికి వందనం అమలు చేశాం. ఇప్పటికీ తల్లికి వందనం పథకం ఎరికైనా అందకుంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 2,79,720 మందికి రూ.363.64 కోట్లు అందచేస్తున్నాం. మొత్తంగా తల్లికి వందనం లబ్దిదారులు 66,57,508 మంది విద్యార్థులు ఉన్నారు. దీపం2.0 పథకం అమలు చేశాం. నా తల్లి వంటింట్లో పడే కష్టాలను చూసి... మరే మహిళా ఆ కష్టాలు పడకూడదని ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం పెట్టాం. ఇప్పుడు దీపం2.0 పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటి వరకు 2.66 కోట్ల ఉచిత సిలిండర్లు మహిళలకు అందచేశాం.. దీని నిమిత్తం రూ.1718 కోట్లను ప్రభుత్వం భరిస్తోంది" అని చంద్రబాబు అన్నారు.

ద్వాక్రా సంఘాల ద్వారా మహిళలను బలోపేతం చేశాం. ద్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున డబ్బులను పొదుపు చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి పూర్తి స్థాయిలో చెల్లించేస్తున్నారు. ద్వాక్రా మహిళల్లో కేవలం 1 శాతం మాత్రమే ఎన్పీఏలుగా ఉన్నారంటే మహిళా శక్తి ఏంటో అర్థం చేసుకోండి. చాలా పరిశ్రమలు, చాలా మంది అప్పులు తీసుకుని ఎన్పీఏలుగా మారుతున్నారు. కానీ ద్వాక్రా సంఘాలు మాత్రం తీసుకున్న అప్పులను నిఖార్సుగా తిరిగి చెల్లిస్తున్నారు. లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. ప్రతి ఎమ్మెల్యే 1000 మంది మహిళలను గుర్తించి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలి" అని సీఎం సూచించారు, ఇప్పటి వరకు 14 సార్లు తిరుమల వేంకటేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించాను. ఎవ్వరికీ దక్కని అదృష్టం నాకు దక్కింది. పెద్ద ఎత్తున క్లైమోర్ మైన్లు పెట్టి నన్ను హతమార్చాలని చూశారు. వేంకటేశ్వర స్వామి ప్రాణభిక్ష పెట్టాడు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పించే విధానానికి శ్రీకారం చుట్టాం. ఈ తరహా పాలసీ మరే ఇతర రాష్ట్రంలోనూ లేదు. 1.63 కోట్ల మంది పేదలకు రూ. 25 లక్షల వరకు ఉచితంగా చికిత్సలు అందించేలా పాలసీ రూపొందించాం. మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో భాగంగా ఏడాదికి వేట విరామ సమయంలో రూ.20 వేలు అందిస్తున్నాం. మత్స్యకారులకు ఇబ్బందిగా మారిన జీవో నెంబర్ 217 రద్దు చేశాం. పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ లు అందిస్తున్నాం. బీసీలకు సబ్సిడీ మీద, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ లు అందిస్తాం" అని సీఎం స్పష్టం చేశారు. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇప్పటి వరకు 3 లక్షల ఇళ్లు పూర్తి చేశాం. వచ్చే ఏడాది జూన్ నాటికి 6.15 లక్షల ఇళ్లను అందుబాటులోకి తెస్తాం. 2029 నాటికి ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఇవే కాకుండా.. మేనిఫెస్టో హామీలను చాలా వరకు అమలు చేశాం. చెత్తపన్నును రద్దు చేశాం.. రైల్వే జోన్ ఏర్పాటయ్యేలా చూశాం.. విశాఖకు పెద్ద ఎత్తున కంపెనీలు తెచ్చాం. అంగన్వాడీలకు గ్రాట్యుటీ పెంచాం"అని ముఖ్యమంత్రి తెలిపారు.

"గత ప్రభుత్వంలో రాష్ట్రంలోని చాలా దేవాలయాల్లో అపవిత్ర కార్యక్రమాలకు పాల్పడ్డారు. రామతీర్థంలో రాముని తలను తీసేశారు. అంతర్వేదిలో రథాన్ని తగులపెట్టారు. దుర్గమ్మ గుళ్లో వెండి సింహాలను దొంగిలించారు. ఇదేంటని ప్రశ్నిస్తే... విగ్రహాలే కదా వేరే విగ్రహాలు పెట్టుకోండని ఎద్దేవా చేసినట్టు మాట్లాడారు. టీటీడీలో కూడా చాలా అపచారాలు చేశారు. ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నాం.ఉచిత ఇసుక పాలసీలో ఇప్పటికీ కొన్ని అంశాలు నా దృష్టికి వస్తున్నాయి. ఉచిత ఇసుకలు అక్రమాలు చోటు చేసుకోకుండా స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలే చూసుకోవాలి. గత ప్రభుత్వం ఇసుకలో పెద్ద స్కాం జరిగింది. దేశంలో బెస్ట్ ఎక్సైజ్ పాలసీని తెచ్చాం. వ్యవసాయానికి ఉచితంగా తొమ్మిది గంటలవిద్యుత్ అందిస్తున్నాం. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం. ఇంకా పెండింగులో ఉన్న ఉద్యోగుల సమస్యలను త్వరలో తీరుస్తాం. చెప్పిన మాటకు కట్టుబడి అన్నీ చేస్తున్నాం. పీ4లో భాగంగా స్వచ్ఛంధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చాం.మొత్తంగా 99,822మంది మార్గదర్శులు 9,68,513 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించడానికి పీ4 వేదిక. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన దిశగా అందరూ పని చేయాలని సీఎం కోరారు.



శనివారం విజయవాడ ఎగ్జిబిషన్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

## అమరావతికి బ్రాండ్ సిఎం చంద్రబాబు: బాలకృష్ణ

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతికి బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నటుడు, తెలుగుదేశం పార్టీ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఉద్ఘాటించారు. సీఎం చంద్రబాబు అనుభవంతో ఏపీ దేశ పటంలోనే సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందని నొక్కిచెప్పారు. ఏపీలో ఆర్థిక సమస్యలు చాలా ఉన్నాయని వ్యాఖ్యానించారు.ఒక ఈవెంట్ నిర్వహణ సంస్థ నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్2025లో భాగంగా శనివారం గొల్లపూడిలో ఎగ్జిబిషన్ను బాలకృష్ణ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. కూటమి ప్రభుత్వంలో పర్యాటక రంగాని విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆశీస్సులు, కటాక్షం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. 46 రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. 11రోజుల పాటు కనక దుర్గమ్మను వివిధ రూపాల్లో అలంకరిస్తారని వివరించారు. కళకు చావు లేదని.. కళలను నేటి తరానికి చాటి చెప్పాలని ఉద్ఘాటించారు. కూచిపూడి, తోలు బొమ్మలు కృష్ణా జిల్లాలో ప్రాచుర్యం పొందాయని వ్యాఖ్యానించారు. సినిమాలకు రాజధాని విజయవాడ అని నొక్కిచెప్పారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎంతోమంది తోడ్పడ్డారని తెలిపారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామని ఉద్ఘాటించారు. అమరావతిలో నిర్మించే హాస్పిటల్ను త్వరలోనే పూర్తి చేస్తామని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని),మైలవరం ఎంఎల్ఏ వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.ఇక గతఅయిదు రోజులుగా విజయవాడ ఉత్సవ్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, రైడింగ్స్,ఈవెంట్లు జరుగుతున్నాయి.పలువురు ప్రముఖులు ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.

## అంతర్జాతీయ విశ్వవిద్యాలయం

>> పాటిస్తాం. ఏపీ విద్యార్థులకు 25శాతం సీట్లు రిజర్వ్ చేశాం. మరోవైపు కూటమి ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ ను ఏర్పాటుచేస్తామని గతంలో హామీ ఇచ్చాం. ఆ ప్రక్రియ కూడా ప్రారంభించాం, పూర్తిచేస్తాం. అక్కడ కూడా ఆర్బిట్రేషన్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, సవరణ బిల్లును మంత్రి లోకేష్ మండలిలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏపీలో ప్రైవేటు యూనివర్సిటీల కోసం 11.02.2016లో ప్రత్యేక చట్టం చేశారు. అందులో ప్రధానంగా గ్రీన్ ఫీల్డ్, బ్రౌన్ ఫీల్డ్ కేటగిరిలు చేశారు. ఈ చట్టం కింద 14 ప్రైవేటు యూనివర్సిటీలు రాష్ట్రానికి వచ్చాయి.

ఈ యాక్ట్కు 2023లో సవరణ చేశారు. ఆ సవరణలో టాప్ 100 గ్లోబల్ యూనివర్సిటీలతో జాయింట్ సర్టిఫికేషన్ డిగ్రీ ఉంటేనే అనుమతించాలని నిబంధన పెట్టారు. యూజీసీ 2022 రెగ్యులేషన్ లో జాయింట్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఎలిజిబిలిటీ క్రైటీరియా ఇచ్చారు. న్యాక్ 3.0 కంటే ఎక్కువ ఉండాలి, లేకపోతే కనీసం మూడు గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ లు ఉండాలి, ఎన్ఐఆర్ ఎఫ్ ర్యాంకింగ్స్ లో టాప్100లో ఉండాలి అంటూ అనేక నిబంధనలు పెట్టారు. దీనివల్ల గ్రీన్ ఫీల్డ్ యూనివర్సిటీలు న్యాక్ కు అర్హత సాధించాలంటే కనీసం నాలుగేళ్ల నుంచి ఆరేళ్లు పడుతుంది. మనం చేసిన చట్టం ఏకంగా యూజీసీ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉంది. దీనివల్ల విదేశీ యూనివర్సిటీలు దేశానికి రావాలన్నా,రాష్ట్రంలో యూనివర్సిటీలు ప్రారంభించాలన్నా ఇబ్బందిగాఉంది. దీంతో జాయింట్ సర్టిఫికేషన్ డిగ్రీని తొలగించి ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ సవరణ బిల్లును తీసుకువచ్చామన్నారు.సవరణ బిల్లు2025ను కూడా మంత్రి శాసనమండలిలో ప్రవేశపెట్టారు. కుష్టువ్యాధి అనే పదం తొలగించేందుకు సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఆయా బిల్లులను శాసనమండలి ఆమోదించింది.

## అసెంబ్లీ నిరవధిక వాయిదా

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభా సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడుతెలిపారు. ఎనిమిది రోజులపాటు జరిగాయి అసెంబ్లీ సమావేశాలు. 23 బిల్లులు సభలో ప్రవేశపెట్టామని అన్ని బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయని పేర్కొన్నారు. మూడు బిల్లులు ఉపసంహరణ చేశామని వెల్లడించారు. అసెంబ్లీలో ఆరు అంశాలపై లఘుచర్చ జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో శాసనసభ నిరవదిక వాయిదా వేశామని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. ఏపీ శాసనమండలి ఆరు బిల్లులకు ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ వర్సిటీ ఏర్పాటు బిల్లు2025ను మండలి ఆమోదించింది. న్యాయవిద్య, పరిశోధన కోసం అమరావతిలో భారత అంతర్జాతీయ వర్సిటీ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ ప్రైవేటు వర్సిటీల (స్థాపన, క్రమబద్ధీకరణ) చట్టం2025, ఏపీ వర్సిటీల సవరణ బిల్లు2025ను శాసనమండలి ఆమోదించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కుష్టు వ్యాధి అనే పదం తొలగించేందుకు చేసిన చట్టసవరణకు మండలి ఆమోదం తెలిపింది. ఏపీ వ్యవసాయ భూమి ( వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు) చట్టం 2006 బిల్లు, ఏపీ పబ్లిక్ సర్వీసులకు నియామకాల నియంత్రణ, వేతన సరళీకరణ బిల్లు2025, టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ సాయిని డిప్యూటీ కలెక్టర్గా నియమించే ప్రతిపాదన కోసం చేసిన చట్టసవరణను సభ ఆమోదించింది. ఏపీ వస్తుసేవల పన్ను (సవరణ) బిల్లు2025కు శాసనమండలి ఆమోదం లభించింది. అనంతరం ఛైర్మన్ మోషేన్ రాజు శాసనమండలిని నివధిక వాయిదా వేశారు.



వరద ప్రభావానికి గురైన రైలుమార్గం పటిష్టపరుస్తున్న అధికారులు

## సీమ రైల్వేడివిజన్లో రైలు పట్టాలను తాకిన వరద

### అప్రమత్తమైన రైల్వే యంత్రాంగం, పరిమిత వేగంతో తిరుగుతున్న రైళ్లు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 27, ప్రభాత వార్త:** కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలు,వరద ప్రభావం రాయలసీమలోని గుంతకల్లు రైల్వే డివిజన్ కు తాకింది. సమాచారం అందుకున్న డి ఆర్ ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డి ఆర్ ఎం సుధాకర్ సంబంధిత ఉన్నతాధికార యంత్రాంగంతో పరిస్థితిని సమీక్షి ంచి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. స్పిక్ ప్రత్యేక రైలులో సంఘటనా స్థలానికి హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. ప్రస్తుతం దక్షి ణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ లో వరద నీరు రైలు మార్గాన్ని తాకిన విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు అప్రమత్తమై రైలు మార్గం పటిష్టత పనులను చేపట్టారు. కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీరు శనివారం గుంతకల్లు రైల్వే డివిజన్ లోని చెన్నైముంబై ప్రధాన రైలుమార్గంలో గుంతకల్లు వాడి సెక్షన్,నాల్వార్ సోంపూర్ హాళ్లీథానగుండీ స్టేషన్ ల మధ్య వరదనీరు భారీగాచేరి రైలుమార్గానికి చెందిన ఒవైపును కోసి వేయడం సమాచారం తెలుసుకున్న డి ఆర్ ఎం సి ఎస్ గుప్తా, అదనపు డి ఆర్ ఎం సుధాకర్, సీనియర్ డి ఇ ఎన్ కోఆర్డినేషన్ జి బి ఎస్ శ్రీనివాస్ ల అధ్వర్యంలో రైల్వేమార్గం పర్యవేక్షక విభాగం, రైల్వే వంతెనల విభాగం అధికారులు, సీనియర్ సబార్డినేట్లు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రైలుమార్గం పటిష్టత పనులను చేపట్టారు. రైల్వేకి సంబంధించిన ప్రత్యేక యాంత్రాలతోపాటు,జెసిబి, హిటాచి, వంటి భారీ యంత్రాల సహాయంతో,కంకర, మట్టిపనులతో రైలుమార్గాన్ని పటిష్టత, సామార్థ్యపనులను చేపట్టారు. వరద నీరు ప్రవాహానికి రైలు మార్గం దెబ్బతినకుండా ప్రత్యేక ప్యాట్రో లింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎలాంటి పరిస్థితులనైన ఎదుర్కోనేందుకు ముందస్తుగా ప్రత్యేకంగా కాంట్రాక్టు కార్మికులను, ఇసుక బస్తాలను, స్లీపర్లను, రైలు కమ్మీలను సిద్ధంగా ఉంచాలని డి ఆర్ ఎం,అదనపు డి ఆర్ ఎంలు ఆదేశించారు. ప్రయాణీకుల సౌకర్యార్థం, రైళ్లరాకపోకలకు అంతరాయం ఉత్పన్నంకాకుండా సంబంధిత అధికారులు సదరు ఘటన ప్రాంతాలలో పరిమిత వేగంతో రైళ్ళు నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

## స్వదేశీ 4జితో కనెక్టివిటీ విప్లవం



బీఎస్ఎన్ఎల్ రజతోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

>> దేశాలు వాడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని 14.30 లక్షల పైచిలుకు డ్వాక్రా గ్రూపులకు చెందిన మహిళలు స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నారని వివరించారు. స్మార్ట్ ఫోన్ కారణంగా ఆర్థిక పరిస్థితులు, జీవన ప్రమాణాలు పెరిగాయని స్పష్టం చేశారు. 2030 నాటికి 6జి కూడా అందుబాటులోకి వచ్చేస్తుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీలు ఇప్పుడు రియాలిటీలోకి వచ్చేశాయని.. 2026 జనవరి నాటికి అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ రకరకాల యాప్స్ ద్వారా 90 శాతం విదేశీ కంపెనీలకు డబ్బు చెల్లిస్తున్నామని, ఈ పరిస్థితి మారాలని సీఎం పిలుపునిచ్చారు. పేటెంట్స్ కూడా గరిష్టంగా నమోదు కావాలని అన్నారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుందని భారతీయులు, తెలుగువాళ్లు నెంబర్1గా ఎదగాలని సీఎం ఆకాంక్షించారు.అలాగే బీఎస్ఎన్ఎల్ నుంచి మరిన్ని కొత్త ఆవిష్కరణలు రావాలని.. వినియోగదారులకు మరింత మెరుగ్గా ఆ సంస్థ సేవలు అందించాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలోని 97,500 ప్రాంతాల్లో 4జీ స్వదేశీ నెట్వర్క్ను బీఎస్ఎన్ఎల్ అందించనుంది. ఏపీలోని 10 మారుమూల గ్రామాలు సహా దేశవ్యాప్తంగా 108 గ్రామాల్లో 4జీ సేవలను ప్రధాని మోదీ వర్చువల్ గా ప్రారంభించారు. దేశానికి సరైన నేతగా ప్రధాని మోదీ సరైన స్థానంలో ఉన్నారని అన్నారు. అందుకే స్వదేశీ 4జీ నెట్వర్క్ లాంటి విప్లవాత్మక మార్పులు దేశంలో చోటు చేసుకుంటున్నాయని సీఎం అన్నారు. ఒడిశాలోని జార్సుగూడ నుంచి ప్రధాని మోదీ బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్ వర్క్ ను ప్రారంభించిన సందర్భంగా విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్ లో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, సీడాట్ సీఈవో ఉపాధ్యాయ్, బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ వివేక్ బంజాల్ పాల్గొన్నారు.

## మండలిలో అధికార,ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం

### తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వఉద్యోగం కోసం బిల్లు

### అభ్యంతరం వ్యక్తం చేసిన వైఎస్సార్సీ, బిల్లును రిజర్వ్లో పెట్టిన ఛైర్మన్

**సచివాలయం,సెప్టెంబరు27,ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టిడిపి కార్యకర్త తోట చంద్రయ్య హత్యకు గురైన సమయంలో తాము అధికారంలోనికి వస్తే ప్రభుత్వ ఉదో ్యగం ఇస్తామని చంద్రయ్య కుటుంబానికి టిడిపి అధినేత హామీ ఇచ్చారు.ఈ మేర అధికారంలోనికి రావడంతో ఉదో ్యగం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.ఇందులో భాగంగా చంద్రయ్య కుటుంబానికి ఉద్యోగం ఇచ్చేందుకు చట్టసవరణ చేసే బిల్లుపై శనివారం శాసనమండలిల ప్రవేశపెట్టారు.మండలిలో శనివారం రాజకీయ ప్రేరేపిత గొడవల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ప్రతిపాదనపై మండలిలో చర్చ జరిగింది.దీన్ని పల్నాడులో రాజకీయ ప్రేరేపిత గొడవల్లో మృతి చెందిన చంద్రయ్య కుటుంబానికి ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదన వైసీపీ తిరస్కరించింది.చంద్రయ్య కుమార్డు తోట వీరాంజనేయులును జూనియర్ అసిస్టెంట్గా నియమించేందుకు చట్ట సవరణ కు అంగీకరించలేదు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ శాశ్వత ఉదో ్యగం ఇచ్చే ప్రతిపాదనలపై చట్టసవరణ పై తీవ్ర అభ్యంతరం తెలిపింది.చంద్రయ్య కుటుంబానికి ఉద్యోగం ఇచ్చే అంశంపై అధికార,ప్రతిపక్షాల వాద ప్రతివాదనలు జరిగాయి.రాజకీయ ప్రేరేపిత గొడవల్లో మృతి చెందిన కుటుంబానికి శాశ్వత ఉద్యోగం ఇవ్వడం సరికాదని బొత్స పేర్కొన్నారు.

ఇలాంటి చర్యలవల్ల రాజకీయ గొడవలు తగ్గడం కాదని ప్రోత్సహించి నట్లవుతుందని తెలిపారు. భావితరాలకు ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారో తెలుసుకొని చట్ట సవరణ చేయాలని సూచించారు. రాజకీయ హత్య అయితే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.మంత్రి పయ్యావుల మాట్లాడుతూ ఫ్యాక్షన్ను అంతమొందించడంలో భాగంగా బాధితులకు న్యాయం చేసేందుకే చట్ట సవరణ చేస్తున్నట్లు తెలిపారు.విపక్షనేత బొత్స మాట్లాడుతూ ఇలా ఉదో ్యగాలిస్తే ఫ్యాక్షన్ అంతమొందించడం కాదు..ఫ్యాక్షన్ను ప్రోత్సహించినట్లు అవుతుందని పేర్కొన్నారు.ఛైర్మన్ కొయ్యే మోషేన్రాజు మాట్లాడుతూ బిల్లును సమావేశం చివర్లో తీసుకుంటామని తెలిపారు.చంద్రయ్య కుటుంబానికి ఉద్యోగం కోసం చట్ట సవరణ చేసి ప్రతిపాదనను వైసీపీ తిరస్కరించింది.దీంతో చట్ట సవరణ చేయకుండానే శాసనమండలిని ఛైర్మన్ మోషేన్ రాజు నిరవధిక వాయిదా వేశారు.

## ర్యాలీలో ఘోరం

>>16 మంది మహిళలు కూడా ఉన్నట్లు తమిళనాడు ఆరోగ్యమంత్రి మా సుబ్రహ్మణియన్ చెప్పారు. వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణులు ఇతర ఆసుపత్రులనుంచి కరూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పరిస్థితిపై వెంటనే స్పందించారు. ఆరోగ్యమంత్రిని వెంటనే కరూర్ వెళ్లాలని ఆదేశించారు. బాధితుల తరలింపులో సహాయకార్యక్రమాల్లో స్థానిక ప్రజలు ఆరోగ్యసిబ్బందికి, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తిచేసారు. బాధితులకు అన్నివిధాలా సాయం అందిస్తామని ప్రకటించారు. సుబ్రహ్మణియన్తోపాటు వి సెంథిల్బాలాజీని కూడా కరూర్కువెళ్లాలని ఆదేశించారు. కరూర్ కలెక్టర్ను ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాల విద్యమంత్రి అన్బిల్ మహేష్ పోయ్యమోజికూడా కరూర్కువెళ్లమని స్టాలిన్ ఆదేశించడంతో వెంటనే ఆయన కూడా అక్కడకు చేరుకున్నారు. వెంటనే అక్కడ తక్షణ చర్యలు తీసుకుని పరిస్థితిని అదుపులోకి తేవాలని సీఎం అదనపు డిజిపికి సూచించారు. ప్రధాని నరేంద్రమోడీ, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిలు ఈ ప్రమాదం దిగ్భ్రాంతికి గురిచేసిందని సంతాప సందేశాలు ఇచ్చారు. చికిత్సపొందుతున్న బాధితులు సత్వరమే కోలుకోవాలని ఆకాక్షించారు. వాస్తవానికి టివికె విజయ్ కరూర్కు మధ్యాహ్నమే రావాల్సి ఉంది. అయితే సుమారు ఆరుగంటలు ఆలశ్యంగా రాత్రి ఏడు గంటలకు వచ్చారు. విజయ్ చేరుకునేసరికే రోడ్షో కావడంతో 30 వేలమందికిపైగా వచ్చారు. తొక్కిసలాటజరిగి ఈ ఘోరం సంభవించింది. ఈసంఘటన జరిగిన వెంటనే విజయ్ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపివేసారు. ఈసంఘటనకు సంబంధించి విజయ్ బాధ్యులని తేల్చి కరూర్ పోలీసులు కేసునమోదుచేసారు. అలాగే కరూర్ ర్యాలీకి అనుమతి తీసుకున్న టివికె నేతలను కూడా అరెస్టులుచేసారు. పోలీసులు చేసిన పదేపదే హెచ్చరికలను కూడా నిర్వాహకులు పెడచెవి నపెట్టారని పోలీసులు చెపుతున్నారు. బాధితులు, మృతులను తరలించేందుకు రెండు అంబులెన్సులు అక్కడికి వచ్చాయి. మరిన్ని వాహనాలు సంఘటన ప్రాంతానికి చేరుకోవడమే అత్యంత కష్టం అయింది. అభిమానులు ఆసాంతం విజయ్ ఉన్న వాహనాన్ని చేరుకోడానికి పెద్ద ఎత్తున తోపులాటకు దిగడంతోనే ఈఘోర విపత్తు సంభవించిందని ప్రాథమిక అంచనా. మృతుల సంఖ్య మరింతగా పెరగవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

### ప్రధానిమోడీ సంతాపం

తమిళనాడులోని కరూర్లో సంభవించిన తొక్కిసలాట మృతులసంఘటనపై ప్రధానిమోడీ తీవ్ర విచారం వ్యక్తంచేసారు. జరిగినసంఘటన అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలని ఆయన తమిళనాడు ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని ఆకాక్షించారు.

### మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలపరిహారం

కాగా ఈ తొక్కిసలాటలో మృతుల్లో ఒక్కొక్కరి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని సీఎం స్టాలిన్ ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థికసాయం అందిస్తామని, క్షతగాత్రులకు కార్పొరేట్స్థాయి వైద్యచికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం స్టాలిన్ తెలిపారు.

## ప్రధాని మోడీ వచ్చే 16న కర్నూలు రాక



**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడి అక్టోబర్ 16వ తేదీన ఎపిలో పర్యటించనున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధానమంత్రి పర్యటిం చనున్నారు. శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకోనున్నారు. కర్నూలులో మోడితో కలిసి కూటమి నేతల రోడ్షో ఉండనుంది. జీఎస్టీ సంస్కరణలపై మోడి, సిఎం చంద్ర బాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ మేరకు మోడి పర్యటన వివరాలను మంత్రి లోకేష్ శాసనమండలి లాబీలో మంత్రులు, ఎమ్మెల్సీల వద్ద వెల్లడించారు.

## దర్యాప్తు చేయండి

>> ప్రత్తిపాడు ఎస్హెచ్వో ప్రకారం సౌందరరెడ్డిని అరెస్ట్ చేసేటప్పుడు పోలీసులు యూనిఫాంలో లేదు.అరెస్ట్ విషయంలో ఈ కోర్టు సహజంగా లోతుల్లోకి వెళ్ళదు. తన భర్తను అపహరించారని సౌందరరెడ్డి భార్య తాడేపల్లి పోలీసులకు 22న సాయంత్రం 7 గంటలకు ఫిర్యాదు చేశారు. మరోవైపు అదే రోజు సాయంత్రం 7.45-8.30 మధ్య సౌందరరెడ్డిని వేరే ఠాణా పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు రిమాండ్ రిపోర్టు ప్రకారం ఈ నెల 22న రాత్రి 8.30కి అరెస్ట్ చేశామని, మధ్యవర్తుల నివేదికను సాయంత్రం 7.30-8.45కి మధ్య సిద్ధం చేశామని పేర్కొన్నారు. మీడియేటర్ల రిపోర్టు 7.30నుంచి తయారు చేస్తుంటే 8.30 గంటలకు అరెస్ట్ చేయడం ఏంటి? ఈ విషయంలో స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో నిర్బంధానికి గురైన వ్యక్తి స్వేచ్ఛకు విఘాతం కల్గకుండా మేం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత కేసుల అరెస్ట్ చేసిన పోలీసు అధికారుల సదుద్దేశ్యంపై సందేహం ఇఉన్నందున జోక్యం చేసుకుంటు న్నాం. ఈ కేసులోని అంశాలు,దర్యాప్తు చేయాల్సిన వ్యక్తుల్లో రాష్ట్రపోలీసు అధికారులు ఉన్నందున, కేసులో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాజ్యంలో సీబీఐని ప్రతివాదిగా చేర్చుతున్నాం.

విచారణ జరిపి ప్రాథమిక నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తున్నాం. సీబీఐ ప్రాథమిక నివేదిక ఇచ్చేంత వరకు సౌందరరెడ్డిని గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ కోర్టు ముందు హాజరుపర్చే ప్రక్రియను వాయిదా వేస్తున్నాం. సౌందరరెడ్డి సెల్ఫోన్ టవర్ లోకేషన్ డేటా తాడేపల్లి ఠాణా సీసీటీవీ ఫుటేజ్,రిమాండ్ రిపోర్టు,ఫిర్యాదును సీల్డ్ కవర్లో సీబీఐకి అప్పగించాలని రిజిస్ట్రార్ జ్యూడీషి యల్ను ఆదేశిస్తున్నాం'అని పేర్కొంది.

## వారం - వర్జ్యం

28-09-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
షష్ఠి మ.2.25
జ్యేష్ఠ రా.3.54
వర్జ్యం : సా.5.21-7.07
దు.సా.4.20-5.08
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. షేర్లు, భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**వృషభం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**మిథునం:** బంధు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వివాహ, ఉద్యోగయత్నాలు సాగిస్తారు.

**కర్కాటకం :** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు స్థాన చలనం.

**సింహం:**దూర ప్రాంతాల నుండి ముఖ్య సమాచారం అందుకొంటారు. చర్చాగోష్టులలో పాల్గొంటారు.

**కన్య :** దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**తుల :** పనులలో ఆటంకాలు ఎదురైనా అభివృద్ధికూడా అంతర్లీనంగా ఉంటుంది.

**వృశ్చికం:** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. ప్రయాణాలు.

**ధనుస్సు:** పారిశ్రామిక, రాజుకీయ రంగాలలోని వారికి కొంతవరకు అనుకూలంగా వుంటుంది.

**మకరం:** ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారాలలో స్వల్ప మార్పులు.

**కుంభం:**గృహ సంబంధమైన విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్త అవసరం.

**మీనం :** ఉన్నతాధికారులతో మాట్లాడే టప్పుడు సహనాన్ని, ఓర్పును వహించడం చెప్పదగిన సూచన.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## హైదరాబాద్ వరద బాధితులకు అండగా నిలవండి

### అభిమానులకు డిసిఎం పవన్ సూచన

విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి :వరద భాధితులకు అండగా నిలవాలని అభిమానులకు ఏపీ డిప్యూటీ సిఎం,సినీ నటుడు పవన్ కళ్యాణ్ సూచించారు. జనసేన తెలంగాణ నాయకులు శ్రేణులకు ఈ మేరకు దిశా నిర్దేశం చేశారు. వరద భాధితులకు ధైర్యం చెప్పి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

హైదరాబాద్ సహా తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. మూసీ వరద కారణంగా ఎబీబీఎస్‌తో పాటు పరిసరాలు నీట మునిగాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం లోని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సహాయక చర్యలు చేపట్టిందని వివరించారు.

ప్రభుత్వ సూచనలు,వాతావరణ హెచ్చరికలను ప్రజలు అనుసరించాలని సూచించారు.

## తిరుపతి ఐఐటిని ప్రపంచస్థాయి క్యాంపస్‌గా తీర్చి దిద్దుదాం!

### రూ.2313కోట్లతో రెండవ పేజ్ భవనాలు

### వర్చువల్ విధానం ద్వారా ప్రధాని శంకుస్థాపన




రెండవ దశ పనులకు భూమి పూజ, జ్యోతి ప్రజ్వాలన చేస్తున్న కలెక్టర్, ఎంపి

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త** తిరుపతి పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న ఐఐటిని ప్రపంచ స్థాయి క్యాంపస్‌గా తీర్చి దిద్దాలని భారత ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. శనివారం న్యూఢిల్లి నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రదాని రూ.2313కోట్ల రెండవ దశ భవనాలకు ఆయన శంకుస్థాపన చేసారు.పది సంవత్సరాల క్రితం తిరుపతి జిల్లాలో ఐఐటిని మంజూరు చేసారు. రెండవ దశ భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసారు. పదేళ్ళ ప్రస్తానంలో ఎన్నో విజయాలు సాధించిన తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫేసర్ సత్యనారాయణ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిధులుగా తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ మద్దెల గురుమూర్తి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ హాజరయ్యారు.వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాలకు సంబంధించి డైరెక్టర్ ప్రొపెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తిరుపతి ఐఐటి అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు మంజూరు చేసిందని వివరించారు. రెండవదశ పనులకు రూ.2,313కోట్లు మంజూరు చేయగా ఇందులో భవన నిర్మాణాల కోసం రూ.1,243 కోట్లు కేటాయించామన్నారు. రూ.517కోట్లు పరికరాలు,ఫర్నిచర్ కోసం టెండర్లు పిలిచామన్నారు.ఈ సందర్బంగా ప్లానింగ్ మరియు ఇన్‌ఫ్రాక్చర్ డైరెక్టర్ డీన్ ప్రొఫేసర్ ఎ.మురళీకృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాబోయే నిర్మాణానికి సంబంధించి వివరించారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్‌మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ ఇదో అందమైన లోకంగా మారగలదన్నారు. భారత దేశంలోని ఐఐటిలో తిరుపతి మొదటి స్థానంలో నిలవటానికి కృషి చేస్తామన్నారు. తిరుపతి జిల్లాకు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలో ఇదో ఎపెద్ద విద్యాసంస్థయే కాకుండా పేరు ప్రతిష్టలకు నిలయంగా తీర్చి దిద్దాలని పిలుపు నిచ్చారు. అటు వంటి క్యాంపస్‌ను తీర్చి దిద్దటంలో డైరెక్టర్ సత్యనారాయణ చొరవను అభినందించారు.సెమి కండక్టర్లు,శక్తి నిల్వ వంటి రంగాలలో జరుగుతున్న ముఖ్యమైన పరిశోధనా కార్యాకపాలను తీర్చి దిద్దటంలో ఐఐటి చొరవను ఎంపి ప్రశంసించారు.ప్రాంతీయ పర్యవరణ వ్యవస్థకు మద్దతు ఇచ్చే పరిష్కారాలను అందించటానికి సవాళ్ళను ఎదుర్కొవాల్సి ఉందని ఎంపి అభిప్రాయపడ్డారు.అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. వర్చువల్ విధానంలో తిరుపతిఐఐటిలో ంరెండవ దశ నిర్మాణ పనులకు వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన సభలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఓ వైపు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ నేపధ్యంలో ఐఐటి ఓ వరం అన్నారు. పేస్ టూ పనులతో తిరుపతి ఐఐటి రూపు రేఖలు మారిపోతాయన్నారు.విద్యార్థులు,అధ్యాపకులు, విద్యావేత్తలు పరిశోధనలతో మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రపంచ స్థాయి క్యాంపస్‌గా తీర్చిదిద్దటంలో డైరెక్టర్ సత్యనారాయణ చొరవ కృషి ప్రశంసనీయం అన్నారు. ఈ అభివృద్ధి సమాజానికి ఎపెద్ద ముందడుగు అన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ బి.ఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు ఏడుకొండలస్వామి గరుడసేవ - శనివారమే నిండిన కొండ

### - రెండు లక్షల మంది భక్తులకు గ్యాలరీల్లో సౌకర్యం

**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** సప్తగిరీశుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైనది గరుడవాహనసేవ. ఐదవరోజు రాత్రికి (నేడు)జరిగే అత్యంత కమనీయమైన ,ప్రాధాన్యత వున్న గరుడవాహనసేవకు టిటిడి అదనపు ఏర్పాట్లు చేసింది. నేటి సాయంత్రం 6.30 గంటలకు ఈ గరుడవాహనసేవ మొదలవుతుంది. ఈ వాహనసేవ విశిష్టతను దృష్టిలో వుంచుకుని రెండులక్షలమంది భక్తులు ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లుచేశారు. దసరా సెలవులు కూడా రావడంతో శనివారం ఉదయానికి తిరుమలభక్తజనసంద్రంగా మారిపోయింది. పెరటాసి మాసం రెండవశనివారం కావడం,ఆదివారం గరుడసేవకోసం తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్నాటక నుండి భారీగా భక్తులు తరలివస్తున్నారు. నేటి రాత్రి ఏర్పాట్లుపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, సివిఎస్‌ఓ మురళీకృష్ణ, ఎస్పీ లంకెల సుబ్బరాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సారి బ్రహ్మోత్సవాలకు అదనంగా ఈశాన్యంవైపు 8 వేలమంది భక్తులు కూర్చునేలా గ్యాలరీ అందు బాటులోకి వచ్చిందని, దక్షిణ వైపు రెండు వేల మంది భక్తులకు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. గరుడ సేవలో మొత్తం 2.30లక్షల మంది గ్యాలరీ ల్లో కూర్చుని స్వామి వారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేపట్టారు. నాలుగు మాఢ వీధుల్లో అధునాతన మరుగుదొడ్లు అందు బాటులో వున్నాయి. తిరుమలలో మొత్తం 38ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేశారు. ఉదయం 11గంటల నుండే భక్తులను అనుమతించి, 14 రకాల అన్నప్రసాదాలు, ఆహారపదార్థాలు నిరంత రాయంగా శ్రీవారిసేవకులతో అందించేలా అన్నీ సిద్ధమయ్యాయి. నిరంతరాయంగా భక్తులకు సాంబార్నం, పెరుగన్నం, బిస్మిల్లాబాత్, సాయంత్రం సుండలు తదితర అన్నప్రసాదాలు, తాగునీరు, నాలుగులక్షల మజ్జిగ ప్యాకెట్లు, కాఫీ, పాలు అందిస్తారు. ప్రతిగ్యాలరీలో శ్రీవారి సేవకులు ,పారిశుధ్య సిబ్బంది అన్నప్రసాదం సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా సూచనలు చేశారు. 8లక్షలు లడ్డూలునిల్వచేసి భక్తులకు నేడు విక్రయించనున్నారు .తిరుమలలో నాలుగు వేలవాహనాలు మించితే అలిపిరిలో నిలిపివేసి పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాలని ఈఓ సింఘాల్, ఎస్పీ సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు.



## కళాకారులతో నృత్యం చేసిన టిటిడి ఇఓ సింఘాల్



**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** కొండపై జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో అధికార దర్పం చూపకుండా స్వామిసేవకుడిగా ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ భక్తులతో, కళాకారులతో మమేకమై తానూ స్వామిసేవకుడినేనని వాయిద్యనృత్య సేవ చేశారు.

## ఆలయ సిబ్బందికి వేమిరెడ్డి బ్రహ్మోత్సవ బహుమానం



**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల ఆలయంలోని పోటు సిబ్బంది, వాహనం మోతదారులు,మేళంసిబ్బంది, కల్యాణకట్ట క్షురకులకు బోర్డు సభ్యురాలు, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి వస్త్రబహుకరించారు. వైభవోత్సవమండపంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఈ వస్త్రాలను పంపిణీ చేశారు.గత 8సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాల్లో స్వామివారిఆశీస్సులతో విజయ వంతంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఆలయ పేష్కార్ రామకృష్ణ, పోటు పేష్కార్ మునిరత్నం ఉన్నారు.

## పెరిగిన పెరటాసి రద్దీ

### - స్వామివారి దర్శనానికి 30 గంటలు



**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన పెరటాసిమాసం రెండవశనివారం, దసరాసెలవులతో బాటు బ్రహ్మోత్సవాల్లో నేటి సాయంత్రం గరుడసేవజరగనుండటంతో 36 గంటలు ముందుగానే తిరుమలకు భారీగా భక్తులు చేరుకుంటున్నారు. దేవదేవుని దర్శనానికి తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. సామాన్య భక్తులు తిరుమలలో స్వామివారి దర్శనానికి 30గంటలుపాటు నిరీక్షించాల్సిన అవసరం వస్తోంది.గరుడసేవ దృష్ట్యా సర్వదర్శనం తప్ప మిగిలిన అన్ని దర్శనాలను రద్దుచేశారు. తిరుమలకు చేరుకున్న భక్తులకు క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తున్నాడనేది భక్తులు ఆవేదన. శనివారం ఉదయం నుండే వైకుంఠం కాంప్లెక్స్‌లలోకి ప్రవేశించే భక్తుల సంఖ్య అంతకంతకూ పెరిగింది. సాధారణంగా తమిళభక్తులకు అత్యంత పవిత్రమైన మాసం కావడంతో కాలినడకన కూడా ఎక్కువగా వస్తున్నారు. శనివారం సాయంత్రానికి సర్వదర్శనం కోసం భక్తులు బారులుతీరారు. వైకుంఠం-2లో కంపార్టుమెంట్లన్నీ నిండిపోయి సర్వదర్శనానికి భక్తులు వెలుపల బారులుతీరారు.

## అమృత్ 2.0 పనులు 2027 నాటికి పూర్తి

### - మంత్రి నారాయణ

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** అమృత్ 2.0లో భాగంగా తణుకు,నిడదవోలు, పాలకొల్లు,నర్సాపురం,భీమవరం,ఆకివీడు ప్రాంతాలకు రూ.420 కోట్లతో త్రాగునీరు అందించే పనులను 2027 నాటికి పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల్లో మంత్రి మాట్లాడారు. తణుకులో రూ.118.11 కోట్లతో చేపడుతున్న పనుల్లో 65 కి.మీ డిస్ట్రిబ్యూటరీ పైపులైన్లు,4,900 ఇళ్ళకు తాగునీటి కనెక్షన్లు ఇస్తామన్నారు. ఫ్రీబిడ్‌కు సంబంధించి గుత్తేదారులు అడిగిన అంశాలను కేబినెట్‌లో పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరులో తనికెళ్ళపాడు నుంచి గోరంట్ల వరకు రూ.33.53 కోట్లతో అమృత్-1లో మంజూరైన పనులు 90 శాతం పూర్తయ్యాక గుత్తేదారు ఆపేశారని తెలిపారు.

## సవీంద్ర కేసు సిబిఐకి అప్పగించటాన్ని స్వాగతిస్తున్నా : జగన్

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** సవీంద్ర కేసును సీబీఐకి అప్పగించటంపై వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్ హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన సుమోటో ఆదేశాలను తాను స్వాగతిస్తున్నానంటూ శనివారం ట్వీట్ చేశారు. సత్యమేవ జయతే హ్యాష్ ట్యాగ్‌తో ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. హైకోర్టు నిర్ణయం రాష్ట్రంలో నెలకొన్న ఆందోళనకరమైన పరిస్థితికి నిదర్శనమన్న వైఎస్ జగన్.. చంద్రబాబు ప్రభుత్వంలో పోలీసులు హైకోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోవటం లేదన్నారు. ప్రశ్నించే గొంతులను అణిచివేస్తున్నారని ఆరోపించారు. వాక్ స్వాతంత్ర్యాన్ని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్ 111ని దుర్వినియోగం చేయటం నిత్యకలత్యంగా మారిందన్నారు. సరైన విచారణ, ప్రజల హక్కుల పరిరక్షణ అవసరాన్ని కోర్టు ఆదేశాలు తేటతెల్లం చేశాయని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

## మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

### వైద్య శిబిరాల ద్వారా ముందస్తుగానే పరీక్షలు

### - ప్రతి ఒక్కరికి కేన్సర్ పరీక్షలు నిర్వహణ : ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు

**చిత్తూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** ఆరోగ్య చిత్తూరు జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించాయని ఈ మేరకు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు ప్రతి ఒక్క మహిళ హాజరై ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని అందుకు అనుగుణంగా చికిత్స పొంది ఆరోగ్య సమాజం ఆవిష్కరణకు నడుం బిగించాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. చిత్తూరు మురకంబట్టు జివిజి కళ్యాణ మండపంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో శనివారం స్వస్థ నారి స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో నిర్వహించిన వైద్య శిబిరంను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రారంభించారు. అలాగే అక్కడే నిర్వహించిన గర్భవతుల శ్రీమంతం కార్యక్రమంలో ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మహిళ వెన్నుముక లాంటిదని, మహిళ ఆరోగ్యంగా వుంటేనే తన కుటుంబం ఆరోగ్యంగా వుంటుందని, మహిళ ఆరోగ్యంగా వుంటే తన కుటుంబం బాగుం టుం దన్నారు. ప్రతి మహిళకు తన ఆరోగ్యం పట్ల అవగాహన వుండాలన్నారు. ప్రధాని నరేంద్రమోడి స్వస్థ నారి స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంకు శ్రీకారం చుట్టి క్షేత్ర స్థాయిలో విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రతి మహిళకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకున్నారన్నారు. వైద్య శిబిరాలకు ఆరోగ్యం సరిగా లేనపుడే వచ్చి పరీక్షలు చేసుకుంటారని, అలా కాకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినపుడు ముందస్తుగానే పరీక్షలు చేయించుకోవాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు, పూర్వీకులు జొన్న, రాగి సంగటి తింటూ ఆరోగ్యంగా వుండేవారని, ప్రస్తుతం మన ఆహార అలవాట్లు మారాయని, అలాగే కష్టపడటం తగ్గడంతో రోగాలు పెరిగిపోతున్నాయన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా వున్నప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు.

చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం వైద్య శిబిరాల్లో ప్రత్యేక స్పెషలిస్టు డాక్టర్లతో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందిస్తారన్నారు.



స్వస్థ నారీ స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

# తిరుమల సమాచారం

## కల్పవృక్షంపై వైకుంఠవాసుడు



**తిరుమల, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదించే కల్పవృక్షాన్ని వాహనంగా చేసుకుని కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు శనివారం ఉదయం ఊరేగాడు. రాజమన్నార్ అలంకారంలో మలయప్పస్వామి శ్రీదేవి భూదేవులతో కలసి ఉదయం కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించారు. వాహన మండపం వద్ద జీయరుస్వాముల వేదమంత్రోచ్చరణల నడుమ ,అర్చకులు కర్పూరహారతులిచ్చిన అనంతరం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరాడు. స్వామివారి వాహనంముందు భక్తులు గోవిందా...తిరుమలవాసా గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. క్షీరసాగరమధనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్పవృక్షం ఒకటి. ఈ చెట్టునీడన చేరినవారికి ఆకలిదప్పులుండవు. పూర్వజన్మస్మరణ కలుగుతుంది. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా ,భక్తజన బృందాలు చెక్కభజనలు,జీయ్యంగార్ల గోష్టితో స్వామివారిని కీర్తించారు.ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి,దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నరేశ్, శాంతారాం, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్‌ఓ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## సర్వభూపాలునిపై శ్రీహరి



**తిరుమల,సెప్టెంబర్ 27 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం ఏడుకొండలవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో శనివారంరాత్రి శ్రీ కృష్ణ పరమాత్ముడిగా ఉభయదేవేరులతో కలసి సర్వభూపాల వాహనంపై మలయప్పస్వామి భక్తులను కటాక్షించాడు. చేతిలో వెన్నముద్దలతో నవనీతకృష్ణుడి అలంకారంలో మలయప్ప సాయంత్రం సర్వభూపాల వాహనంలో ఆలయ మాఢవీధుల్లో ఊరేగారు. రాజులకురాజు సర్వభూపాలుడు, ఆయనే అన్నింటా ఉత్తమోత్తముడు. భక్తులు గోవిందనామస్మరణలతో ఆలయమాఢవీధులు పులకించాయి. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు ,టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్‌ఓ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

## గరుడసేవకు చెన్నై గొడుగులు

### - ఏడుకొండలస్వామికి తొమ్మిది గొడుగులు అందజేత



**తిరుమల,సెప్టెంబర్ 27 ప్రభాత వార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వర స్వామికి జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో నేటి(ఆదివారం)రాత్రికి జరిగే గరుడవాహనసేవకు అలంకరించేందుకు గొడుగులు చేరాయి. శనివారం ఉదయం తొమ్మిది గొడుగులను చెన్నైకి చెందిన హిందూ ధర్మార్థ సమితి నిర్వాహకులు టిటిడి ఆలయ అధికారులకు అందజేశారు. ప్రతి ఏటా సాంప్రదాయాన్ని పాటిస్తూ తమిళనాడు చెన్నై నుండి గరుడసేవకు గొడుగులు అందించడం జరుగుతుంది. చెన్నై హిందూ ధర్మార్థసమితి ట్రస్టీ ఆర్‌ఆర్ గోపాల్‌జీ ,సమితి వ్యవస్థాపకుడు వేదాంతం, భక్తబృందంతో కలసి కాలినడకన శనివారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. ఉదయం తిరుమలలోని పెద్దజీయర్‌మఠం వద్దకు చేరుకున్న చెన్నై గొడుగులకు టిటిడి అధికారులు మంగళవాయిద్యాల నడుమ ,పూజలుచేసి స్వీకరించారు. బేడిఆంజనేయస్వామి ఆలయంవద్దనుంచి ఈ గొడుగులను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్‌కు అందజేశారు. అనంతరం ఆలయ మాఢవీధుల్లో ప్రదర్శనగా తీసుకువచ్చి ఆలయంలోనికి చేర్చారు. నేటి రాత్రి జరిగే గరుడసేవలో ఈ గొడుగులు అలంకరిస్తారు. కాగా చెన్నై గొడుగులను శుక్రవారం సాయంత్రం తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయానికి 2గొడుగులు సమర్పించారు. గత 18 సంవత్సరాలుగా వెంకన్నపై భక్తివిశ్వాసాలతో ఈ గొడుగులు సమర్పిస్తున్నామని గోపాల్‌జీ తెలిపారు.

## తిరుమలేశుని చెంతకు గోదాదేవి మాలలు



**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాత వార్తప్రతి నిధి:** తమిళనాడు విల్లిపుత్తూరు గోదాదేవి ఆలయం నుండి తీసుకువచ్చిన పవిత్రమైన పూలమాలలను తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆలయ అధికారులు అందజేశారు. శ్రీవారికి గోదాదేవి (ఆండాళ్)ప్రియభక్తురాలు. తమిళనాడు విల్లిపుత్తూరు ఆలయంలోని గోదాదేవి స్వయంగా ధరించిన పూలమాలలను వేంకటేశ్వరస్వామి గరుడసేవలో అలంకరించడం ఆనవాయితీ. మంగళవాయిద్యాల నడుమ ఆద్యంతం భక్తిశ్రద్ధలతో విల్లిపుత్తూరు ఆలయం నుండి వచ్చిన పూలమాలలు,చిలుకలను బుట్టలో పెట్టుకుని శనివారం మధ్యాహ్నం తిరుమలకు చేరారు. తమిళనాడు దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ సెల్లదొరై, విల్లిపుత్తూరు ఆలయ ఛైర్మన్ రవిచంద్రన్ ,ఆలయ ఈఓ ముత్తురాజ,ఆలయ స్థానాచార్యులు రమేష్‌స్వామి,సుదర్శన్ తిరుమలలో ఊరేగంపుగా బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేర్చారు. ఇక్కడ పూలమాలలకు పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,పేష్కార్ రామకృష్ణ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుండి ఊరేగింపుగా మాఢవీధుల మీదుగా ఆలయంలోనికి చేర్చారు. నేటి రాత్రికి జరిగే గరుడవాహనసేవలో విల్లిపుత్తూరు గోదాదేవి పూలమాలలు అలంకరిస్తారు. పెరటాసి మాసంలో గోదాదేవి ధరించిన పూలమాలలను గరుడసేవలో వినియోగించడం సంప్రదాయం.

## ఉత్సవమూర్తులకు కుంకుమపువ్వు మాలలు, కిరీటాలు

## వేదమంత్రాలతో 'స్నపనతిరుమంజనం'



**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాత వార్తప్రతి నిధి:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు శనివారం మధ్యాహ్నం 1గంట నుంచి 3గంటల వరకు వేదమంత్రాలతో, శాస్త్రోక్తంగా తొలిస్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవ మూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామికి విశేష పవిత్ర జలాలతో నీరు,చందనం, కొబ్బరి జలం, పాలు, పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ధూప దీపకర్పూర హారతులిచ్చారు. ఈ మండపాన్ని పలురకాల విదేశీ పండ్లు, సువాసనల పుష్పాలతో అలంకరించారు. బాదం,పిస్తా,యాలకుల మాలలు అలంకరించారు. పెద్దజీయ్యంగార్లు, చిన్నజీయ్యంగార్లు, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,ఆలయ పేష్కార్ రామకృష్ణ, బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాంతారాం, నరేశ్, జానకిదేవి, అర్చకులు పాల్గొన్నారు.

ఆక్వా ఎగు మతుల్లో దేశంలోనే 70శాతం ఉత్పత్తులతో ఏపీ అగ్రస్థానంలో ఉండగా అందులో కూడా ఉభయ గోదావరి జిల్లాల రైతుల ద్వారానే ఆక్వాఉత్పత్తులు ఎగుమతులు జరుగుతున్నాయని అంచనా. డాలర్ల సంపద దేశానికి, రాష్ట్రానికి తీసుకొస్తున్న ఆక్వా రంగాన్ని నిర్లక్ష్యం చేయడం ద్వారా రైతులే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా నష్టపోతుందని ఆందోళన వ్యక్తం అవుతోంది. అంపశయ్య మీదకు వెళుతున్న ఆక్వా పరిశ్రమ నిలదొక్కుకోవాలంటే పటిష్టమైన జీవోల ద్వారా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, మేతల్లోనూ, మందు ల్లోనూ, ఎగుమతుల ప్రక్రియలోనూ సిండికేట్ వ్యవస్థను రూపుమాపితేనే ఆక్వా రైతులు బాగుంటారని ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



ట్రంప్ విధించిన సుంకాల బారి నుంచి ఆక్వా రైతులు బయటపడాలంటే ప్రభుత్వం చేయ దగ్గ విద్యుత్తు, మేత, మెడిసిన్లలో రాయితీలు వచ్చేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటేనే ఆక్వా పరిశ్రమ ముందుకు వెళ్తుందని,అప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాం క్షించిన లక్ష్యానికి చేరువ కాగలమని ఆశాభా వం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు సబ్సిడీ విషయంలో తాత్సారం చేయడం ఆక్వా రైతులకు ఇబ్బందికరంగా మారింది. గత ప్రభుత్వంలో తొలగించిన ఆక్వా విద్యుత్తు కనెక్షన్లను కూటమి ప్రభుత్వం తాత్సారం చేయకుండా వెంటనే పునరుద్ధరించాలి. అక్టోబర్ నెల నాటికి సబ్సిడీ వచ్చేలా చొరవచూపడంద్వారా ఆక్వా రైతులు కొంత వరకు ఉపశమనం పొందుతారు.

# ఆపదలో ఆక్వా పరిశ్రమ!

**వట్టికూటి గోవింద రావు**

ఇప్పటికే ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రంగానికి ట్రంప్ సుంకాల దెబ్బతో మరింత అథఃపాతాళానికి వెళ్లేలా చేసింది. డాలర్ల పంటగా పేరుగాంచిన ఆక్వా పరిశ్రమ వరుస దెబ్బలతో కుదేలవుతోంది. విదేశీ ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టిన ఆక్వా పరిశ్రమ క్రమక్రమంగా అథఃపాతాళానికి జారుకునే పరిస్థితిలోకి వెళ్లిపోయే ప్రమాదంలో పడింది. రాష్ట్రంలో సుమారు 4.50లక్షల ఎకరాల్లో ఉన్న ఆక్వా పరిశ్రమ ఈసంక్షోభ పరిస్థితుల్లో రైతులు ఆక్వాకు దూరమవుతుండగా ఏపీ ప్రభుత్వం పది లక్షల సాగువరకు విస్తరించాలన్న లక్ష్యం వరుస దెబ్బల ధాటికి అసలుకే ఎసరు వచ్చే పరిస్థితిలోకి వెళ్లిపోతోంది. ఓ పక్క సుంకాల దెబ్బ, మరోపక్క దళారుల దోపిడీ, అన్నివైపులా చుట్టేస్తున్న తెగుళ్ల బెడద వెరసి ఇక మేము ఆక్వాసాగును ఇక చేయలేమంటూ రైతులు చేతులెత్తేస్తున్నారు.ఏపీలో అధికారిక లెక్కల ప్రకారం 4.50 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందని అంచనా. రాబోయే రోజుల్లో ఈ విస్తీర్ణాన్ని పదిలక్షల వరకు తీసుకెళ్లాలని ఇటీవలే విజయవాడలో నిర్వహించిన ఆక్వారైతుల సదస్సులో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అయితే ఆక్వారంగంలో ఉన్న సమస్యలన్నిటీపైనా కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే పరిష్కార మార్గాలను చూపాలని ఆయన కోరారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారంలోకి వచ్చాక విదేశీ సుంకం అదనంగా 25 శాతం భారం పడింది. అయితే అది అమలు కాకుండానే ఆ మాటను ఆధారంగా చేసుకున్న ఎక్స్‌పోర్టర్లు టన్నుకు రూ.30 వేల నుంచి రూ. 40 వేలు తగ్గించి వందల కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని, రైతుల కష్టం రైతులకు దక్కకుండా చేస్తున్నారని ఆక్వా రైతులు వాపోతున్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక సీడ్‌కు సంబంధించిన మేత మీద విదేశీ సుంకం పూర్తిగా తొలగించినప్పటికీ టన్నుకు రూ. 25వేలు నుంచి రూ.30వేలు తగ్గించాల్సి ఉన్నా అది అమలు కాకపోగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో రైతులు అపార నష్టాన్ని చవిచూస్తున్నారంటున్నారు. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు విషయంలో తెలంగాణా ప్రభుత్వంతో పోల్చుకుంటే ఏపీలో అత్యధికంగా 60శాతం ఎక్కువ డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆక్వా చెరువులకు ఎక్కువగా 100 కేవీఏ, 63కేవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో ఇది భారీ తేడా కనపడుతుండగా ఈ లోపాన్ని రైతులు ఎత్తి చూపిస్తున్నారు. మొత్తం మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధిని కల్పిస్తోన్న ఆక్వారంగానికి ఒక్క



విద్యుత్తు సరఫరాలో రాయితీ తప్ప మరింకేమీ ఒరిగిందేమీ లేదని ఆక్వా రైతులు పెదవి విరుస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. నేటికీ క్రమబద్ధీకరించని రాయితీ విద్యుత్తు కారణంగా ఆక్వా రంగం సమస్యలను ఎదుర్కొంటోంది. వైసీపీ ప్రభుత్వంఆఖరి ఏడాదిలో ఒక్కసారిగా రాష్ట్రంలో సుమారు 12 వేల విద్యుత్తు కనెక్షన్లు వివిధకారణాలను చూపించి తొలగించింది. గత ప్రభుత్వంలో తొలగించిన విద్యుత్తు కనెక్షన్లను కూటమి ప్రభుత్వం వచ్చినవెంటనే పునరుద్ధరిస్తామని హామీకూడా ఇచ్చింది.అయితే నేటికీ రాష్ట్రంలో సుమారు 12వేల కనెక్షన్లు సబ్సిడీను కోల్పోతున్న పరిస్థితిఉంది. దీంతో ఆక్వా సాగులో డీజిల్ కొనుగోలు వల్ల అదనపు భారం పడి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి తలెత్తుతుందని రైతులు వాపోతున్నారు. నాసిరకం సీడ్ నియంత్రించే నాథుడు లేకుండాపోయాడు. ఆక్వా పరిశ్రమకు ప్రధానమైన సీడ్ విషయంలో కూడా నాసిరకం సీడ్‌ను కొన్ని హేచరీలు రైతులకు అంటగడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సీడ్ మేత విషయంలో బ్రూడ్‌స్టాక్ పైనా, లోకిట్స్, సిష్టులు, తదితర రా మెటీరియల్ ఉత్పత్తులపై కష్టమ్స్ తగ్గించినా సీడ్ ధరల్లో నియంత్రణ లేకపోవడం, నాసిరకం సీడ్ ఉత్పత్తులపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఆక్వా పరిశ్రమ తీవ్రనష్టాల్లోకి వెళుతుందంటున్నారు. ఆక్వారంగంలో కీలకంగా ఉండే సీడ్, ఫీడ్, భారీస్థాయిలో ఫామ్ ల్యాండ్స్, ఎక్స్‌పోర్టర్స్ ఇలా అనేక రంగాలను ఒక్కరే నిర్వర్తించడం వీరంతా సిండికేట్‌గా మారడంతో రైతులు గడ్డు పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందన్నారు. వీటిని నియంత్రించే పరిస్థితి లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోతున్నారు. దీనితో ఆక్వాపరిశ్రమ ఎదుర్కొంటున్న గడ్డుపరిస్థితి ఎదుర్కొంటోంది. నేపథ్యంలో ఇప్పటికే 50శాతం ఎకరాల్లో రైతులు సాగుకు దూరంగా ఉంటూ ట్యాంకులను ఖాళీగా ఉంచుతున్న దృశ్యాలు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి.ఆక్వా ఎగుమతుల్లో దేశంలోనే 70శాతం ఉత్పత్తులతో ఏపీ అగ్రస్థానంలో ఉండగా అందులో కూడా ఉభయ గోదావరి జిల్లాల రైతుల ద్వారానే ఆక్వాఉత్పత్తులు ఎగుమతులు జరుగుతున్నాయని అంచనా. డాలర్ల సంపద దేశానికి, రాష్ట్రానికి తీసుకొస్తున్న ఆక్వా రంగాన్ని నిర్లక్ష్యం చేయడం ద్వారా రైతులే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా నష్టపోతుందని ఆందోళన వ్యక్తం అవుతోంది. అంపశయ్య మీదకు వెళుతున్న ఆక్వా పరిశ్రమ నిలదొక్కుకోవాలంటే పటిష్టమైన జీవోల ద్వారా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, మేతల్లోనూ, మందుల్లోనూ, ఎగుమతుల ప్రక్రియలోనూ సిండికేట్ వ్యవస్థను రూపుమాపితేనే ఆక్వా రైతులు బాగుంటారని ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రంప్ విధించిన సుంకాల బారి నుంచి ఆక్వా రైతులు బయటపడాలంటే ప్రభుత్వం చేయదగ్గ విద్యుత్తు, మేత, మెడిసిన్లలో రాయితీలు వచ్చేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటేనే ఆక్వా పరిశ్రమ ముందుకు వెళ్తుందని, అప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించిన లక్ష్యానికి చేరువ కాగలమని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు సబ్సిడీ విషయంలో తాత్సారం చేయడం ఆక్వా రైతులకు ఇబ్బందికరంగా మారింది. గత ప్రభుత్వంలో తొలగించినఆక్వా విద్యుత్తు కనెక్షన్లను కూటమి ప్రభుత్వం తాత్సారం చేయకుండా వెంటనే పునరుద్ధరించాలి. అక్టోబర్ నెల నాటికి సబ్సిడీ వచ్చేలా చొరవచూపడం ద్వారా ఆక్వా రైతులు కొంత వరకు ఉపశమనం పొందుతారు. దేశ సరిహద్దుల్లో చనిపోతామని తెలిసినా ఎలా దేశ రక్షణకోసం జవాను ముందుకు వెళతాడో నష్టం తప్పదని తెలిసినా ప్రస్తుత పరిస్థితుల్లో ఆక్వారైతులు ఆక్వారంగంలోనే కొనసాగుతున్నారు. అదేవిధంగా అనేక దేశాలకు ఆక్వా దిగుమతులు అవసరం ఉన్నాయి. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క వెరైటీ రొయ్యలను, చేపలను వినియోగిస్తుంటారు. ఆమేరకు ఆక్వా ఉత్పత్తులను ప్రోత్సహించవలసి ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో వెనామీ రంగంరొయ్యల ఉత్పత్తి అధికంగా ఉంది. దీనినే అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. ప్రపంచ విపణి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అక్వారంగంలో వేర్వేరు వంగడాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ప్రస్తుతం రొయ్యలను, చేపలను ఎక్కువ కాలం నిల్వ ఉంచడానికి ఆధునిక పద్ధతులు అందుబాటులో లేవు. ఫ్రీజింగ్‌వల్ల కొన్నిరోజులు మాత్రమే రొయ్యలు, చేపలు తాజాదనాన్ని కోల్పోకుండా ఉంటాయి. దీనితో చెరువుల నుంచి వచ్చిన రొయ్యల ఉత్పత్తిని ఆఘమేఘాలపై ఎగుమతి చేయాల్సి వస్తోంది. ఏ మాత్రం ఆలస్యమైనా ఇక్కడ నుంచి వెళ్లిన నౌకలు సరుకు దిగుమతి చేయకుండా తిరిగి వెనక్కు వస్తుంటాయి. వేల కోట్ల రూపాయల విదేశీమారకాన్ని సాధిస్తున్న ఆక్వారంగాన్ని మరింతగా అభివృద్ధిచేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉంది. దశాబ్దాల తరబడిగా పాత విధానాలనే కొనసాగించడం వల్ల ఆశించిన మేరకు ఆక్వారంగం పురోగతి సాధించలేకపోతోంది.ఎన్నో ఏళ్లుగా కేవలం అమెరికా మార్కెట్ మీద మాత్రమే ఆధారపడిన ఎగుమతుల విధానాన్ని సవరించుకుని మన దేశం నుంచి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతులను చేసుకోగలిగే ప్రత్యామ్నాయ మార్కెట్ వెసులుబాటు ధోరణులను అనుసరించడం మరింత శ్రేయస్కరంగా ఉంటుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిసారించాల్సిన అవసరముంది. దేశానికి విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న ఆక్వారంగంపై ప్రభుత్వాలు చిన్న చూపుచూస్తుయని ఆక్వారైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ●

---

కాశ్మీర్

జమ్మూ కాశ్మీర్

# మండుతున్న 'మంచు' కొండ!

**ఎ.వి.వి ప్రసాద్**

ప్రశాంతమైన మంచుకొండల్లో ప్రమంటలు చెలరేగుతున్నాయి. సహజ సుందరమైన ప్రాంతంలో సమస్యల జ్వాలలు చుట్టుముడుతున్నాయి. కాశ్మీర్ లోయ ఉగ్రవాద ఉద్రిక్తతలతో మరిగిపోతున్న కాలంలో కూడా చాలా ప్రశాంతంగా కనిపించిన లదఖ్ ఇప్పుడు తీవ్ర సంక్షోభంతో అట్టుడుకుతోంది. అయితే ఇది హఠాత్తుగా జడలు విప్పిన భూతం కాదు. చాలా కాలం నుంచే అక్కడ స్వరాష్ట్ర ఆందోళనలు చాపకింద నీరులా సాగుతున్నాయి. అవి ఇప్పుడు హింసాత్మకం కావడమే విచారించాల్సిన అంశం. గత బుధవారం (24, సెప్టెంబరు) హఠాత్తుగా చెలరేగిన హింసాకాండలో నలుగురు మరణించగా, కొన్ని డజన్లమంది తీవ్రంగా గాయపడడం మరింత విచారకరం.పర్యావరణ మేధావి సోనమ్‌వాంగ్చుక్‌ను దీనంతటికీ బాధ్యునిగా భావించిన పోలీసులు శుక్రవారం ఆయనను అరెస్టు చేసి గుర్తు తెలియని చోటుకు తరలించినట్లు సమాచారం. మరింత రక్తపాతం జరగకుండా లేహ్ జిల్లా వ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు. పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు కనిపిస్తున్నా ఉద్రిక్తంగానే ఉంది. వాంగ్చుక్ అరెస్టు తొందరపాటు చర్యేననే అభిప్రాయం అందరి నుండి వినిపిస్తోంది. దానివల్ల ఉద్రిక్తతలు తగ్గకపోగా పెరిగే అవకాశాలున్నాయి. గతంలో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో భాగంగా ఉన్న లదఖ్ 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370ని రద్దుచేసిన తర్వాత కేంద్రపాలిత ప్రాంతంగా మారింది. అంటే కేంద్రప్రభుత్వం కనుసన్నల్లోనే ఆ ప్రాంతంలో ఏ చర్య అయినా ఉంటుంది. జమ్మూకాశ్మీర్ (జెకె)తో పాటు లదఖ్‌కు కూడా రాష్ట్రహోదా ప్రకటించాలనే డిమాండ్ అప్పటి నుంచే ఉన్నా తాజాఘటనలతో దేశం ఒక్కసారిగా నివ్వెరపోయింది. పర్యావరణ మేధావిగాపలు అవార్డులు కూడా అందుకున్న సోనం వాంగ్చుక్ నాయకత్వంలో ఆందోళనలు మొదలైన మాట వాస్తవమే అయినా శాంతియుతంగా నిరాహార దీక్షలకే అవి పరిమితమయ్యాయి. కానీ ఇప్పుడు హింసాత్మకం కావడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.ఇరుపక్షాలు ఒకరిపైఒకరు దాడులు జరుపుకోవడంతో బుధవారం పరిస్థితి పూర్తిగాఅదుపు తప్పిఘర్షణల్లో నలుగురు బలైపోవలసి వచ్చింది. యువత హింసను విడనాడాలనే వాంగ్చుక్ పిలుపునిచ్చారు. నిరసనకారులపైబాష్పవాయువు ప్రయోగించవద్దనీ, లాఠీచార్జి జరపవద్దనీపాలనా యంత్రాంగాన్ని కూడా ఆయన అభ్యర్థించారు. హింసాకాండలో ప్రజలు ప్రాణాలు కోల్పోతే నిరాహార దీక్ష ఫలప్రదంకాదని కూడా ఆయన అన్నారు.కానీ కొందరువ్యక్తులు 'జనరేషన్ జడ్'అంటూ నినాదాలు చేయడం, ఘర్షణలకు దిగడంతో పరిస్థితి చేయిదాటింది. నేపాల్‌లో ఇటీవలఅటువంటి



సోనమ్ వాంగ్చుక్

ఆందోళనలు,హింసాకాండ చెల రేగడంతో అటువంటి పరిస్థితే లదఖ్‌లోను తలెత్తిందనే ప్రచారంకొందరు చేశారు.కానీ నేపాల్‌లోని రాజకీయ సంక్షోభంవేరు, లదఖ్ ఆందోళనలు వేరు. ప్రత్యేక రాష్ట్రం కోసంగత మూడు నాలుగేళ్లుగా ప్రశాంతంగానే ఆందోళనలు జరుగుతున్నాయి. జాతుల మధ్య ఘర్షణలతో ఇంకా రావణ కాష్ఠంగానే ఉన్న మణిపూర్ కంటె భిన్నమైన పరిస్థితే లదఖ్‌లో ఉంది. కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చిన లదఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వాలనే డిమాండ్‌ను శాంతియుతంగానే వారు ఇంతకాలం అడుగుతున్నారు. లదఖ్‌లో ప్రధానంగా లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఎబి) ప్రత్యేక రాష్ట్రడిమాండ్‌తో ఆందోళనలు కొనసాగిస్తోంది. రాష్ట్ర హోదా నిరాకరిస్తే జమ్మూ కాశ్మీర్ ప్రజల మనోభావాలు ఎలా ఉంటాయో లేహ్ పరిస్థితి చూసి కనువిప్పుకలగాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లావ్యాఖ్యా నించడం కూడా మంటలను ఎగదోసినట్లయింది. అయితే ఇక్కడ ఒక విషయం గమనించవలసి ఉంది. జెకెకు రాష్ట్ర హోదా ఇస్తామని కేంద్రంచెప్పింది కానీ లదఖ్‌కు ఇస్తామని ఎలాంటి వాగ్దా నం చేయలేదు. కేంద్ర పాలిత హోదా ఇవ్వడమే ఎక్కువనే అభిప్రాయం కూడా ఉంది. ఈ పరిణా మాలు కేంద్రానికి కొత్త తలనొప్పిని కలిగించేవిగానే ఉన్నాయి. నిజానికి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్లు దేశంలోఇంకా చాలా చోట్ల ఉన్నాయి. త్రిపురలో 'టిప్రాలాండ్', అసోంలో బ్యారక్ వ్యాలీ,మహారాష్ట్ర లో విదర్భ, బీహార్‌లో మిథిల, ఇంకా మణిపూర్‌లో కొండ ప్రాంతంనుంచి ప్రత్యేకరాష్ట్ర డిమాండ్లు వినిపిస్తున్నాయి. అందుకు స్థానిక కారణాలు వేర్వేరనే చెప్పాలి. పదిసంవత్సరాల క్రితంప్రత్యేక తెలంగాణ డిమాండ్‌తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలైన తర్వాత చాలారాష్ట్రాల నుంచి అటువంటి డిమాడ్లు మొదలయ్యాయి. అయితే ఆ ఆందోళనలన్నీ చాలావరకు ప్రశాంతంగానే సాగుతున్నాయి. మణిపూర్ కథవేరు. అక్కడ జాతుల మధ్య ఘర్షణలతో హింసాకాండ పెల్లుబికింది కానీ ప్రత్యేక రాష్ట్రంకోసం కాదు.ఈశాన్య రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలను 6వ షెడ్యూల్‌లో చేర్చి కొన్నిప్రత్యేక రక్షణలు, హక్కులు కల్పిస్తున్నట్లుగా లదఖ్‌కు కూడా ప్రయోజనం చేకూర్చాలని ఎల్ఎంబి చాలాకాలం నుంచే కోరుతోంది. చైనా, పాక్‌సరిహద్దుల వద్దఉండడంతో ఆ రెండుదేశాల ప్రభావం కూడా లదఖ్‌పై కనిపిస్తూంటుంది.కానీ వాంగ్చుక్ ఉద్యమాన్ని రెచ్చ గొట్టిన దాఖలాలేవీ లేవు.మెగసెసే అవార్డుగ్రహీత కూడా అయిన ఆయన ఇంతకాలంశాంతియుతంగా ఆందోళనలు జరగాలనే సూచిస్తున్నారు.పరిస్థితి అదుపు తప్పడానికి ఆయన కారణం కాకపోయినా, ఆయన అరెస్టుతో ఇప్పుడు మరింతగా పరిస్థితి అదుపు తప్పుతుందనే పరిశీలకులు భావిస్తున్నారు.లదఖ్‌ను ఆరవ షెడ్యూలులో చేర్చడం వల్ల కేంద్రానికి వచ్చే నష్టం ఏదీఉండదు. కనీసం ఆ ప్రయోజనమైనా లదఖ్‌కు తొలుత కల్పిస్తే స్థానికులు కొంత శాంతించవచ్చు. కొన్ని మార్పులు జరిపినప్పుడు లాభనష్టాలు రెండూ సహజమే అయినా ప్రజల హక్కులకు నష్టంవాటిల్లితే ఆందోళనలు తప్పవని లదఖ్ కూడా నిరూపిస్తోంది. వాంగ్చుక్‌ను ఎక్కడ ఉంచారో, ఆయన తాజా పరిస్థితి ఏమిటో ప్రజలకు తెలియవలసి ఉంది. కేంద్రం ఆ దిశగా చర్యలు తీసుకొని తిరిగి శాంతియుత పరిస్థితులు నెలకొనే వాతావరణం కల్పించవలసి ఉంది. ●

---

బ్రిటన్

# వలసల కట్టడికే 'డిజిటల్ ఐడి'

**గన్ని మోహన్**

అక్రమ వలసలను కట్టడి చేయాలనో లేక పెరిగిపోతున్న వలసదారుల జనాభాను హేతుబద్ధీకరించడం కోసమో కాని బ్రిటన్ లేబర్‌పార్టీ ప్రధాని కీర్‌స్టార్మర్ డిజిటల్ ఐడి గుర్తింపు కార్డు వ్యవస్థను ప్రవేశపెడుతున్నారు. దీనివల్ల పౌరులకు విశిష్టప్రయోజనాలుంటాయని ప్రకటించారు. మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉండే ఈ ఐడి బ్రిటన్‌లో ఉద్యోగాలకు తప్పనిసరి అలాగే ఆరోగ్య, సంక్షేమ పథకాల్లో ప్రభుత్వపరమైన సేవలుసులభంగా అందుకునేందుకు వీలువుతుందని స్టార్మర్ చెపుతున్నారు. ఈ డిజిటల్ ఐడి అంటే ఇంచుమించుగా భారత్‌లో అమలులో ఉన్న ఆధార్ ఐడియేనని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.భారత్‌లో కూడా ఆధార్ భద్రత గోప్యతపై ఇప్పటికీ ఆందోళనలు ఉన్నట్లే బ్రిటన్‌లో కూడా పౌరుల నుంచి కలవరపాటు కనిపిస్తోంది. కేవలం బ్రిటన్ పౌరులకే కాకుండా బ్రిటన్‌లో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్న విదేశీయులకు కూడా ఈ డిజిటల్ కార్డు లభిస్తుంది. దీనివల్ల పన్నుల ఎగవేతను కూడా సులువుగా అరికట్టవచ్చున్నది ఆయన కీలక కసరత్తుల్లో ఒకటి. భారత్‌లో ఇదేవిధంగా ఆధార్‌పాన్ లింక్ ప్రతివ్యవస్థకు ఇప్పుడు అనుసంధానమై ఉంది.దీనివల్ల అక్రమ లబ్దిని పొందడంకానీ, లేదా పన్నులు ఎగవేతకు పాల్పడటం వంటివి పూర్తిగా కట్టడి అయ్యాయి.ఇప్పుడు అదే బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకు కూడా మూలం అవుతోంది. ఈ గుర్తింపు సంఖ్య వల్ల చట్టబద్ధమైన వలసదారులు, పౌరులు తమ నివాసస్థితిని సులువుగా రుజువు చేసుకోగలుగుతారు. డ్రైవింగ్ లైసెన్సులు, శిశుసంరక్షణ, సంక్షేమ పథకాలు వంటి సేవలకు దరఖాస్తు చేసుకోడం కూడా మరింత సులువవుతుంది. డిజిటల్ ఐడితో పన్ను రికార్డులు కూడా క్రమబద్ధీకరిస్తారు.ఇది కేవలం వలసల కట్టడికే కాదని బ్రిటన్ పౌరుల ప్రయోజనాలను కూడా పరిరక్షించడంతోపాటు సులువుగా ప్రభుత్వలబ్ది సమకూరుతుందని ఇది యుకె పౌరులకు గొప్ప అవకాశంగా లేబర్ పార్టీ అభివర్ణిస్తోంది. గతంలో కన్సర్వేటివ్స్ హయాంలో కూడా ఈ ఐడి స్కీం తీసుకువచ్చే ప్రతిపాదనలు తెచ్చారు. అయితే హౌస్‌ఆఫ్ కామన్స్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో వెనకడుగు వేసారు.ఒక విశిష్ట గుర్తింపు సంఖ్యతో బ్రిటన్ మొత్తంగా ఆ వ్యక్తికి గుర్తింపు లభిస్తోంది. ఇది కేవలం ఆధార్ తరహాలోనే ఉంది కాబట్టి పౌరుల స్వేచ్ఛా జీవనానికి కొంత రక్షణ ఇస్తుందన్న భావన కూడా వలస జీవుల్లో ఉంది. నిజానికి బ్రిటన్ జనాభా 6.92 కోట్లు. ఇందులో స్కాట్ ల్యాండ్,వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్‌లు కూడా ఉం టాయి. అలాగే బ్రిటన్ మొత్తం వలస పౌరులు 68.50 లక్షలమంది వరకూ ఉన్నారు. వీరిలో 81 శాతం మంది



కీర్‌స్టార్మర్


ఐరోపా యేతర దేశాల వలస జీవులే. యుకెకు, ఈ యూకు చెందనివారే వీరిలో ఉన్నారు.ఇక విదేశాల్లో జన్మించిన వారి జనాభా కూడా యుకెలో 9.3 మిలియన్ల వరకూ ఉంది.2023 జూన్ నాటికి సుమారు 12.18లక్షల మంది వచ్చారు. అదే నెలచివరి నాటికి వీరితో కలుపుకుంటే 68.50లక్షలమంది వలస జీవులున్నట్లు తేలింది.ఐరోపా జాతీయులు 1.22 లక్షల మంది ఉంటే బ్రిటన్ జాతీయులు కొత్తగా 60 వేలమంది వచ్చిచేరారు. ఏతావాతా చూస్తుంటే 2004 నుంచి 2023 వరకూ వలస జీవుల రాక 65శాతం పెరిగిందన్నది నిర్ధారణ అయింది. 2046నాటికి యుకె జనాభా మొత్తం వృద్ధి 77 మిలియన్లకు చేరుతుందని అంచనా. వీరిలో వలసజీవుల రాక కూడా 104శాతం వృద్ధి ఉంటుందని యుకె ప్రభుత్వం అంచనా వేసింది. ఈ జనాభా వృద్ధి ఎక్కువ ఇంగ్లండ్‌లోనే ఉంది. అదే నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్‌ల్యాండ్, వేల్స్‌లలో కొంత తక్కువేనని సర్వేలు చెపుతున్నాయి. ఎక్కువగా ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసమే బ్రిటన్‌కు వస్తుంటారు. వీరుకాకుండా నైజీరియా, చైనా, పాకిస్థాన్‌ల నుంచి వస్తున్నవారు కూడా లేక పోలేదు. ఇప్పుడు యుద్ధం జరుగుతున్న ఉక్రెయిన్‌తోపాటు హాంకాంగ్‌నుంచి కూడా వస్తుండటం గమనార్హం. ఈ వలసలను అరికట్టేందుకే గత ప్రభుత్వం కఠిన కార్యాచరణను అమలు చేసింది. అక్రమ ప్రవేశాలపై కఠిన చర్యలు తీసుకుంది. ఎన్నిచర్యలు తీసుకున్నప్పటికీ వలసలను కట్టడి చేయలేకపోతోంది.బ్రిటన్ జాతీయులుకాని వలసదారుల జనాభా బ్రిటన్‌లో మొత్తం 15 శాతం వరకూ ఉన్నారని అంచనా. ఈ వలసదారులు పెరుగుతున్నారన్న అక్కసుతోనే ఇప్పుడు ఐర్లాండ్‌లో కూడా భారతపౌరులపై దాడులు జరుగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెపుతున్న అమెరికా ఫస్ట్, అమెరికన్ ఫస్ట్ నినాదంతోపాటు మేక్ అమెరికా గ్రేట్‌అగైన్ (మాగా)అన్నట్లుగా ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాలు కూడా వలసలకట్టడి లేదా క్రమబద్ధీకరణకు నడుం బిగిస్తున్నాయి.ఇది కేవలం బ్రిటన్‌లో ఉన్న పౌరుల భద్రత కోసమేనని చెపుతున్నప్పటికీ ప్రధాని కీర్‌స్టార్మర్ అసలు కార్యాచరణ అక్రమ వలసలను పూర్తిగా కట్టడి చేసే లక్ష్యంతోనేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఐరోపా కూటమి నుంచి వేరుపడిన తర్వాత బ్రిటన్ స్వతంత్ర దేశంగా మారేందుకు అష్టకష్టాలు పడుతున్న సంగతి తెలిసిందే. జిడిపిని వృద్ధి చేసుకోవడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామికవృద్ధి, ఉత్పాదకత పెంపు,ప్రజలకు తక్కువ పన్నులతో కూడిన సుపరిపాలన అందించే లక్ష్యాలు ఆదేశానికి పెను సవాళ్లుగానే ముందున్నాయి. అందుకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు బ్రిటన్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. వలసల కట్టడికే తెస్తున్నారన్న అపవాదును అధిగమించేందుకు సంక్షేమం, నేరుగా ప్రభుత్వ పథకాల లబ్ది అంటే భారత్‌లో అమలవుతున్న డిబిటి లాంటివి కొన్ని చేర్చారు. వీటన్నింటినీ అంచలంచెలుగా సాధించే అవకాశం ఉన్నప్పటికీ ముందు వలసల కట్టడి కోసమే ఈ డిజిటల్ గుర్తింపును తీసుకువస్తున్నారన్నది బ్రిటన్ జాతీయులతోపాటు ప్రవాస బ్రిటన్‌పౌరుల్లోను బలంగా నాటుకుపోయిందన్నది జగమెరిగిన సత్యమే. అయితే ప్రధాని ఈ కార్యాచరణలో ఎంత మేరకు సక్సెస్ అవుతారన్నది వేచి చూడాలి. ●

---

# ఖనిజాలే దేశ భవిష్యత్తుకు ఆధారం


**డి జె మోహన రావు**

మన నిత్య జీవితంలో, ముఖ్యంగా ఆధునిక సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న ఒక అద్భుతమైన ప్రపంచంలో క్లిష్టమైన లేదా కీలకమైన ఖనిజాలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇవి భూమిపై అరుదుగా లభించే ఖనిజాలు. లిథియం, కోబాల్ట్, గ్రాఫైట్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. వీటిని ఎందుకు కీలకం అంటారంటే ఇవి లేకపోతే మనం ఈరోజు ఉపయోగిస్తున్న ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెల్‌లు, బ్యాటరీల వంటి అధునాతన ఉత్పత్తులను తయారు చేయలేం. మన దేశం 2070 నాటికి కర్బన ఉద్గారాలను సున్నాకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు వేగంగా మారుతోంది. ఈ మార్పుకు ప్రధాన ఆధారం ఎలక్ట్రిక్ వాహనాలు, సౌరశక్తి వ్యవస్థలు, శక్తిని నిల్వ చేసే బ్యాటరీలు. వీటన్నిటి తయారీకి కీలకమైన ఖనిజాలు అత్యవసరం. దేశ భద్రతకు అవసరమైన రక్షణ పరికరాల తయారీలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఒక విధంగా చెప్పాలంటే, ఈ ఖనిజాలు ఒక దేశం ఆర్థిక, సాంకేతిక, రక్షణ భవిష్యత్తుకు పునాది వంటివి. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఈ ఖనిజాల లభ్యత, సరఫరా చాలా కీలకం. దేశ ఆర్థిక వృద్ధి, సుస్థిరమైన భవిష్యత్తు, ప్రపంచ వేదికపై నాయకత్వం వహించాలంటే ఈ ఖనిజాల విషయంలో మనం స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉంది. ఇంతవరకు, మన దేశానికి అవసరమైన కీలక ఖనిజాలలో దాదాపు 90శాతం పైగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. కోబాల్ట్ కోసం కాంగో, లిథియం కోసం ఆస్ట్రేలియా, గ్రాఫైట్ కోసం చైనా వంటి దేశాలపై మనం ఎక్కువగా ఆధారపడుతున్నాం. ఈ దిగుమతుల కోసం ప్రతి సంవత్సరం సుమారు 20,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఖర్చు అవుతోంది. ఈ విదేశీ దిగుమతులపై ఆధారపడటం వల్ల మనం రెండు పెద్ద సమస్యలను ఎదుర్కొంటున్నాం. మొదటిది ఈ ఖనిజాల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో చాలా హెచ్చుతగ్గులకు లోనవుతాయి. దీనివల్ల మన దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రెండవది సరఫరా గొలుసులో ఏదైనా అంతరాయం ఏర్పడితే, మన పారిశ్రామిక ఉత్పత్తి ఆగిపోయే ప్రమాదం ఉంది. ఉదాహరణకు ఒక దేశం ఈ ఖనిజాల ఎగుమతిని ఆపేస్తే, దీనిపై ఆధారపడే పరిశ్రమలు తీవ్రసంక్షోభంలో పడిపోతాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, కేంద్ర ప్రభుత్వం జనవరి 29, 2025న 'నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్'ను ప్రారంభించింది. ఈ మిషన్ గనుల మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తుంది. దీని ప్రధాన లక్ష్యం కీలక ఖనిజాల విషయంలో మనదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడం. ఈ లక్ష్యాలను సాధించడానికి మిషన్ కోసం4,000 కోట్ల నిధులను కేటాయించారు. ఇది భవిష్యత్తులో అవసరాన్ని బట్టి మరింత పెరగవచ్చు. ఈ మిషన్ ప్రధాన లక్ష్యాలు కీలక ఖనిజాల కోసం దేశవ్యాప్తంగా అన్వేషణను వేగవంతం చేయడం, విదేశాలలో ఈ ఖనిజాలు పుష్కలంగా ఉన్న దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుని వాటిని దిగుమతి చేసుకునే మార్గాలను సులభతరం చేయడం. అలాగే ఈ ఖనిజాల శుద్ధి, పునరుపయోగం కోసం ఆధునిక సాంకేతి కతను అభివృద్ధి చేయడం.ఈ మిషన్‌ప్రారంభించకపోతే అధునాతన టెక్నాలజీ ఉత్పత్తుల తయారీ ఆగిపోయేది. ఎలక్ట్రిక్ వాహనాల లక్ష్యాలు నెరవేరకపోయేవి. ఇది చివరికి దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీసేది. ఇంతకు ముందు, భారత ప్రభుత్వం అరుదైన ఖనిజాల కోసం ఒక విధానాన్ని రూపొందించడానికి ప్రయత్నించింది.



***అంతర్జాతీయ పోటీని ఎదుర్కోవడానికి, భారత్ కీలక ఖనిజాలు సమృద్ధిగా ఉన్న దేశాలతో వ్యూహాత్మక ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కబాల్)వంటి సంస్థలు ఈ ఒప్పందాల బాధ్యతలను నిర్వహిస్తున్నాయి. స్వదేశంలోనే ఈ ఖనిజాల శుద్ధి, పునరుపయోగం కోసం పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది. అంతేకాకుండా, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలను ఈ కృషిలో భాగస్వామ్యం చేస్తున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తీసు కుంటున్న ఈ చర్యలు మన దేశాన్ని భవిష్యత్తులో కీలకఖనిజాల విషయం లో స్వయం సమృద్ధిగా మార్చడానికి దోహదపడతాయి. ఇది మన ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తిని ఇవ్వడమే కాకుండా, దేశ భద్రతను కూడా బలోపేతం చేస్తుంది.***

కానీ అది నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ లాగా ఇంత సమగ్రమైనది కాదు. ఈ మిషన్ మొదటిసారిగా నిధులు, బాధ్యతలు, నిర్దిష్ట లక్ష్యాలతో ఒక ప్రణాళికను రూపొందించింది. నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ లక్ష్యాలు ఎంత గొప్పగా ఉన్నా, వాటిని చేరుకోవడంలో కొన్ని కీలకమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. అన్వేషణలో అధిక వ్యయం, సమయం ఒక ప్రధాన సవాలు. కీలకమైన ఖనిజాల నిల్వలను కనుగొ నడం చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఈ ఖనిజాలు భూమిలో చాలా లోతుగా, లేదామారుమూల ప్రాంతాల్లో ఉంటాయి. వాటిని గుర్తించడానికి అత్యాధునిక సాంకేతికత, ఉపగ్రహ చిత్రాలు, నిపుణులైన బృందాలు అవసరం. ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుంది. దీనివల్ల పెట్టు బడులపై రాబడి ఆలస్యం అవుతుంది. మరొక సవాలు పర్యావరణ సమస్యలు. ఖనిజాల తవ్వకాలు, ముఖ్యంగా పెద్దఎత్తున జరిగేవి. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించ వచ్చు. అడవులను నరికివేయడం, నదులు, భూగర్భ జలాలు కలుషితం కావడం, జీవ వైవిధ్యం దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయి. పర్యావరణ అనుమతులు పొందడం చాలా కఠినమైన ప్రక్రియ, ఇది ప్రాజెక్టుల పురోగతిని ఆలస్యం చేస్తుంది. అలాగే అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న పోటీ కూడా ఒక అడ్డంకి. చైనా,అమెరికా వంటి దేశాలు ఇప్పటికే ఈమార్కెట్‌లో బలంగా ఉన్నాయి. విదేశాలలో గనులను కొనుగోలు చేయడానికి, లేదా వాటితో ఒప్పందాలు కుదు ర్చుకోవడానికి ఈ తీవ్రపోటీ ఒక ప్రధాన అడ్డంకి. చివరగా ఖనిజాలను భూమి నుంచి వెలికి తీయడం, వాటిని శుద్ధి చేయడం, పాత ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి వాటిని తిరిగి పొందడానికి అత్యాధునిక సాంకేతికత అవ సరం. మన దేశంలో ఈ సాంకేతిక పరిజ్ఞానం ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉంది. ఈ సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం సమగ్ర వ్యూహాలను అనుసరిస్తోంది. అన్వేషణ, తవ్వకాలలో పెట్టుబడులను పెంచడానికి ప్రభుత్వం ప్రైవేట్ రంగ సంస్థలను ప్రోత్సహిస్తోంది. దీని కోసం గనుల వేలంలో పారదర్శకమైన విధానాలను ప్రవేశ పెట్టారు. పర్యావరణానికి నష్టం కలగకుండా ప్రభుత్వం కఠినమైన నిబంధనలను రూపొందించింది. అంతేకాకుండా, పర్యావరణ అనుకూలమైన 'తవ్వకం పద్ధతులు' అనుసరించే సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అంతర్జాతీయ పోటీని ఎదుర్కోవడానికి, భారత్ కీలక ఖనిజాలు సమృద్ధిగా ఉన్న దేశాలతో వ్యూహాత్మక ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కబాల్)వంటి సంస్థలు ఈ ఒప్పందాల బాధ్యతలను నిర్వహిస్తున్నాయి. స్వదేశంలోనే ఈ ఖనిజాల శుద్ధి, పునరుపయోగం కోసం పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది. అంతేకాకుండా, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలను ఈ కృషిలో భాగస్వామ్యం చేస్తున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు మన దేశాన్ని భవిష్యత్తులో కీలకఖనిజాల విషయంలో స్వయం సమృద్ధిగా మార్చడానికి దోహదపడతాయి. ఇది మన ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తిని ఇవ్వడమే కాకుండా, దేశ భద్రతను కూడా బలోపేతం చేస్తుంది. నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ అనేది కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం కాదు. ఇది మన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక వ్యూహాత్మక ప్రణాళిక. ఈ మిషన్ విజయవంతమైతే, భారతదేశం కీలక ఖనిజాల విషయంలో స్వయం సమృద్ధిని సాధించి, ప్రపంచ పటంలో ఒక శక్తివంతమైన దేశంగా నిలబడుతుంది. ఇది వికసిత భారత్ కలను సాకారం చేయడానికి వేసిన ఒక బలమైన అడుగు. ఈ ప్రయాణంలో ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు, ప్రజలు అందరూ కలిసికట్టుగా పని చేయడం చాలా అవసరం. ●



పాల ఉత్పత్తి పెంచేందుకు రష్యా కొత్త టెక్నాలజీ

# ఆవుల మెదడులో న్యూరో ఇంప్లాంట్ల అమరిక

**మాస్కో, సెప్టెంబరు 27:** పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచే లక్ష్యంతో రష్యాకు చెందిన 'నీరీ' అనే సంస్థ సరికొత్త టెక్నాలజీకి శ్రీకారం చుట్టింది. ఆవుల మెదడులో నేరుగా న్యూరో ఇంప్లాంట్లను (బ్రెయిన్ చిప్స్) అమర్చి, వాటి ద్వారా పాల దిగుబడిని నియంత్రించేందుకు ప్రయోగాలు ప్రారంభించింది. రష్యాలోని స్వెర్డ్‌లోవ్స్క్ ప్రాంతంలో ఇప్పటికే ఐదు ఆవులపై ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించినట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ప్రక్రియలో, ఆవు తల వెనుక భాగంలో ఒక స్టిమ్యులేటర్‌ను అమర్చి, దాని నుంచి వచ్చే ఎలక్ట్రోడ్లను మెదడులోని కీలక భాగాలకు అనుసంధానిస్తారు. ఈ చిప్స్ ద్వారా విద్యుత్ సంకేతాలను పంపి ఆవుల ఆకలి, ఒత్తిడి, పునరుత్పత్తి వ్యవస్థలను నియంత్రించవచ్చని నీరీ సంస్థ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉదాహరణకు, ఒక ఆవుకు ఆకలి మందగిస్తే, ఈ సిస్టమ్ ద్వారా మెదడును ఉత్తేజపరిచి తిరిగి ఆకలి పెరిగేలా చేయవచ్చు. శస్త్రచికిత్స సమయంలో ఆవులు స్పృహలోనే ఉన్నాయని, ప్రక్రియ తర్వాత ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా తిరిగి తమ పనుల్లో నిమగ్నమయ్యాయని తేలింది.వేదించింది. పాడి పరిశ్రమలో ఉత్పత్తిని పెంచడానికి ఉన్న మార్గాలన్నీ ఇప్పటికే వాడుకలో ఉన్నాయని, తమ న్యూరోఇంప్లాంట్ టెక్నాలజీ ఈ రంగంలో ఒక విప్లవాత్మక మార్పు తీసుకువస్తుందని నీరీ ఇన్వెస్టర్ అలెక్సీ మరిజా విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ టెక్నాలజీతో తమకు మార్కెట్లో బలమైన పోటీనిచ్చే అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ చిప్స్‌ను మెరుగుపరిచే పనిలో ఉన్నామని, త్వరలోనే వీటిని వాణిజ్యపరంగా మార్కెట్లోకి విడుదల చేస్తామని కంపెనీ తెలిపింది. అయితే, నీరీ సంస్థ ప్రయోగాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్టెప్పీ అగ్రికల్చరల్ హోల్డింగ్ జనరల్ డైరెక్టర్ ఆండ్రీ నెడుజ్కో ఈ టెక్నాలజీని విమర్శించారు. ఈ ఇంప్లాంట్ల వల్ల జంతువుల ఆరోగ్యానికి అనవసరమైన ముప్పు వాటిల్లుతుందని, పైగా వీటి ధర చాలా ఎక్కువగా ఉండటం వల్ల లాభదాయకం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, ఈ విమర్శలను నీరీ సంస్థ తోసిపుచ్చింది. తమ ఉత్పత్తుల ధరలను గణనీయంగా తగ్గించే మార్గాలను ఇప్పటికే గుర్తించామని, ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ ఆపరేటింగ్ రూమ్‌లలో ఇంప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించింది.



# పార్లమెంట్ స్టాండింగ్ కమిటీల పదవీ కాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** పార్లమెంట్ స్టాండింగ్ కమిటీల పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం రెండేళ్లకు పొడిగించనుంది. బిల్లులు, విధాన విషయాలను మరింత క్షుణ్ణంగా, లోతుగా పరిశీలించేలా అధ్యయనం చేసేందుకు ప్రస్తుతమున్న ఏడాది పదవీకాలాన్ని రెండు సంవత్సరాలుకు పెంచాలని మోడీ ప్రభుత్వం పరిశీలిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. ఆయా కమిటీల పదవీ కాలం ఈ నెలలో ముగుస్తున్నందున ఈ అంశాన్ని ప్రాధాన్యత ఏర్పడింది. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తన పార్టీతో విభేదాల నేపథ్యంలో మోడీ సర్కార్ చర్య రాజకీయంగా ప్రాధాన్యత సంతరించు కుంది. గత ఏడాది సెప్టెంబర్ 26న విదేశీ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ చైర్మన్ థరూర్ నియమితులైన విషయం తెలిసిందే. ప్రభుత్వ వర్గాల సమాచారం, చైర్మన్‌గా శశిథరూర్‌ను కొనసాగించడంతోపాటు, పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచనున్నారు. ప్రస్తుతం 24 స్టాండింగ్ కమిటీలున్నాయి. ఒక్కొక్క కమిటీలో 31 మంది సభ్యులు, వీరిలో లోక్‌సభ నుండి 21 మంది, రాజ్యసభ నుండి 10 మంది ఉన్నారు. ప్రతి కమిటీ ఒక నిర్దిష్ట మంత్రిత్వ శాఖ లేదా విభాగం కార్యకలాపాలు, బడ్జెట్‌లు, విధానాలను పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీలను లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ నామినేట్ చేస్తారు. అయితే రాజకీయ పార్టీల నుండి వచ్చిన నామినేషన్ల ఆధారంగా సభ్యులను ఎంపిక చేస్తారు. ప్రతి సంవత్సరం స్టాండింగ్ కమిటీలను పునర్నిర్మిస్తారు. ప్యానెల్స్‌లో కొత్త సభ్యుల ప్రవేశం తరచుగా కొనసాగింపుకు అంతరాయంకలిగిస్తుంది. ఇటువంటి సవాళ్ల దృష్ట్యా బిల్లులు,నివేదికలు,సమస్యల లోతైన పరిశీలనకు వీలుగా కమిటీ పదవీకాలాన్ని పొడి గించాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# మాది అంతా హైబ్రిడ్ పాలన.. ఆర్మీ, పౌర పాలన చెరిసగం

## రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు

**కరాచి, సెప్టెంబరు 27:** ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం, మానవ హక్కుల విషయంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్, తమ దేశంలోని పాలనా వ్యవస్థను గట్టిగా సమర్థించుకుంది. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా మాట్లాడుతూ తమ దేశంలో సైన్యం, పౌర ప్రభుత్వం కలిసి పనిచేసే 'హైబ్రిడ్ మోడల్' పాలనను సమర్థించారు. అంతేకాకుండా అమెరికా పాలనా వ్యవస్థను 'డీప్ స్టేట్' అంటూ విమర్శించారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఆర్మీచీఫ్ ఆసిమ్‌మునీర్‌లో అమె రికాలో పర్యటించిన సందర్భంలో రక్షణ మంత్రి వ్యాఖ్యలుప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'పాకిస్థాన్‌లో సైన్యం, పౌర నాయకులు అధికా రాన్ని పంచుకుంటారు. కానీ అసలైన అధికారం సైన్యం చేతిలోనే ఉంటుంది కదా? రక్షణ మంత్రిగా మీరు ఆర్మీ చీఫ్‌కు జవాబుదారీగా ఉంటారు. మీ కంటే ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ శక్తిమంతుడు కాదా?' అని మీడియా ప్రతినిధి మెహదీ హసన్ సూటిగా ప్రశ్నించారు. ఈ వాదనను ఖ్వాజా ఆసిఫ్ తోసిపుచ్చారు. 'అలా ఏమీ లేదు. నేను రాజకీయ నేపథ్యం నుంచి వచ్చిన వాడిని' అని ఆయన బదులిచ్చారు. అమెరికాలో రక్షణ మంత్రి అక్కడి సైనిక జనరల్స్‌ను తొలగించే అధికారం కలిగి ఉంటారని, కానీ పాకిస్థాన్‌లో ఆ పరిస్థితి లేదని జర్నలిస్ట్ గుర్తు చేయగా అసిఫ్ ఘాటుగా స్పందించారు. "అమెరికాలో భిన్నమైన వ్యవస్థ ఉంది. దానిని 'డీప్ స్టేట్' అంటారు' అని ఆయన అన్నారు. పాకిస్థాన్‌లో అధికారం ఎవరి చేతిలో ఉందని పదేపదే ప్రశ్నించగా తమది 'హైబ్రిడ్' వ్యవస్థ అని అసిఫ్ సమాధానమిచ్చారు. దేశంలో నిర్ణయాలన్నీ ఏకాభిప్రాయంతోనే తీసుకుంటామని, ఒకరి మాటే చెల్లుబాటు కాదని ఆయన వివరించారు. దేశ ఆర్థిక, పాలనాపరమైన సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ హైబ్రిడ్ విధానం ఒక ఆచరణాత్మక అవసరమని ఆయన గతంలోనూ అభిప్రాయపడ్డారు. దేశంలో సైన్యం ప్రభావం ఎక్కువగా కనిపించడానికి గత సైనిక పాలకులేే కారణమని ఆయన పేర్కొన్నారు.

# ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టానికి ఎంట్రన్స్ విరుద్ధం



## సుప్రీం కోర్టును ఆశ్రయించిన 11 యేళ్ల బాలుడు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షల విధానాన్ని సవాలు చేస్తూ, ఓ 11 ఏళ్ల బాలుడు ఏకంగా సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీఎం శ్రీ పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్ట్‌లు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ జన్మేశ్ సాగర్ అనే విద్యార్థి సర్వోన్నత న్యాయ స్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. వివరాల్లోకి వెళితే, ఢిల్లీ ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం శ్రీ పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ పరీక్షలు ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం2009 స్ఫూర్తికి విరుద్ధమని జన్మేశ్ తన పిటిషన్‌లో స్పష్టం చేశాడు. తాను 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నానని, జులై 23న ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు సెప్టెంబర్ 13న పరీక్ష కూడా రాశానని తెలిపాడు. అయితే, ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ఎలాంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించరాదని విద్యాహక్కు చట్టం స్పష్టంగా చెబుతోందని పిటిషన్‌లో గుర్తుచేశాడు. ఈ ప్రవేశ పరీక్షల విధానం వల్ల పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేసి, పరీక్షలకు బదులుగా లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించాలని కోరాడు. మరోవైపు, జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి 2020) ప్రకారం ఈ సీఎం శ్రీ పాఠశాలలను ప్రత్యేక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు దిల్లీ ప్రభుత్వం చెబుతోంది. అయినప్పటికీ, విద్యాహక్కు చట్టంలోని ప్రాథమిక నిబంధనలను ఈ పాఠశాలలు కూడా పాటించాల్సిందేనని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తున్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు త్వరలో విచారణ చేపట్టే అవకాశం ఉంది.

గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేస్తున్నారా?

# ఈ పొరబాటు చేయొద్దు

**వాషింగ్టన్, సెప్టెంబరు 27:** విదేశాల నుంచి వచ్చిన వారు అమెరికాలో శాశ్వత నివాసం పొందేందుకు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటుంటారు. ఆ సమయంలో చేసే ఒక చిన్న పొరబాటు దరఖాస్తు తిరస్కరణకు దారి తీయొచ్చని అగ్రరాజ్య వలస సేవల విభాగం తాజాగా హెచ్చరిక చేసింది. అమెరికాలో శాశ్వత నివాసానికి ఉద్దేశించిన గ్రీన్‌కార్డు కోసం ఐ-485 దరఖాస్తును పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే అందులోని పార్ట్-9లో అడిగిన ప్రశ్నలకు చాలా మంది సమాధానాలు ఇవ్వడం లేదని వలసల విభాగం వెల్లడించింది. దాని వల్ల దరఖాస్తు తిరస్కరణకు గురికావచ్చని లేదా ఆ ప్రక్రియ ఆలస్యం కావొచ్చని హెచ్చరించింది. ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం అమెరికా యేటా 2,26,000 ఫ్యామిలీ ప్రిఫరెన్స్, 1,40,000 ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డులను జారీచేసేందుకు వీలుంటుంది. గ్రీన్‌కార్డు పొందే ప్రక్రియలో ఐ-485 దరఖాస్తుకు ఆమోదం లభించడం అత్యంత కీలకమైనదిగా భావిస్తారు. ఒక కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ప్రత్యేక దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుంది. అలాగే చట్టపరంగా అమెరికాకు వచ్చామని నిరూపించే పత్రాలు, జనన ధ్రువీకరణ పత్రం, వైద్య పరీక్షల రికార్డులు సమర్పించాల్సి ఉంటుంది.




**అక్టోబరు 20 నుంచి గ్రీన్‌కార్డు టెస్టింగ్‌లో మార్పులు:** ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసలకు సంబంధించిన విధానాల్లో మార్పులు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రీన్ కార్డులు పొందాలనుకునేవారిని పరీక్షించే ప్రక్రియలో మార్పులు ఉంటాయని, అక్టోబరు 20నుంచి అవి అమలులోకి వస్తాయని అమెరికా ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసింది. కొన్ని అదనపు అంశాలను పరిగణనలోకి తీసుకోనుంది. 'అమెరికా విలువలను పూర్తిగా స్వీకరించేవారికి మాత్రమే గ్రీన్‌కార్డును కేటాయించాలన్నదే మా విధానం. దానిని నిర్ధారించేందుకే ఈ మార్పులు' అని యుఎస్‌సిఐఎస్ ప్రతినిధి వెల్లడించారు. యుఎస్ చరిత్ర, ప్రభుత్వం గురించి దరఖాస్తుదారుడి అవగాహనను పరీక్షిస్తారు. సరైన నైతిక ప్రవర్తన కలిగి ఉన్నారా? అని టెస్ట్ చేయనున్నారు. మొత్తం 20 ప్రశ్నల్లో 12 ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

మరణించిన వ్యక్తుల ఖాతాల సెటిల్‌మెంట్

# 15రోజుల్లోపు చేయాల్సిందే..

## వాణిజ్యబ్యాంకులలకు ఆర్బీఐ ఆదేశాలు

**ముంబయి, సెప్టెంబరు 27:** మరణించిన వారి ఖాతాలను 15 రోజుల్లోనే సెటిల్‌చేయాలని ఆర్‌బిఐ కొత్త ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం దేశంలోని వాణిజ్యబ్యాంకుల్లోను, ప్రైవేటు బ్యాంకుల్లోను మరణించిన వ్యక్తుల పేరిట ఉన్న ఖాతాల్లో సొమ్మును వారి వారసులుగా సూచించినవారికి లేదా సంరక్షకులకు తగిన ఆధారపత్రాలుచూపించి బదలాయించడం వస్తోంది. ఇపుడు అదే లావాదేవీని 15 రోజుల్లోపు పూర్తిచేయాలని సూచించింది. 15 లక్షలవరకూ ఉన్న డిపాజిట్లను వారి నామినీలకు సులువైన పద్ధతిలో బదలాయించాలి. సహకార బ్యాంకులకు అయితే ఈపరిమితిని రూ.5 లక్షలకు మాత్రమేనిర్ణయించింది. డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలు, డిపాజిట్ లాకర్లు, సేఫ్ కస్టడీలో ఉన్న ఆభరణాలను నిర్దిష్టమైన మార్గదర్శకాలను అనుసరించి జాప్యం నివారిస్తూ బదిలీ చేయాలని సూచించింది. ఏకీకృత డాక్యుమెంటేషన్‌ను ఈసారి సూచించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంముగింపునుంచే ఈ సూత్రాలు అమలుకావాలనిసూచించింది. నామినీ లేకుండా ఉన్న డిపాజిట్లు సర్వైవర్‌షిప్ క్లాజ్ లేదా విల్లు, వంటివి కోర్టు ఆర్డర్లు లేని పక్షంలో బ్యాంకులు ఈక్లెయిమ్‌లను డెత్ సర్టిఫికేట్; క్లెయిమ్ వ్యక్తి అధీకృత గుర్తింపు తోపాటు ఇండెమ్నిటి బాండ్, ఇతర వారసులుంటే నిరభ్యంతర ధృవీకరణ పత్రాలు అందచేయాల్సి ఉంటుంది. వారసత్వ సర్టిఫికేట్ లేదా స్వతంత్ర వ్యక్తి డిక్లరేషన్ ఉండాలని సూచించింది. బ్యాంకులు థర్డ్‌పార్టీ ష్యూరిటీ బాండ్లను ఎట్టిపరిస్థితుల్లోను అనుమతించకూడదని సూచించింది. అన్ని డిపాజిట్లు అందుకున్న తర్వాత వాణిజ్య బ్యాంకులు,సహకార ప్రైవేటు బ్యాంకులు మొత్తం 15రోజుల్లోపు సెటిల్‌చేయాలని ఆదేశించింది. ఇక



లాకర్లు, సేఫ్‌కస్టడీలో ఉన్న ఆభరణాలకు సంబంధించి బ్యాంకులు క్లెయిమ్‌చేసే వ్యక్తులను సంప్రదించి 15రోజుల్లోపు పరిష్కరించాలని సూచించింది. జాప్యం జరిగితే బ్యాంక్‌రేట్ ప్రకారం సాలీనా నాలుగుశాతం చొప్పున డిపాజిట్లకు చెల్లించాలి. రోజుకు ఐదువేల రూపాయలు లాకర్లు,సేఫ్‌కస్టడీ ఉత్పత్తులపైనా చెల్లించాలి. బ్యాంకులు 2026 మార్చి 31కంటే ముందే ఈ మార్గదర్శకాలు వెంటనే అమలుకు తీసుకురావాలనిసూచించింది.

# దక్షిణ అమెరికాకు రాహుల్ గాంధీ

## బ్రెజిల్, కొలంబియా దేశాలలో పర్యటన

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దక్షిణ అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఆయన నాలుగు దేశాలలోని రాజకీయ నాయకులు, యూనివర్శిటీ విద్యార్థులు, వ్యాపార దిగ్గజాలతో సమావేశం కానున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మీడియా వ్యవహారాల ఇన్‌చార్జి పవన్ ఖేరా తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. కాంగ్రెస్ వర్గాల ప్రకారం, రాహుల్ గాంధీ బ్రెజిల్, కొలంబియాలో పర్యటిస్తారు. ఆయా ప్రాంతాల్లోని యూనివర్శిటీ విద్యార్థులతో సమావేశమవుతారు. ఆయా దేశాల అధ్యక్షులు, సీనియర్ నేతలతో భేటీ అయి, ప్రజాస్వామ్య, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం తదితర అంశాలపై చర్చించనున్నారు. అమెరికా సుంకాల నేపథ్యంలో భారత్ వాణిజ్యం, భాగస్వామ్యాల



ను వైవిధ్యపరచడానికి ప్రయత్నిస్తున్నందున అవకాశాలను అన్వేషించడానికి రాహుల్ గాంధీ పారిశ్రామిక వేత్తలతోనూ సమావేశం కానున్నారని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. భారత్ సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే వాణిజ్యం, సాంకేతికత, పరస్పర సహకారం తదితర వాటికి రాహుల్ పర్యటన కొత్త మార్గాలను తెరుస్తుందని పార్టీ అభిప్రాయపడింది.

# మీ కంపెనీలో ఆమెను వెంటనే తీసేయండి..

## లీసా మొనాకోపై మైక్రోసాఫ్ట్‌కు ట్రంప్ ఆదేశం



**వాషింగ్టన్, సెప్టెంబరు 27:** టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఆ సంస్థలో గ్లోబల్ అఫైర్స్ హెడ్‌గా పనిచేస్తున్న లీసా మొనాకోను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. లీసా మొనాకో ఒక అవినీతిపరురాలని, ఆమె అమెరికా జాతీయ భద్రతకు పెను ముప్పు అని ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రభుత్వం నుంచి మైక్రోసాఫ్ట్ కీలక కాంట్రాక్టులు పొందుతోంది. అలాంటి సంస్థలో ఉన్న లీసాకు అత్యంత సున్నితమైన సమాచారం అందుబాటులో ఉంటుంది. ఆమెను అస్సలు నమ్మలేమని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా, తాను ఇప్పటికే మొనాకోకు ఉన్న భద్రతా అనుమతులను రద్దు చేశానని, ప్రభుత్వ కార్యాలయాల్లోకి ఆమె ప్రవేశాన్ని నిషేధించానని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది మే నెలలోనే లీసా మొనాకో మైక్రోసాఫ్ట్‌లో చేరారు. అంతకు ముందు ఆమె జో బైడెన్ ప్రభుత్వంలో 39వ డిప్యూటీ అటార్నీ జనరల్‌గా అటార్నీ జనరల్ మెరిక్ గార్లాండ్ కింద పనిచేశారు. బైడెన్ యంత్రాంగంలో కీలక బాధ్యతలు నిర్వర్తించడమే ప్రస్తుతం ట్రంప్ ఆగ్రహానికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వలసలకట్టడికి బ్రిటన్‌లో కొత్త డిజిటల్ ఐడి స్కీం



**లండన్,సెప్టెంబరు 27:** యూకే ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ అక్రమ వలసలను అరికట్టడానికి కొత్తప్రక్రియను ప్రారంభిస్తున్నారు. జాతీయ పౌరులతో పాటు దేశంలో నివసిస్తున్న ప్రజలందరికీ ఉచితంగా డిజిటల్ ఐడీ పథకాన్ని ప్రవేశ పెట్టనున్నారు. ఈ కొత్త గుర్తింపు కార్డు ఫోన్లలో డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటుంది. ఈచర్య అక్రమవలసలను అడ్డుకో వడంతోపాటు పన్ను పరిధిలోకిరాని ఆర్థిక కార్యకలాపాలు కూడా తగ్గిస్తుందని వెల్లడించింది. ఇది ఆరోగ్య, శిశు సంక్షేమ పథకాలతో పాటు ఇతర సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయనుంది. ఈఐడీని అన్నిసందర్భాల్లో చూపించాల్సిన అవసరంఉండదని స్పష్టం చేసింది.

# 'అనంత శస్త్ర' క్షిపణుల కొనుగోలుకు టెండర్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** పాకిస్తాన్, చైనా సరిహద్దుల వెంట రక్షణ స్వావలంబన, భద్రత పెంపుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రక్షణ రంగంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే దిశగా భారత్ సైన్యం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అనంత శస్త్ర ఉపరితలం నుండి గగనతలానికి (సర్ఫేస్ టు ఎయిర్) ప్రయోగించే క్షిపణి వ్యవస్థల కోసం 56 రెజిమెంట్ల కొనుగోలుకు టెండర్ జారీ చేసింది. ఈ వ్యవస్థలు పాకిస్థాన్, చైనా సరిహద్దుల వద్ద వైమానిక రక్షణను మరింత బలోపేతం చేయనున్నాయి. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ 'అనంత శస్త్ర' క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేసింది. దీనిని కొనుగోలు చేసేందుకు సైన్యం ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు టెండర్ జారీ చేసినట్టు రక్షణ అధికారులు తెలిపారు. ఈ క్షిపణి వ్యవస్థను గతంలో క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ వ్యవస్థగా పిలిచేవారని చెప్పారు. ఈ ప్రాజెక్టు దాదాపు రూ.30 వేల కోట్ల విలువ కలిగి ఉంటుందన్నారు. భారత సైన్యంలోని ఆర్మీ, ఎయిర్ డిఫెన్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. గత మే నెలలో జరిగిన ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ కొనుగోలు మండలి ఈ ప్రాజెక్ట్‌కు ఆమోదం తెలిపింది. ఆమోదం లభించిన తర్వాత, ఈ 'అనంత శస్త్ర' వ్యవస్థలు పాకిస్థాన్, చైనా సరిహద్దు ప్రాంతాల్లో మోహరించనున్నారు.



# వారాంతపు నాయకుడిని కాదు: ఉదయనిధి స్టాలిన్

**చెన్నై, సెప్టెంబరు 27:** తమిళనాడులో రాజకీయాలు వేడెక్కాయి. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తమిళ స్టార్ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ వ్యవస్థాపకుడు విజయ్‌పై తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. తానేమీ ఇతర నేతల్లా వారాంతపు రాజకీయ నాయకుడిని కాదంటూ విజయ్‌ని ఉద్దే



శిస్తూ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. కాగా విజయ్ ప్రతి శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేను వారంలో దాదాపు ఐదు రోజులు అధికారిక పర్యటనలతో బిజీగా ఉంటాను. ఆదివారాల్లో కూడా పర్యటిస్తాను. కొందరిలా శనివారాల్లో మాత్రమే బయటకు వచ్చే నాయకుడిని కాదని అన్నారు.

## సంక్షిప్తంగా..

### బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ వచ్చేనెల భారత్ రాక



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** భారత్ ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ వచ్చే నెల రెండో వారంలో భారత్‌లో తన తొలి అధికారిక పర్యటన చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ యేడాది జూలైలో రెండు దేశాలు చారిత్రాత్మక సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం (సెటా)పై సంతకం చేసిన తర్వాత ఈ పర్యటన జరుగుతోంది. మూడేళ్లకుపైగా చర్చలు సాగిన దరిమిలా కుదిరిన ఈ ఒప్పందంలో భారత్-యుకె మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 120 అమెరికా బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఒప్పందం 2026 నుంచి అమలులోకి వస్తుందని భావిస్తున్నారు. బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ తన పర్యటనలో ప్రధాని మోడీతో వాణిజ్యం, సాంకేతిక, రక్షణ రంగాలపై చర్చించనున్నారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ఇరు దేశాలు ముందడుగు వేస్తున్నాయి.

### అరాచకాలకు పాల్పడితే ఉపేక్షించం: సిఎం యోగి

**లక్నో, సెప్టెంబరు 27 :** ఉత్తరప్రదేశ్‌లో పలువురు 'ఐ లవ్ మహమ్మద్' ఆందోళనల పేరుతో హింసాత్మక ఘటనలకు పాల్పడుతుండటంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరాచకాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని పరోక్ష హెచ్చరికలు చేశారు. తాము అందరినీ గౌరవిస్తామని, కానీ అమాయక పౌరులను ఇబ్బందులకు గురిచేసే వాళ్లను క్షమించబోమని వార్నింగ్ ఇచ్చారు. అరాచకం ఆమోదయోగ్యం కాదు. మేం అందరినీ గౌరవిస్తాం. మేం అందరికీ భద్రత కల్పిస్తాం. కానీ కొందరు భద్రతకు భంగం కలిగించే సాహసం చేస్తున్నారు. అమాయక పౌరులపై దాడులకు



పాల్పడుతున్నారు. అలాంటి వారిపై రాబోయే తరాలకు కూడా గుర్తుండేలా తగిన చర్యలు తీసుకుంటాం అని యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. పండుగలు, సంబరాల సందర్భంగా సుహృద్భావ వాతావరణాన్ని చెడగొట్టడం మంచి పద్ధతి కాదని యోగి అన్నారు.

### బాక్సర్ మేరీకోమ్ ఇంట్లో విలువైన వస్తువులు చోరీ

**ఫరీదాబాద్(హర్యానా), సెప్టెంబరు 27:** భారత ఒలింపిక్ మెడలిస్టు బాక్సర్ మేరీకోమ్ ఇంట్లో దొంగతనం జరిగింది. తనకు ఫరీదాబాద్‌లో ఉన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ దొంగతనం జరిగిందని ఆమె పోలీసులకు ఫిరానయదు చేసింది. టివి ఇతర విలువైన వస్తువులు తస్కరించుకుపోయారని ఆమె చెప్పింది. తాను ప్రస్తుతం ఆ ఇంట్లో లేనని, తనవాళ్లు కూడా ఎవరూలేని సమయం చూసి దొంగతనం చేసారని, సిసిటివి ఫుటేజ్‌లో దొంగతలు టివి ఇతర వస్తువులు తీసుకుపోతున్నట్లు కనిపించిందన్నారు. నా ఇంటికి పొరుగుననే ఉన్న వారు మొత్తం సమాచారం ఇచ్చారని ఈనెల 24వ తేదీ ఈదొంగతనం జరిగిందని పోలీ సులకు ఫిర్యాదు చేసారు. ఆరుసార్లు ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ టైటిల్ కైవసం చేసుకన్న మేరీకోమ్ మొట్టమొదటి భారత మహిళా బాక్సర్‌గా నిలిచింది. ఐదుసార్లు ఆసియా ఛాంపియన్‌గాను 2014 ఏసియన్ గేమ్స్‌లో మొదటిసారి గోల్డ్ మెడల్ సాధించింది. 2012 ఒలింపిక్స్‌లో రజతపతకం సాధించిన ఈమెను 18 ఏళ్ల వయసులోనే ఆమె అమెరికా పెన్సిల్వేనియా ప్రాంతంలోని స్క్రాంటన్‌లో జరిగిన ప్రపంచ మీట్‌కు హాజరయింది.

### వాంగ్‌చుక్‌కు పాక్‌తో సంబంధాలు: లడఖ్ డిజిపి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** లద్దాఖ్‌లో హింసను రెచ్చగొట్టారన్న ఆరోపణలతో సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు నిన్న అరెస్టు జోధ్‌పుర్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయన అరెస్ట్ నేపథ్యంలో తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వాంగ్‌చుక్‌కు దాయాది పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాదు పాక్‌తో పాటు మన పొరుగుదేశం బంగ్లాదేశ్‌ను కూడా ఆయన సందర్శించినట్లు లద్దాఖ్ డిజిపి ఎస్‌డి సింగ్ జామ్వాల్ తెలిపారు. లేహ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో డిజిపి మాట్లాడుతూ పాక్‌కు చెందిన ఇంటెలిజెన్స్ అధికారి ఒకరితో వాంగ్‌చుక్ సం



బంధాలు ఉన్నట్లు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని వివరించారు. అంతేకాదు పాక్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి వాంగ్‌చుక్ హాజరైనట్లు కూడా తేలింది.

# ఎన్ జి ఓ'స్ కాలనీ పార్కులో నిత్య పూజలతో నవరాత్రుల మహోత్సవం

తణుకు సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : తణుకు లోని ఎన్ జి ఓ'స్ కాలనీ పార్కులో శ్రీ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న నిత్య కుంకుమ పూజలు, అమ్మవారి అలంకారాలు, మరియు భక్తుల సందడి ఆధ్యాత్మికతకు అద్దం పడుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు ప్రతి రోజూ ప్రత్యేకంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతున్నాయి. అమ్మవారు కీ ప్రతిరోజూ వేర్వేరు రూపాల్లో అలంకరించడం జరుగుతోంది. పట్టు వస్త్రాలు, పూల మాలలు, పండ్ల గజమాలలు, రత్నాభరణాలతో అమ్మవారి విగ్రహం శోభాయమానంగా దర్శనమిస్తోంది. సింహవాహనంపై కూర్చొన్న అమ్మవారి రూపం భక్తులను మంత్రముగ్ధులను చేస్తోంది. ప్రతి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై, నిత్య కుంకుమ పూజలు, హారతులు, మరియు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో ముగుస్తున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు నిర్వహిస్తూ, సౌభాగ్యం కోసం ప్రార్థిస్తున్నారు. స్థానిక కళాకారులు, విద్యార్థులు నృత్యాలు, సంగీత ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. భక్తులను ఆధ్యాత్మికంగా మైమరిపిస్తున్నాయి. పార్కు పరిసరాలు రంగురంగుల గార్లాండ్లు, మామిడి ఆకులు,



పూలతో అలంకరించబడి, దీపాల వెలుగుతో ప్రకాశిస్తున్నాయి. పిల్లలు, యువత, వృద్ధులు అందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# కొల్లేరు సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించాలి

## మంత్రి మనోహర్





**ఏలూరు, సెప్టెంబర్, 27 : ప్రభాతవార్త :** కొల్లేరు ప్రజల సమస్యలను మానవీయ కోణంతో పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు ఏలూరు జిల్లా ఇంచార్జ్ శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. కొల్లేరు ప్రజల సమస్యలపై జిల్లాకు చెందిన రాష్ట్ర గృహ నిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఏలూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అటవీ, రెవిన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో శనివారం రాష్ట్ర సచివాలయంలోని ఇంచార్జ్ మంత్రివర్యుల ఛాంబర్లో మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారధి , ఎమ్మెల్యే లు తమ సమస్యలు తెలియజేస్తూ కొల్లేరు అభయారణ్యం ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల త్రాగునీరు, రహదారులు, తదితర ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటుకు అటవీ శాఖ అధికారులు నిబంధనల పేరుతో అడ్డుపడుతున్నారని, జిల్లా సమీక్షా సమావేశాలకు కూడా హాజరు కాకుండా కొల్లేరు ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలోని ప్రజలపై మానవీయకోణంతో పరిశీలించాలని సుప్రీం కోర్ట్ ఏర్పాటుచేసిన కేంద్ర సాధికారిక కమిటీ దృష్టికి తీసుకువెళ్లి కోరడం జరిగిందన్నారు. జిల్లాలో కొల్లేరు, అటవీ భూముల సరిహద్దులకు సంబందించిన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని, అటవీ, ఇరిగేషన్, రెవిన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో అటవీ భూములకు సంబంధించి సరిహద్దుల సమస్య ఉందని, రెవిన్యూ, ఫారెస్ట్ అధికారుల జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి సరిహద్దులు నిర్ణయించాలన్నారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూములకు సంబందించి రైతులకు పట్టాలు జారీ చేయాలనీ, వారి భూములలో సాగుచేసుకునేందుకు బోర్ వెల్స్ వేసుకునేందుకు అటవీ శాఖ అధికారులు అనుమతి మంజూరు చేయాలన్నారు. కొల్లేరు, నూజివీడు నియోజకవర్గంలో అటవీ సమస్యలపై తీసుకుంటున్న చర్యలను అటవీ శాఖాధికారులు సంబంధిత ప్రజలప్రతినిధులకు తెలియజేయాలన్నారు. కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరులోని లంక గ్రామాలలోని ప్రజలు త్రాగునీటి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు అద్వాన్న పరిస్థితులలో ఉన్నాయని, కొల్లేరు ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ మొండికోడు రోడ్డు మరమ్మత్తులకు అనుమతి మంజూరు చేయాలనీ కోరారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలోని 64 నోటిఫైడ్ డ్రైన్ల మరమ్మత్తులకు త్వరితగతిన మంజూరు చేయాలనీ, డ్రైన్లను ప్రతీ ఏటా దేసిల్టింగ్ చేయించాలన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరు లో ప్రస్తుతం ఉన్న నగరవనంకు ప్రత్యామ్నాయంగా వేరే విశాల ప్రదేశంలో ఏర్పాటు చేయవలసిందిగా అటవీ శాఖ వారిని కోరడం జరిగిందని, ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ విషయంలో నిర్వాసితులకు అటవీ శాఖ అధికారులకు మధ్య వచ్చిన సమస్యలను సామరస్యపూర్వక వాతావరణంలో పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

# అద్దాల మండపంలో కొలువుతీరిన అయ్యప్ప

**చాట్రాయి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన చాట్రాయి అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం అద్దాల మండపంలో అయ్యప్ప కొలువు తీరారు. అయ్యప్ప స్వామి దేవాలయంలో చాట్రాయి గ్రామానికి చెందిన గోళ్ళ నారాయణరావు(చిట్టిబాబు), లక్ష్మీ కుమారి దంపతులు, వారి కుమారుడు గోళ్ళ సుందర్ కుమార్ నాగ లావణ్య దంపతులు సుమారు 5 లక్షలతో సుందర వందనంగా అద్దాల మండపాన్ని ఏర్పాటు చేయగా ఆలయ పూజారి తరుణ్ స్వామి వేదమంత్రాలతో స్వామివారిని పవళింప చేశారు. అద్దాల మండపంలో కొలువుతీరిన అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు వందలాది మంది భక్తులు ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా చిట్టిబాబు స్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి కృప ఉంటే సుఖశాంతులతో జీవనం సాగించవచ్చని చెప్పారు. అయ్యప్ప స్వామి దయవల్ల ఎన్నో కుటుంబాలకు మేలు జరిగిందని అయ్యప్ప స్వామి దేవాలయంలో అద్దాల మండపం కూడా ఉంటే స్వామి వారు మరింత ముక్తిని



ప్రసాదిస్తారని విశ్వాసంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన వివరించారు. అయ్యప్ప స్వామిని మనసారా స్వామివారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలు అందరికీ ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు. భక్తులు కూడా భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

# చిట్టవరంలో న్యాయ అవగాహన సదస్సు



**ప్రభాతవార్త నరసాపురం రూరల్ :** నల్సా "జాగ్రితి" పథకం (గ్రామీణ స్థాయిలో న్యాయ అవగాహన , సమాచార మరియు పారదర్శకత) లో భాగంగా చిట్టవరం గ్రామంలో చిరంజీవి కమ్యూనిటీ బిల్డింగ్ నందు న్యాయ సేవాధికార సంస్థ ఈ రోజు నిర్వహించిన కార్యక్రమానికి నరసాపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి. నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ అందరూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అన్ని వర్గాల వారికి అందించే న్యాయ సేవలు, పథకాలు మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పసిపిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడానికి పోక్సో చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వి. సూర్య ప్రకాశరావు లోక్ అదాలత్, ఉచిత న్యాయం గురించి వివరించారు. న్యాయ సేవా సంస్థ సభ్యులు సి. హెచ్. దానయ్య నాయుడు, వై.డి. ఫణికర్ మాట్లాడుతూ అందరూ మధ్యవర్తిత్వం పై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా ప్రతీ తల్లి తమ ఆడ బిడ్డలకు గుడ్ టచ్ బాడ్ టచ్ , సైబర్ క్రైమ్ గురించి , నల్సా టోల్ ఫ్రీ నెంబర్ 15100 , లీగల్ ఎయిడ్ సిస్టమ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి కమ్యూనిటీ బిల్డింగ్యాధ్యక్షులు చెన్నంసెట్టి నాగు, గ్రామ సర్పంచ్ తాడి లక్ష్మణరావు , జాగృతి యూనిట్ సభ్యులు ఆనంద్ బాబు, శిరీష, పై. ఎల్.వి లు కృష్ణ భగవాన్, వరలక్ష్మి, ప్రతిభ రాజీ, తదితరులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# నెమ్మదించిన గోదావరి

**- రెండు అడుగులమేర తగ్గిన గోదావరి వరద - కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక - భారీ వర్షాల దృష్ట గోదావరి మళ్లీ పెరిగే అవకాశం**

వేలేరుపాడు, సెప్టెంబర్ 27, ప్రభాత వార్త : గత రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహించి 46 అడుగుల వరకు పెరిగిన గోదావరి ఆదివారం రెండు అడుగుల మేర తగ్గి కొంత శాంతించింది. శనివారం సాయంత్రానికి 44 అడుగుల వద్ద ప్రవహిస్తూ ఉండటంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు అధికారులు. ఎద్దు వాగు,గుండేటి వాగుల వంతెనలు నీటిలో మునిగి రాకపోకలకు అంత:రాయం కొనసాగుతుంది. గత నెల రోజులుగా గోదావరి తగ్గడం పెరగడం పరిపాటిగా మారింది. ఎద్దు వాగు వంతెన 24 రోజులుగా నీటిలో మునిగే ఉంది. ఎద్దువాగు బాధిత నిర్వాసితులు గత నెల రోజులుగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అధికారులు స్పందించి అన్ని విధాలుగా వారిని ఆదుకోవాలని కోరుచున్నారు. రుద్రమకోట, రేపాకగొమ్ము,కోయిదా గ్రామాల రహదారులను వరద వీడలేదు. ఏపీ మరియు తెలంగాణల రాష్ట్రాల్లో మరి కొన్ని రోజులు విస్తారంగా వర్షాలు పడే అవకాశాలు ఎక్కువగా ఉ ండటంతో ప్రజల అప్రమత్తంగా ఉండాలని, గోదావరి పరివాహక గ్రామాలు ఎప్పటికప్పుడు అలర్ట్ గా ఉండాలని



అధికారులు సూచనలు చేస్తున్నారు.

# స్వస్థనారి స్వశక్తి అభియాన్ కార్యక్రమం

**చింతలపూడి.. ప్రభాత వార్త:** చింతలపూడి పట్టణంలో స్వస్తినారి స్వశక్తి పరివర్ అభియాన్ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం ఆస్పత్రి సూపర్నెంట్ డాక్టర్ నారాయణరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు కొండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు స్త్రీలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డి సి హెచ్ ఓ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన స్వస్థనారి స్వశక్తి అభియాన్ కార్యక్రమం చింతలపూడి ప్రభుత్వ ఏర్యాస్పత్రిలో నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక మహిళ వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఏఎంసీ చైర్మన్ చీదరాల దుర్గా పార్వతి, టిడిపి పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు, టిడిపి నాయకులు బోడ నాగభూషణం,



చిత్తూరు ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, జనసేన పార్టీ చింతలపూడి మండల అధ్యక్షులు చేతరాల మధుబాబు, ఏసుబాబు బిజెపి నాయకులు కొత్తపల్లి విజయ కుమారి ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ జేబివుల్ల, డాక్టర్ సయ్యద్ రసూల్, డాక్టర్ విజయలక్ష్మి, వైద్య నిపుణులు లైన్స్ క్లబ్ నాయకులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్య పరీక్షలకు మహిళలు ముందుకు రావాలి

## - సి కె పాడు ఛానల్ అధ్యక్షులు పూర్ణ

**చాట్రాయి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ ప్రగతి పథంలో పయనిస్తుందని ఉ ద్దేశంతో దేశ ప్రధాని నరేంద్ర మోడీ స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ పేరుతో దేశవ్యాప్తంగా మహిళల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని దీనిని ప్రతి ఒక్క మహిళ ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని సి.కె.పాడు ఛానల్ అధ్యక్షులు మంచన పూర్ణచంద్రరావు అన్నారు. చాట్రాయి మండలం కోటపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మహిళలు శక్తివంతంగా తయారవ్వాలంటే



ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం చేస్తున్న అన్ని వైద్య పరీక్షలు చేయించుకుని లోపాలను తెలుసుకొని మందులు వాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. గ్రామాలలోని వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నందున మహిళలు అధికంగా తరలివచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తలపెట్టిన మహిళ ఆరోగ్యానికి సంబంధించిన యజ్ఞాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ సెల్ నాయకుడు బుర్రి శ్రీకర్,హెల్త్ అసిస్టెంట్ సురేష్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు ఆందోళన

**చాట్రాయి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు ఆందోళనకు దిగారు. ఈ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు నిలిచిపోయాయి. అక్టోబర్ 2 వరకు జరగాల్సిన స్వస్థ నారి స్వశక్త పరివార్ కార్యక్రమానికి కూడా వైద్యాధికారులు హాజరు కాలేదు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిని డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు పట్ల ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలు చేసుకుంటూ గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న వైద్యుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ పోరాటం ప్రజలపై కాదని ప్రజలకు సేవలు అందిస్తున్న డాక్టర్లకు ప్రభుత్వం కల్పించాల్సిన సదుపాయాల గురించి అన్నారు. ముఖ్యంగా జీవో 99 ద్వారా కోట విధించిన ఇన్ సర్వీస్ పీజీ కొటాను పునర్ధించాలని, సమయ నిర్ధారతమైన ప్రమోషన్లు, ట్రైబల్ అలవెన్సు, 104 సంచార చికిత్స అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్ అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ చేస్తున్నట్లు ఆమె వివరించారు. న్యాయమైన డిమాండ్లను ప్రజలు కూడా తమకు మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తణుకులో కిరాణా షాప్‌పై విజిలెన్స్ దాడి



**తణుకు సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :** తణుకుపట్టణంలో సబ్సిడి గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగంపై విజిలెన్స్ అధికారులు శనివారం కీలక చర్యలు చేపట్టారు. వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు వాడుతున్నారని వచ్చిన సమాచారం ఆధారంగా అధికారులు పట్టణంలోని జిఎంఆర్ సిద్దేశ్వర్ కిరాణా షాపుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 9 గృహ అవసరాల గ్యాస్ (సబ్సిడి గ్యాస్) సిలిండర్లు గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.26,002/-గా అంచనా వేశారు. షాపు యజమాని గుడివాడ వాసవి దుర్గ రామ వెంకట నరశింహ గుప్తాను అధికారులు ప్రశ్నించగా, తాను వాణిజ్య గ్యాస్ సిలిండర్ల బదులుగా గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లనే వాడుతున్నట్లు అంగీకరించారు. దీనిపై అధికారులు వెంటనే ఆ సిలిండర్లను సీజ్ చేసి, షాపు యజమాని పై నిత్యావసర వస్తువుల చట్టం - 1955 కింద కేసు నమోదు చేశారు.విజిలెన్స్ విభాగం అధికారులు మాట్లాడుతూ, గృహ వినియోగానికి మాత్రమే కేటాయించిన సబ్సిడి గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగించడం చట్ట విరుద్ధం. ఇలాంటి చర్యలు తీసుకున్నవారిపై కఠినంగా వ్యవహరిస్తాం అని స్పష్టం చేశారు. ఈ తనిఖీ తర్వాత పట్టణ వ్యాప్తంగా వ్యాపారులు, కిరాణా షాపులు అప్రమత్తమయ్యారు. సాధారణ ప్రజల కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడి సదుపాయాన్ని వాణిజ్య ప్రయోజనాల కోసం వాడితే, అది కఠిన శిక్షార్హమని అధికారులు హెచ్చరించారు.

## లలితా త్రిపుర సుందరీ రూపంలో వాసవి అమ్మవారి ఆరాధన

# శరన్నవరాత్రి ఆరవ రోజు వైభవం

పెనుగొండ :పెనుగొండ, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : శరన్నవరాత్రి మహోత్సవాల ఆరవ రోజు సందర్భంగా, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని, పెనుగొండలోని శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.అమ్మవారి అలంకార దర్శనం భక్తుల హృదయాలను తాకింది. ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు, చండీ పారాయణం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. భక్తులు అమ్మవారి కృపకు నమస్కరిస్తూ, కుటుంబ సౌభాగ్యం, శాంతి, ఐశ్వర్యం కోసం ప్రార్థనలు చేశారు. ఈ మహోత్సవం సందర్భంగా స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మికతను అనుభవించారు. క్షేత్రం వద్ద భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు నిర్వాహకులు తెలిపారు.



# ఎల్ఐసి ఏజెంట్లు నూతన కమిటీ





**నరసాపురం ప్రభాతవార్త :** నర్సాపూర్ బ్రాంచి గౌరవ అధ్యక్షులుగా కస్తూరి శ్రీనివాస్, నూతన అధ్యక్షులుగా ఉద్దగిరి భాస్కరరావు, బ్రాంచి జనరల్ సెక్రెటర్ గా యడ్ల రాజబాబు, ట్రెజరర్ గా బళ్ల రమేష్ కుమార్ లను పాలకొల్లులో బ్రాంచి జనరల్ కౌన్సిల్ సమావేశములో ఎన్నుకోవటం జరిగింది.గౌరవ సలహాదారులుగా డి చిట్టిబాబు పి సాయిరాం నరేష్ ఉ పాధ్యక్షులుగా కడలి కోటేశ్వరరావు పార్థసారథి డి హల్లే సంయుక్త కార్యదర్శిగా సిహెచ్ ఎన్విడి సాయి బి రమేష్ కుమార్ లను ఎన్నుకున్నారు.

# పెనుగొండలో ఆర్‌టీఐ అసోసియేషన్ కరపత్రం ఆవిష్కరణ:

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.ఎస్.మూర్తి:

**పెనుగొండ సెప్టెంబర్27 ప్రభాత వార్త :** అక్టోబర్ 12వ తేదీ పురస్కరించుకొని ఆర్‌టీఐ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కరపత్రం విడుదల కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. పెనుగొండ మండల పరిషత్ అభివృద్ధి కార్యదర్శి (ఎంపిడీఓ) చేతుల మీదుగా ఈ కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు, నాయకులు పారదర్శక పాలనకు ఆర్‌టీఐ చట్టం ఎంతో ఉపయోగకరమని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. సమాచార హక్కు ప్రతి పౌరుడికి ఉన్న ప్రాథమిక హక్కు అని, దాని సద్వినియోగం సమాజం మార్పుకు దోహదపడుతుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా ఆర్‌టీఐ అసోసియేషన్ అధ్యక్షులు గుండా బత్తుల ఆనందకుమార్, అచంట నియోజకవర్గ కన్వీనర్ యల్లమెల్లి నాగేశ్వరరావు, పాలకొల్లు కన్వీనర్ కొండేటి భూపతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పల్లి కిరణ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. అలాగే పలువురు స్థానిక నాయకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహాలక్ష్మి గా కనకదుర్గ

**ఆగిరిపల్లి సెప్టెంబర్ 26 ప్రభాతవార్త. :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆగిరిపల్లి గ్రామంలో యాదవుల మండపంపై ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారు , స్థానిక మెట్ల కోనేరువద్ద గల కనకదుర్గ ఆలయంలోశు క్రవారం మహాలక్ష్మిదేవి గా భక్తులకు దర్శనం ఇచ్చారు. యాదవుల మండపం వద్ద మహిళలు పెద్ద ఎత్తున హాజరై కుంకుమ పూజలు నిర్వహించుకుని పాల పొంగలి తో గ్రామోత్సవం నిర్వహి ంచి అమ్మవారి సమర్పించారు. మండలంలోని వట్టిగుడిపాడు వడ్లమాను తోటపల్లి తదితర గ్రామాల్లో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించటం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





జ్యోతి ప్రజ్వలనతో పర్యాటక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

# పర్యాటకానికి పూర్వ వైభవం

● పారిశ్రామిక హోదా కల్పించాం ● టూరిజంతోనే దేశాభివృద్ధి ● సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

**విజయవాడ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యాటక రంగమే దేశాల ఆర్థిక వ్యవస్థను శాసిస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీటీడీసీ ఆధ్వర్యంలో విజయవాడ పట్టణంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం అంగరంగ వైభవంగా వేడుకలను నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించిన చంద్రబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ టూరిజం ద్వారా ట్రాన్స్ఫర్మేషన్ తీసుకురావాలన్న లక్ష్యంతో టూరిజం డే నిర్వహించుకుంటున్నామన్నారు. గతంలో పర్యాటకం అంటే దేవాలయాలకు వెళ్ళి రావడమేనన్నారు. 2.6 ట్రిలియన్ డాలర్ల ఆదాయం పర్యాటకంపై ఆయా దేశాలకు వస్తోంది. వాటితో పోలిస్తే భారత్‌లో పర్యాటక రంగానికి మంచి అవకాశాలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు పారిశ్రామిక హోదా కల్పించామన్నారు. పర్యాటకం ద్వారా పెద్ద ఎత్తున ఆదాయాన్ని, ఉపాధిని, ఉద్యోగాలను సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఒక్క ఇజమే నిలిచి ఉంటుంది. అది టూరిజం మాత్రమేనన్నారు. పర్యాటకం కోసం భారతీయులు ఇతర దేశాలకు వెళుతున్నారు. కానీ మనకు ఉన్నన్ని పర్యాటక ప్రదేశాలు ఇంక ఎక్కడా లేవు సరికొత్త విధానాలతో ఏపీ పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టామని అన్నారు.

### 15 నెలల్లోనే రూ.10,644 కోట్ల పెట్టుబడులు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల కాలంలోనే రూ.10,644 కోట్ల పర్యాటక పెట్టుబడులు సాధించామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అఖండ గోదావరి, గండికోట పర్యాటక ప్రాజెక్టులు, సూర్యలంక బీచ్ అభివృద్ధి, అన్నవరం, అహోబిలం, సింహాచలం దేవాలయాల అభివృద్ధి, బొర్రా గుహలు, నాగార్జున సాగర్ అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజి మాట్లాడుతూ విశాఖపట్నం, అరకువ్యాలీ, రాజమహేంద్రవరం, తిరుపతి, అమరావతి, గండికోట, శ్రీశైలం ఈ ఏడు ప్రాంతాలను టూరిజం పాలసీలో భాగంగా టూరిజం హబ్‌లుగా అభివృద్ధి చేయనున్నామన్నారు. ఈ రంగంలో 105 ఎంఓయులను ఇప్పటికే చేసుకున్నామని, దీని ద్వారా రూ.10వేల కోట్లకుపైగా పెట్టుబడులు రానున్నాయన్నారు. పీపీపీ పద్దతిలో రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి బాటలు వేస్తున్నామని వివరించారు.

టూరిజం శాఖ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ ఇండస్ట్రీ హోదా టూరిజంకు ఇవ్వడం వల్ల ఈ రంగం మరింత వృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రపంచ, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా వివిధ కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. ముందుగా టూరిజం కార్వాన్ వాహనాల శ్రేణిని సీఎం చంద్రబాబు నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అలాగే కేరళ రాష్ట్రంలోని హౌస్ బోట్ ఆపరేటర్స్‌తో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. స్వదేశీ దర్శన్ 2.0 స్కీం ఫౌండేషన్ స్టోన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం పాలసీ ఆపరేషన్ గైడ్ లైన్స్ ను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. బాపట్ల గోల్డెన్ శాండ్ బీచ్‌ను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఏపీ టూరిజం హోం స్టే పోర్టల్‌ను కూడా విడుదల చేశారు. అనంతరం అరకు పాడేరు, అస్సేల్ మెట్ట విశాఖపట్నం, కోనసీమలోని మలికిపురంలలోని హోం స్టే యజమానులతో వర్చువల్‌గా మాట్లాడారు. చివరగా రాష్ట్ర పర్యాటక ఎక్స్‌లెన్స్ అవార్డులను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అందచేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.వి. స్వామి, రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ఛైర్ పర్సన్ పొడపాటి తేజస్విని, ఎన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, బాపట్ల జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్, స్టేక్ హోల్డర్లు, అధికారులు, అవార్డు గ్రహీతలు, నగరవాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఏలైనా ఇవ్వాలి

**విజయవాడ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుక ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడు కోరారు. దసరా పండుగ సందర్భంగా దసరా కానుకగా కనీసం రెండు డిఏ లైనా ప్రకటిస్తే ఉద్యోగుల్లో అసంతృప్తి కొంతవరకైనా తగ్గుతుందని అన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ గత ప్రభుత్వంలో రివర్స్ పిఆర్సి, ఉద్యోగులకు రావలసిన వేల కోట్లు బకాయిలు గురించి గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతి ఇచ్చి కూటమి ప్రభుత్వం రావడానికి ఉద్యోగులు కృషి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగులు ఐఆర్ ప్రకటిస్తారని ఎంతో ఆశపడ్డారని గుర్తు చేశారు.కానీ ఇప్పటివరకు ఐఆర్, సంగతి పక్కన పెడితే కనీసం నాలుగు పెండింగ్ డిఏలు ఉన్న ఇప్పటివరకు సుమారు 20 క్యాబినెట్ సమావేశాలు జరిగితే ప్రతి కేబినెట్‌లో ఉద్యోగులకు సంబంధించి డిఏలు, ఐఆర్, పిఆర్సి కమిషన్, పెండింగ్ బకాయిలు గురించి చర్చిస్తారని ఉద్యోగులు ఎంతగానో ఎదురు చూశారు కానీ ఇప్పటివరకు ఉద్యోగులకు సంబంధించి కనీసం చర్చించకపోవడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని తెలియజేశారు. కనీసం దసరా పండుగ సందర్భంగానైనా ఉద్యోగులకు కనీసం రెండు డీఏలు చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, పవన్ కల్యాణ్, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు విజ్ఞప్తి చేశారు.

## కృష్ణా మిల్క్ యూనియన్‌లో అక్రమాలపై విచారణ

# బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

● అసెంబ్లీలో మంత్రి అచ్చెనాయుడు వెల్లడి ● శైవ ఆలయాల్లో అర్చకుల జీతాలు పెంచాలి ● గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



**గన్నవరం(కృష్ణా), సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** కృష్ణా మిల్క్ యూనియన్‌లో అక్రమాలపై విచారణ జరుపుతున్నామని నివేదిక వచ్చిన తరువాత బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెనాయుడు శాసనసభలో ప్రకటించారు. శనివారం సభలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ లేవనెత్తిన సమస్యకు స్పందించిన మంత్రి కూటమి ప్రభుత్వం తప్పులు చేసిన వారిని వదిలే ప్రసక్తేలేదు, తప్పు చేసిన వారికి శిక్షతప్పదని స్పష్టం చేసారు. అంతకు ముందు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ శాసనసభలో మాట్లాడుతూ కృష్ణామిల్క్ యూనియన్‌లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని, గత అసెంబ్లీ సమావేశాల్లో తాను సభ దృష్టికి తీసుకురావటంతోపాటు, అందుకు సంబందించిన ఆధారాలను సైతం సమర్పించినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు. 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ఒక్కరోజు ముందు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వ్యక్తి తదనంతరం తనకు రాజకీయాలు సంబంధంలేదని, తనది పాల పార్టీ అంటు ప్రకటించుకున్న ఛైర్మన్ కృష్ణా మిల్క్ యూనియన్‌లో వైసిపి కార్యకర్తలకు పెద్దసంఖ్యలో ఉద్యోగాలు ఇవ్వటంతోపాటు, పాల బూత్‌లు సైతం వైసిపి వారికే ఇచ్చారని ఆరోపించారు. పాల పార్టీ అంటూ వైసిపికి పెద్దపీట వేసిన సదరు ఛైర్మన్ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తాను టిడిపి అంటూ ప్రచారం చేసుకోవటం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసారు. 2024 సంవత్సరంలో పాలక మండలిలో ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా నామినేటెడ్ పద్ధతిలో తనకు అనుకూలంగా ఉన్నవారిని నియమించుకోవటం దారుణమన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలో పాల ఉత్పత్తుల కర్మాగారం నిర్మాణంలోనూ, భూముల కొనుగోలులోనూ ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయని తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇదిలా ఉండగా పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఉన్న ప్రముఖ శైవక్షేత్రాలైన ద్రాక్షారామం, భీమేశ్వరాలయం, గుడిమెల్లం తదితర శైవ ఆలయాల్లో ప్రతిరోజూ పంచామృతాభిషేకాలు జరిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని వారి జీతాలు పెంచి ఆదుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

# కొల్లేరు ప్రజల సమస్యలను పరిష్కరించాలి


కొల్లేరు ప్రాంత సమస్యలపై మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారధి సమీక్ష సమావేశం

**- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

**విజయవాడ, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కొల్లేరు ప్రజల సమస్యలను మానవీయ కోణంతో పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. కొల్లేరు ప్రజల సమస్యలపై ఏలూరు జిల్లాకు చెందిన రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఏలూరు జిల్లా ఎమ్మెల్యేలు, అటవీ, రెవిన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో శనివారం రాష్ట్ర సచివాలయంలోని ఇంచార్జ్ మంత్రి ఛాంబర్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్షించారు. జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యేలు తమ సమస్యలు తెలియజేస్తూ కొల్లేరు అభయారణ్యం ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల త్రాగు నీరు, రహదారులు, తదితర ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటుకు అటవీ శాఖ అధికారులు నిబంధనల పేరుతో అడ్డుపడుతున్నారని, జిల్లా సమీక్షా సమావేశాలకు కూడా హాజరు కాకుండా కొల్లేరు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలోని ప్రజలపై మానవీయ కోణంతో పరిశీలించాలని సుప్రీం కోర్ట్ ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ దృష్టికి తీసుకువెళ్లి కోరడం జరిగిందన్నారు. జిల్లాలో కొల్లేరు, అటవీ భూముల సరిహద్దులకు సంబంధించిన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని, అటవీ, ఇరిగేషన్, రెవిన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మంత్రి పార్థసారధి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో అటవీ భూములకు సంబంధించి సరిహద్దుల సమస్య ఉందని, రెవిన్యూ, ఫారెస్ట్ అధికారుల జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి సరిహద్దులు నిర్ణయించాలన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ భూములకు సంబంధించి రైతులకు పట్టాలు జారీ చేయాలనీ, వారి భూములలో సాగుచేసుకునేందుకు, బోర్ వెల్స్ వేసుకునేందుకు అటవీ శాఖ అధికారులు అనుమతి మంజూరు చేయాలన్నారు. కొల్లేరు, నూజివీడు నియోజకవర్గంలో అటవీ సమస్య లపై తీసుకుంటున్న చర్యలను అటవీ శాఖాధికారులు సంబంధిత ప్రజలప్రతినిధు లకు తెలియజేయాలన్నారు. కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరులోని లంక గ్రామాలలోని ప్రజలు త్రాగునీటి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు అధ్వాన్న పరిస్థితులలో ఉన్నాయని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ మొండికోడు రోడ్డు మరమ్మత్తులకు అనుమతి మంజూరు చేయాలనీ కోరారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలోని 64 నోటిఫైడ్ డ్రైన్ల మరమ్మత్తులకు త్వరితగతిన మంజూరు చేయాలనీ, డ్రైన్లను ప్రతీ ఏటా దేసిల్టింగ్ చేయించాలన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరులో ప్రస్తుతం ఉన్న నగరవనంకు ప్రత్యామ్నాయంగా వేరే విశాల ప్రదేశంలో ఏర్పాటు చేయవలసిందిగా అటవీ శాఖ వారిని కోరడం జరిగిందని, ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ విషయంలో నిర్వాసితులకు అటవీ శాఖ అధికారులకు మధ్య వచ్చిన సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ వెదురు మొక్కల పెంపకానికి మొక్కలను పంపిణీ చేయవలసిందిగా కోరారు. మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ ప్రజాప్రతినిధులు తెలియజేసిన సమస్యలపై త్వరలోనే ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని, సదరు సమావేశానికి సమస్యలపై పరిష్కార చర్యలతో కూడిన పూర్తిస్థాయి నివేదికలతో అటవీ, ఇరిగేషన్, రెవిన్యూ ఉన్నత స్థాయి, జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

# శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా దుర్గమ్మ


వర్ణమయ పుష్పాలంకరణతో దుర్గమ్మవారి ఆలయం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవిగా భక్తులను శనివారం అనుగ్రహించారు. రాత్రి పది గంటల వరకు దుర్గమ్మవారిని ఒక లక్ష పదివేల మంది భక్తులు దర్శించుకున్నారని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. 18,358 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు రు.37లక్షల 17,37 ల ఆదాయం వచ్చిందన్నారు. కలెక్టర్ లక్ష్మీషా, విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు, కమీషనర్ రామచంద్రమోహన్ ఏర్పాట్లు ఎప్పటికపుడు పరిశీలించారు. దుర్గమ్మవారికి శ్రీ ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివార్ల దేవస్థానం నుండి, విశాఖపట్నం శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానాల నుండి పట్టువస్త్రాలు అందించారు. శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ఇఓ కె శోభారాణి, ద్వారకా తిరుమల స్వామివార్ల దేవస్థానం ఇఓ ఎన్‌విఎస్ఎన్ మూర్తి శనివారం పట్టువస్త్రాలు ఊరేగింపుగా తీసుకురాగా ఇఓ వికె శీనా నాయక్ మేళతాళాలు మంగళవాయిద్యాలతో వేదమంత్ర పఠనాలతో స్వాగతం పలికి దుర్గమ్మవారి సన్నిధికి తీసుకెళ్ళారు. అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించిన అనంతరం వారికి వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, ప్రసాదాలు, మెమొంటో, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

### వైభవంగా నగరోత్సవం

సాయంసంధ్యాకాలంలో శ్రీ గంగాభవాని సమేత మల్లేశ్వర స్వామివార్ల నగరోత్సవం వైభవంగా జరిగింది. నగర వీధుల్లో విహరిస్తూ శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. దుర్గమ్మవారి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆధ్యాత్మిక ఆనందంలో భక్తులను ఓలలాడించాయి.

### దుర్గమ్మవారి సేవలో విఐపిలు

దుర్గమ్మవారిని ఎమ్మెల్యేలు బాష్యం ప్రవీణ్, నందమూరి బాలకృష్ణ, కూన రవికుమార్, బత్తుల రామకృష్ణ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, విశాఖ మెట్రో రీజియన్ డెవలెప్‌మెంట్ అథారిటి ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం, సింగర్ సునీత తదితర ప్రముఖులు దర్శింకున్నారు.

శనివారం కృష్ణానదిలో పెరిగిన వరద నీటని కలెక్టర్ లక్ష్మీషా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులు జల్లు స్నానాలు మాత్రమే చేయాలని చెప్పారు. వరద వల్ల ఇబ్బంది లేకుండా రెండంచెల బ్యారికెడ్లు ఏర్పాటు చేయించారు. దసరాకు వచ్చే భక్తులను జల్లు స్నానాలు మాత్రమే చేయడానికి అనుమతించాలని అధికారులను ఆదేశించారు.

### వైభవంగా అర్చక సభ

శనివారం దుర్గమ్మవారి ఆలయంలో అర్చకసభ వైభవంగా నిర్వహించారు. ఏపి, తెలంగాణలకు చెందిన ప్రధాన దేవాలయాల అర్చకుల వేదమంత్ర పఠనాలతో దుర్గమ్మవారి ఆలయ ప్రాంగణం మార్మోగింది. సుమారు వంద మంది అర్చకులు వేదమంత్ర పఠనాలు గావించారు. యాదగిరిగుట్ట, శ్రీశైలం, భద్రాచలం తదితర ప్రముఖ దేవస్థానాలకు చెందిన అర్చకులు పండితులు పాల్గొన్నారు.


శ్రీకనకమహాలక్ష్మి దేవస్థానం నుండి పట్టువస్త్రాలు తెస్తున్న ఇఓ


బాలకృష్ణకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం


ద్వారకా తిరుమల ఇఓ, పట్టువస్త్రాలు దుర్గమ్మ ఆలయ ఇఓకు అందిస్తున్న దృశ్యం



# ట్రాక్టర్ బోల్తా ఇద్దరు మృతి

**బాపట్ల జిల్లా తిమ్మాయిపాలెం ఎస్.సి. కాలనీలో విషాద ఛాయలు**

**అద్దంకి, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** బ్రతుకుతెరువు కోసం కూలి పనికి బయలుదేరిన మహిళలు, పనిలోకి వెళ్ళకముందే జరిగిన ప్రమాదంలో ఇరువురు మహిళలు, అక్కడిక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలు అయ్యాయి. అందిన వివరాలు ప్రకారం బాపట్ల జిల్లా అద్దంకి మండలం తిమ్మాయిపాలెం గ్రామం ఎస్‌సి కాలనీకి చెందిన వేము నరసమ్మ (60), కొప్పోలు స్వరూప రాణి (47)తోపాటు మరికొందరు వ్యవసాయ పనుల నిమిత్తం ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం పోలవరం గ్రామ పొలాలలో పనులకై ఉదయం బయలు దేరారు. తిమ్మాయిపాలెం సమీపంలో ఒక ట్రాక్టర్ ఇటుకబట్టీలో లోడ్ చేయించుకొని, తిమ్మాయిపాలెం వైపు నుండి ముండ్లమూరు వైపు దర్శి రోడ్డులో వెళుతున్నది. అదే సమయంలో పొలం పనులకై వెళుతున్న వేము నరసమ్మ, స్వరూపరాణిలను ట్రాక్టర్ డ్రైవర్ తిమ్మాయిపాలెంలో ఇటుకల లోడుపై ఎక్కించుకుని వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో నరసమ్మ, స్వరూపరాణి అక్కడికక్కడే మృతి చెందారు. ఇంటిముందు ఇంకుడుగుంట తవ్వకుండగా ట్రాక్టర్ దూసుకొస్తున్న పరిస్థితిని గమనించిన టి.శ్రీనివాసరావు గుంటలో కూర్చోవడంతో ప్రాణాపాయస్థితి తప్పి తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే శ్రీనివాసరావును ఒంగోలు వైద్యశాలకు తరలించారు. అయితే మృతులు, నరసమ్మకు 5ఏళ్ళమే భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమెకు ముగ్గురు సంతానం, మరొక మృతురాలు స్వరూపరాణికి భర్త ముగ్గురు పిల్లలు వున్నారు. ఈ సంఘటనతో గ్రామంతోపాటు ఎస్‌సి కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. అద్దంకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# మూసీ ఉగ్రరూపం... పాతబస్తీ మునక

**నార్సింగి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగర ప్రజలను శుక్రవారం రాత్రి మూసీ నది భయపెట్టింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున వరద నీరు జంట జలాశయాలలోకి చేరింది. దీంతో జలమండలి అధికారులు గండిపేట, హిమాయత్ జలాశయాల గేట్లు ఒకేసారి ఎత్తడంతో పెద్ద ఎత్తున వరద నీరు మూసీలోకి వచ్చింది. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో హిమాయత్ సాగర్ జలాశయం గేట్లు 11 ఎత్తి 21 వేల క్యూసెక్కుల నీటిని, గండిపేట జలాశయం గేట్లు 15 ఎత్తి 12 వేల క్యూసెక్కుల నీటిని ఒకేసారి 33.వేల క్యూసెక్కుల నీటిని మూసీ నదిలోకి వదిలిపెట్టారు. దీంతో మూసీనది మహోగ్రరూపం దాల్చింది. అడ్డు వచ్చిన బ్రిడ్జిలన్నింటిని ముంచెత్తుతూ, పరివాహకంలో వెలిసిన ఇళ్లు, దేవాలయాలు, దోభీఘాట్‌లు, స్మశాన వాటికలన్నింటిని తనలో కలిపేసుకుంది. అంతకంతకూ వరద నీరు పెరుగుతుండడంతో పరివాహక ప్రాంతాల్లోని ఇళ్లల్లో ఉండే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బికుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. రాత్రంగా నిద్రపోకుండా జాగారం చేశారు. శనివారం వరుణ దేవుడు కరుణించడంతో జంట జలాశయాలలోకి వరద నీరు రావడం తగ్గిపోయింది. దీంతో అధికారులు క్రమంగా గేట్లను మూసివేస్తూ వచ్చారు. మూసీలోకి వచ్చే వరద నీరు 33 వేల క్యూసెక్కుల నుంచి శనివారం సాయంత్రానికి కేవలం 14 వేల క్యూసెక్కులకు పడిపోయింది. అంటే 19,వేల క్యూసెక్కుల నీరు తగ్గిపోయింది. దీంతో మూసీ పరివాహక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# సమన్వయంతో బందోబస్తు నిర్వహించాలి

**- విజయవాడ నగర పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు**



**విజయవాడ క్రైం, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ బందోబస్తు నిర్వహించాలని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో కీలకమైన మూలా నక్షత్రం రోజున అమ్మవారిని దర్శించుకోడానికి ముందురోజు రాత్రి నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అమ్మవారి దర్శనం అయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు దేవాలయానికి వస్తున్న దృష్ట్యా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన పటిష్ట బందోబస్తు ఏర్పాట్ల గురించి పోలీసులతో కూలంకుషంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో సీపీ మాట్లాడుతూ చివరి ఐదు రోజుల్లో స్థానిక భక్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం నిమిత్తం వస్తారని, ఈ క్రమంలో ఏర్పాటు చేసిన హోల్డింగ్ ఏరియాల గురించి, అక్కడ భక్తుల కోసం ఏర్పాటు చేసే అవసరాలైన నీరు, పాలు, ఆహారం తదితరాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా చూడాలని ఆదేశించారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ భక్తులతో మర్యాదగా వ్యవహరిస్తూ సంయమనం పాటిస్తూ విధులు నిర్వహించేలా అధికారులు కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని తెలిపారు. రొటీన్ బందోబస్తులా కాకుండా కొంత మనస్సు పెట్టి భక్తిశ్రద్ధలతో విధులు నిర్వహిస్తే భక్తుల మన్ననలతో పాటు అమ్మవారి ఆశీస్సులు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, దేవాలయ ఇఓ సేనానాయక్, ఎస్‌పిలు కెజివి సరిత, కె.శ్రీనివాసరావు, ఆనందరెడ్డి, ఎస్‌విడి ప్రసాద్, ఏడిసిపిలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జూనియర్ మహిళా హాకీలో భారత్ జట్టు ఓటమి

## 0-5 తేడాతో ఆస్ట్రేలియా విజయం



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా అండర్ 21 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత జూనియర్ మహిళా హాకీ జట్టు 0-5 తేడాతో ఓడిపోయింది. ఆస్ట్రేలియా టూర్‌లో భాగంగా కాన్‌బెర్రాలోని నేషనల్ హాకీ సెంటర్‌లో శనివారం జరిగిన భారత జూనియర్ మహిళల హాకీ జట్టు తన రెండో మ్యాచ్‌లో ఘోర అవమానాన్ని ఎదుర్కొంది. పోటీ ప్రారంభంలోనే భారత్ వెనుకబడిపోయింది. ఆతిథ్య జట్టు తరఫున మకైలా జోన్స్ (10వ నిముషం, 11, 52), సామి లవ్ (38), మిగాలియా హోవెల్ (50) గోల్స్ సాధించారు. తొలి మ్యాచ్‌లో 2-3 తేడాతో ఓడిపోయిన భారత్ తిరిగి పుంజుకోవాలని ప్రయత్నించినా ఆస్ట్రేలియా ప్రారంభం నుండే తన దూకుడును ప్రదర్శించింది. ఆతిథ్య జట్టు వరుసగా రెండుసార్లు మకైలా జోన్స్ ద్వారా గోల్ చేసింది, ఆమె 10వ, 11వ నిమిషాల్లో ఫీల్డ్ గోల్స్ చేసింది. రెండవ అర్ధభాగంలో ఆస్ట్రేలియా తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తూ తమ అవకాశాలను సద్వినియోగం చేసుకుంది. సామి లవ్ (38) ఫీల్డ్ గోల్‌తో ఆధిక్యాన్ని పెంచి 3-0తో ఆధిక్యాన్ని పెంచింది. భారత్ ఎదురుదాడుల ద్వారా ప్రతిస్పందించడానికి ప్రయత్నించినా, అది విఫలమైంది. నాల్గవ క్వార్టర్‌లో ఆస్ట్రేలియా పోటీని కైవసం చేసుకుంది. మిగాలియా హోవెల్ (50) గోల్ చేయడంతో, రెండు నిమిషాల తర్వాత మకైలా జోన్స్ (52) తన హ్యాట్రిక్ కొట్టింది. భారత్ తదుపరి ఈ నెల 29న అదే వేదికలో ఆస్ట్రేలియా జట్టుతో తమ మూడవ మ్యాచ్‌లో తలపడుతుంది.



# గోల్ఫ్ టాప్‌లో ప్రణవి

**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన ప్రణవి ఉర్స్ లేడీస్ ఓపెన్ డి ఫ్రాన్స్‌లో స్థిరమైన ఆరంభాన్ని అందించింది. 1 అండర్ 70 స్కోరుతో మొదటి రోజు శనివారం ఫ్రాన్స్‌లోని డ్యూవిల్లెలో జరిగిన ఈవెంట్‌లో అగ్రగామి భారతీయురాలిగా నిలిచింది. ఆమె ప్రదర్శన ఆమెను గోల్ఫ్ బారియర్ డి డ్యూవిల్లెలో 23వ స్థానంలో నిలిపింది. మైసూరుకు చెందిన ఈ 21 ఏళ్ల ఈ అమ్మాయి కంపోజ్డ్ ఫ్రంట్ నైన్ ఆడింది. తొమ్మిది వరుస పార్స్‌లను రికార్డ్ చేసింది. బ్యాక్ నైన్‌లో, ఆమె చివరికి 10వ స్థానంలో బర్డీతో ముందుకు సాగి తర్వాత హోల్‌లోనే తిరిగి షాట్ ఇచ్చింది. అయితే, ఆమె 12వ స్థానంతో మరొక బర్డీతో త్వరగా కోలుకుని వరుసగా ఆరు పార్స్‌తో తన రౌండ్‌ను ముగించింది. ఇతర భారతీయుల విషయానికొస్తే ఒలింపియన్ దీక్షా డాగర్ 1 ఓవర్ 72 పరుగులు చేసి 54వ స్థానంలో నిలిచింది. ముందు తొమ్మిది స్థానాల్లో ప్రారంభించిన దీక్షా 5వ మరియు 7వ స్థానాల్లో బోగీలతో తడబడింది, కానీ 9వ స్థానంలో బర్డీతో ఒకదాన్ని వెనక్కి తీసుకుంది. ఆమె 12వ స్థానంలో మరొక బర్డీని జోడించింది, అయినప్పటికీ 17వ స్థానంలో ఒక బోగీ వదిలివేసింది. టీనేజర్ అవని ప్రశాంత్ 2ఓవర్లలో 73 పరుగులు చేసి 70వ స్థానంలో నిలిచింది. ఆమె రౌండ్‌లో రెండు బర్డీలతో నాలుగు బోగీలు ఉన్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటికీ త్వేసా మాలిక్, నాలుగు బోగీలు మరియు కేవలం ఒక బర్డీతో 3ఓవర్లలో 74 పరుగులు చేసి 82వ స్థానంలో నిలిచింది. లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానంలో ఇటలీకి చెందిన అలెసియా నోబిలియో 6 అండర్ 65 స్కోరుతో అద్భుతంగా మెరిసింది. ఆమె తన మొదటి ఐదు హోల్స్‌లో మూడు బర్డీలతో ఓపెనింగ్ చేసి ఒక షాట్ ఆధిక్యాన్ని సాధించింది.



## వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్స్‌లో..
# శీతల్, తోమన్‌కు టైటిళ్లు

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ పారా ఛాంపియన్‌షిప్-2025లో పారా కాంపౌండ్ ఆర్చర్లు శీతల్ దేవి, తోమన్ కుమార్ భారత్‌కు మొట్టమొదటి వ్యక్తిగత ప్రపంచ టైటిళ్లను గెలుచుకున్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయంగా అరంగేట్రం చేసిన తోమన్ కుమార్ టోర్నమెంట్‌లో అసాధారణమైన షూటింగ్‌ను ప్రదర్శించి తన తొలి వ్యక్తిగత ప్రపంచ పతకాన్ని గెలుచుకున్నాడు. ఆల్ ఇండియా కాంపౌండ్ ఓపెన్ ఫైనల్‌లో, అతను తన స్వదేశీయుడు రాకేష్ కుమార్‌తో పోటీ పడ్డాడు. అయితే, నాటకీయ పరిణామాలలో రాకేష్ వైదొలగాల్సి వచ్చినప్పుడు, తోమన్ మొదటి సెట్ తర్వాత ఛాంపియన్‌గా నిలిచాడు. అనుభవజ్ఞుడైన రాకేష్ కుమార్ తొలి వ్యక్తిగత ఫైనల్ లో రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాగా మహిళల కాంపౌండ్ ఫైనల్‌లో ప్రపంచ, పారాలింపిక్ ఛాంపియన్ అయిన తుర్కియేకు చెందిన ఓజ్నూర్ కురే గిర్డిని ఓడించి, వ్యక్తిగత ఈవెంట్లలో శీతల్ భారత్ తరఫున డబుల్ గోల్స్ సాధించింది. శీతల్ కి ఇది వరుసగా రెండో ఫైనల్. కానీ ఆమె అదే ప్రత్యర్థిని ఓడించడం ద్వారా 2023 లో జరిగిన తన ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. అంతకుముందు ఆమె డిఫెండింగ్ మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ ఛాంపియన్ సరితతో కలిసి మహిళల కాంపౌండ్ ఓపెన్ డబుల్స్ విభాగంలో భారత్‌కు మొట్టమొదటి రజత పతకాన్ని సాధించింది. ఈ జంట ఫైనల్‌లో టర్కియే చేతిలో గణనీయమైన ఓటమిని ఎదుర్కొంది, చివరి సెట్‌లో వరుసగా రెండు బాణాలు 8రింగ్‌లోకి దిగాయి.

## ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌కు..
# రోహిత్, కోహ్లీకి షాక్


### స్క్వాడ్‌లో బిగ్ స్టార్స్‌కు ప్లేస్ మిస్.. సెలక్టర్ల ప్లాన్ ఛేంజ్



**న్యూఢిల్లీ:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) కోలుకోలేని షాక్ ఇచ్చింది. ఆస్ట్రేలియాతో ఈ నెల 30 నుండి ప్రారంభం కానున్న వన్డే సిరీస్ కోసం ఇండియా జట్టును ప్రకటించారు. ఈ జట్టు ఎంపికలో బిసిసిఐ సెలక్టర్లు అనూహ్య మార్పులు చేశారు. రోహిత్, కోహ్లీ పేర్లు జట్టులో లేవు. యువ ఆటగాళ్లకు అవకాశం ఇస్తూ, శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఈ ఆసియా కప్‌లో తన విధ్వంసక ఫామ్‌తో ఆకట్టుకున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా ఈ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. అతడు రెండో, మూడో వన్డేలలో ఇండియా తరఫున ఆడనున్నాడు.

ఈ సిరీస్ అతనికి ఒక కీలకమైన అగ్నిపరీక్షగా నిలవనుంది. కాగా సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు రోహిత్, కోహ్లీ ఇద్దరూ ఇండియా తరఫున ఆడాలని భావిస్తూ అందుకు సిద్ధమవుతున్న తరుణంలో సెలక్టర్లు తీసుకున్న నిర్ణయం పెద్ద షాక్‌కు గురి చేసింది. ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు తలపడే టీమిండియా స్క్వాడ్‌లో వీరిద్దరికి చోటు కల్పించకుండా అనూహ్యంగా సెలక్టర్లు తమ ప్లాన్‌ను మార్చుకున్నట్లు తెలుస్తోంది. దీంతోనే వారిద్దరిని భారత్ జట్టుకు దూరంగా ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. బిసిసిఐ ప్రకటించిన స్క్వాడ్‌లో వీరిద్దరి పేర్లు లేకపోవడం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశమైంది. వీరు కావాలనే విశ్రాంతి తీసుకున్నారా, లేక సెలక్టర్ల ప్లాన్ ఏమైనా మారిందా అనే విషయంపై సస్పెన్స్ నెలకొంది. కాగా, బీసీసీఐ ఈ మూడు వన్డేల కోసం రెండు వేర్వేరు స్క్వాడ్‌లను ఎంపిక చేసింది.

మొదటి వన్డేకు ఇండియా స్క్వాడ్‌లో శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభసిమ్రాన్ సింగ్, రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశు షెడ్గే, విప్రాజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జపనీత్ సింగ్, యుద్ధ్వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్, ప్రియాంశ్ ఆర్య, సిమర్‌జీత్ సింగ్ ఉండగా, రెండు, మూడో వన్డేలకు ఇండియా స్క్వాడ్‌లో శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్‌కెప్టెన్), అభిషేక్ శర్మ, ప్రభసిమ్రాన్ సింగ్, రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశు షెడ్గే, విప్రాజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జపనీత్ సింగ్, యుద్ధ్వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు.



## వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంప్స్‌లో
# శైలేష్‌కు స్వర్ణం.. వరుణ్‌కు కాంస్యం
### పతక రౌండ్‌కు తెలంగాణ దీప్తి అర్హత

**న్యూఢిల్లీ:** ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 ఆతిథ్య జట్టుకు అద్వితీయ విజయాలతో ప్రారంభమైంది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన ఈ టోర్నీలో పురుషుల హైజంప్‌లో శైలేష్ కుమార్ స్వర్ణం, వరుణ్ సింగ్ భాటి కాంస్య పతకం సాధించగా, తెలంగాణ యువతి దీప్తి జీవన్‌జీ పతక




రౌండ్‌కు అర్హత సాధించింది. టోర్నమెంట్‌లో భాగంగా టి42 విభాగంలో శైలేష్ 1.91 మీటర్ల తో జంప్ చేసి కొత్త ఛాంపియన్‌షిప్ రికార్డును నెలకొల్పాడు. ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ అయిన యుఎస్ఎ కు చెందిన ఎజ్రా ఫ్రెచ్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఫ్రెచ్ మరియు భాటి ఇద్దరూ 1.85 మీటర్ల ఉత్తమ క్లియరెన్స్‌తో ముగించారు, కానీ కౌంట్‌బ్యాక్‌లో, అమెరికన్ భారత క్రీడాకారిణిని ఓడించి పోడియంపై రెండవ స్థానంలో నిలిచాడు. ఇక మహిళల 400 మీటర్ల టీ20 ఈవెంట్‌లో మొదటి స్థానంతో దీప్తి జీవన్‌జీ పతక రౌండ్‌కు అర్హత సాధించింది. ఈ 22 ఏళ్ల అథ్లెట్ మహిళల 400 మీటర్ల టీ20 ఈవెంట్ రౌండ్ 1 రెండవ హీట్‌లో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఇందుకు ఆమెకు 58.35 సెకన్ల సమయం పట్టింది. ఇది ఆమె సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన.

# ఫ్యామిలీఅంతా కలిసి చూసేలా ఉంటుంది..
## 'ర్యాంప్ మీట్'లో హీరోకిరణ్ అబ్బవరం



**సక్సెస్ ఫుల్ హీరో** కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "రేర్యాంప్" ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. "రేర్యాంప్" సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా ర్యాంప్ మీట్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోరచయిత రవి మాట్లాడుతూ, సినిమాలో హీరో ఎంత స్ట్రగుల్ అయితే ప్రేక్షకులకు బాధగా అనిపిస్తుంది. కానీ ఈ సినిమా హీరో ఎంత స్ట్రగుల్ అయితే ప్రేక్షకులు అంత ఎంటర్ టైన్ అవుతారు. అక్టోబర్ 18న మనం ఆ ఎంటర్ టైన్ మెంట్ థియేటర్స్ లో చూడబోతున్నామని అన్నారు. ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మకడలి మాట్లాడుతూ, నేను కిరణ్ అబ్బవరంతో చేస్తున్న ఫస్ట్ మూవీ ఇది. ఆయన గత చిత్రాల కంటే వందరెట్లు ఎనర్జీతో నటించారు. డైరెక్టర్ నాని కథ చెబుతున్నప్పుడు చాలా ఎంజాయ్ చేశాం. కథ చెప్పినదానికంటే ఇంకా బాగా తెరకెక్కించాడు. హీరోయిన్ యుక్తికి కథలో చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది.. కె ర్యాంప్ మూవీ మంచి సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు. డైరెక్టర్ జైన్స్ నాని మాట్లాడుతూ , ఈ సినిమా ఫుల్ ఎనర్జీ, ఎంటర్ టైన్ మెంట్ తో ఉంటుంది. నువ్వు ఎంత స్క్రిప్ట్ లో రాస్తే ఎంత పర్ ఫార్మ్ చేస్తా అని కిరణ్ అన్న ఎంకరేజ్ చేసేవారు. హీరోయిన్ క్యారెక్టర్ కూడా అంతే ఎంటర్ టైనింగ్‌గా ఉంటుంది. సినిమా బాగా రావాలి అని చెబుతూ నేను సినిమా కోసం ఏది కావాలన్నా ఇచ్చారు. మా ప్రొ. థియేటర్స్ లో సినిమా చూస్తున్నప్పుడు కూడా కిరణ్ అబ్బవరం ర్యాంప్ అనే అనుకుంటారు. ఈ సినిమాలో ఆయన క్యారెక్టర్ పేరు కుమార్. కిరణ్ అన్న పర్ ఫార్మెన్స్, సపోర్ట్ గురించి తర్వాత మరింత డీటెయిల్‌గా చెబుతానని అన్నారు. హీరోయిన్ యుక్తి తరేజా మాట్లాడుతూ, కె ర్యాంప్ మూవీలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ చిత్రంలో కిరణ్ తో కలిసి నటించడం హ్యాపీగా ఉంది.. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ కె ర్యాంప్ మూవీని మేమంతా చూశాం. సినిమా చూస్తూ అన్ని ఏజ్ గ్రూప్స్ వాళ్లం చాలా ఎంజాయ్ చేశాం. సినిమా సక్సెస్ మీద కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ఈ దీపావళికి థియేటర్స్ కు వచ్చే అన్ని వర్గాల ప్రేక్షకులను కె ర్యాంప్ ఎంటర్ టైన్ చేస్తుంది. యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ ఇది. మా టీమ్ అంతా బాగా సపోర్ట్ చేశారు. వారి సపోర్ట్ వల్లే సెట్స్‌లో ఎంతో కంఫర్ట్ గా షూటింగ్ చేశాం. కథలో ఉన్న ఫన్ ను సెట్స్ లోనూ ఫీల్ అయ్యాం. మళ్లీ కాలేజ్ కు వెళ్లిన వైబ్ కలిగింది. నాతో ఈ మూవీ చేసిన ప్రొడ్యూసర్స్, రాజేశ్, శివ గకి థ్యాంక్స్. హీరోయిన్ యుక్తికి హీరోతో ఈక్వల్ ఇంపార్టెన్స్ ఉన్న క్యారెక్టర్ ఉంది. తన పర్ ఫార్మెన్స్ మీ అందరినీ ఆకట్టుకుంటుంది. ఫ్యామిలీతో కలిసి చూసి కె ర్యాంప్ మూవీని ఎంజాయ్ చేస్తారు. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, వెంకీ, రెడీ..ఇలాంటి చిత్రాలు చూశారు. ఈ సారి మా కె ర్యాంప్ మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంతో మీకు కావాల్సినంత ఎంటర్ టైన్ మెంట్ దక్కుతుంది. నేను మాటిస్తున్నా అన్నారు. నటీనటులు: కిరణ్ అబ్బవరం, యుక్తి రేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెల కిషోర్ తదితరులు.

తెర



రాశిసింగ్

# యూత్‌ఫుల్ లవ్ స్టోరీ 'మేఘాలు చెప్పిన ప్రేమకథ'



**రీసెంట్‌గా** టీజర్ ట్రైలర్ లతోనే ఎంతో అందంగా కనిపించి యువతని కట్టిపడేసే మ్యూజిక్, అద్భుతమైన లొకేషన్స్‌తో తెరకెక్కిన మేఘాలు చెప్పిన ప్రేమకథ చిత్రం థియేటర్ లో అలరించి ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. ఒక మధురమైన ప్రేమకథను అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా, దర్శకుడు విపిన్ ఈ ప్రేమకథకు సరికొత్త శైలీలో తీర్చిదిద్ది విజయం సాధించారు. యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు నగేష్ అగస్త్య అలాగే రబియా హీరో హీరోయిన్స్‌గా నటించిన ఈ చిత్రం ఈ సెప్టెంబర్ 26 నుంచి సన్ నెక్స్ట్ యాప్ లో అందుబాటులోకి వచ్చేసింది. అందమైన లోకేషన్స్ లో కనుల పండుగలా ఉంటుంది ఈ చిత్రం. కుటుంబంతో పాటు హాయిగా చూడదగ్గ చిత్రం. కథలోని భావోద్వేగాలు మనసును ఆకట్టుకుంటాయి. హీరో, హీరోయిన్ మధ్య సన్నివేశాలు చాలా అద్భుతంగా ఉంటాయి. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ చాలా బాగుంది. అలాగే హీరోయిన్ రాబియా తూన్ మేఘన పాత్రలో ఇమిడిపోయారు. చాలా ఉత్సాహంగా సహజత్వం ఉట్టిపడేలా నటించారు. ముఖ్యంగా ఆమె వ్యంగ్యహాస్యం, ఉల్లాసం ప్రేక్షకులను కట్టిపడేసింది. సపోర్టింగ్ క్యారెక్టర్ లో రాధికా శరత్‌కుమార్, సుమన్, తులసి, ఆమని పాత్రలు సినిమాకు మరింత బలం చేకూర్చాయి. థియేటర్లో ప్రేక్షకులు మనసు దోచుకున్న కుటుంబ సమేతంగా తప్పక చూడాల్సిన ఫీల్‌గుడ్ మ్యూజికల్ లవ్ ఎంటర్‌టైనర్ చిత్రం మేఘాలు చెప్పిన ప్రేమకథ. ఈ దసరా పండుగ సెలవుల్లో ఫ్యామిలీ ఆడియెన్స్ లో ఓటిటిలో మంచి ఛాయిస్‌గా నిలుస్తుంది.

## రెట్రో లుక్‌తో
# యుద్ధానికి సై అంటున్న మోహన్ బాబు..

న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ది ప్యారడైస్' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ చిత్ర పోస్టర్స్, గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఇక ఈ సినిమాను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రెస్టీజియస్‌గా డైరెక్ట్ చేస్తున్నారు.కాగా, ఈ సినిమాలో విలన్ పాత్రలో కలెక్షన్ కింగ్ డా.ఎం.మోహన్ బాబు నటిస్తున్నట్లు మేకర్స్ నేడు ప్రకటించారు. ఆయనకు సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్‌ను కూడా మేకర్స్ రిలీజ్ చేశారు. అయితే, తాజాగా ఆయన పోషిస్తున్న షికంజ మాలిక్ రెట్రో లుక్‌తో నోటిలో సిగార్, చేతిలో గన్ పట్టుకుని స్టైలిష్‌గా నడుస్తున్న పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌తో మోహన్ బాబు పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

ఇక ఈ సినిమాలో అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు .



## పూల పండుగ



జగతి యందు తీరొక్క పూలతో
జరుపుకొనే పూల పండుగ
మన తెలంగాణ బతుకమ్మ !
ప్రకృతి, సంస్కృతి, సంప్రదాయల
మేళవింపుతో ...
రంగు రంగుల పూల శిఖరాల
గుబాళింపుతో ... ఆడి పాడే
మన తెలంగాణ బతుకమ్మ !

బతుకమ్మ ఆట, పాటల్లో ఓ కథ,
ఓ స్ఫూర్తి, ఓ ఆశ, ఓ శ్వాస
బతుకునిస్తూ ... ఉంటుంది.
ఈ పండుగను తెలంగాణ
ఆడబిడ్డలు తమ ఆత్మగౌరవంగా
భావిస్తూ ...
బతుకమ్మను ఓ శక్తి స్వరూపంగా
కొలుస్తూ ... ఆడేను, పాడేను
మన తెలంగాణ బతుకమ్మ !!!

- బి. పాండురంగ

## తెలుసుకుందాం..

ఆడ శిశువుల మెదడులో జ్ఞాపకశక్తి, భావోద్వేగ నియంత్రణకు సంబంధించిన ప్రాంతాల్లో గ్రే మ్యాటర్ ఎక్కువగా ఉంటుంది. అదే మగ శిశువుల్లో అయితే అనుభూతుల విశ్లేషణ, మోటారు నియంత్రణ చేసే మెదడు భాగాల్లో వైట్ మ్యాటర్ అధికంగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి.

# 'ఉత్తమ దర్శకురాలి'గా అవార్డు..



పురుషాధిక్యత, స్త్రీల పట్ల వివక్ష, అమ్మాయిలకు బాల్యవివాహాలు.. ఇలాంటి నేపథ్యంలో పుట్టిపెరిగి సినిమాల్లోకి రావాలని కలలు కనడం నిజంగా సాహసమనే చెప్పాలి. ఇలాంటి ప్రతికూలతలన్నీ అధిగమించి ఆమె చేసిన సాహసం సఫలీకృతమైంది. చిత్ర దర్శకురాలిగా, కథా రచయితగా తనను తాను నిరూపించుకోవడమే కాదు.. తాను తీసిన తొలి చిత్రానికి ప్రతిష్టాత్మక గ్లోబల్ అవార్డు వరించింది. ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ సినీ దర్శకురాలు అనుపర్ణ రాయ్. టఇటీవల 82వ 'వెనిస్ చిత్రోత్సవం'లో తాను తీసిన చిత్రం 'సాంగ్స్ ఫర్ టెన్ ట్రీస్'కు నూతన దర్శకుల 'ఉత్తమ దర్శకురాలి'గా అవార్డు అందుకుంది అనుపర్ణ. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ చిత్ర దర్శకురాలిగా చరిత్ర సృష్టించింది.

**ఆ ఉద్యోగాలు నచ్చలేదు! .....**

పశ్చిమబంగలోని పురులియా అనే ప్రాంతంలో పుట్టి పెరిగింది అనుపర్ణ. అక్కడ అడుగడుగునా పురుషాధిపత్యం ఎక్కువ. 'మా ఊరి పాఠశాలలో అబ్బాయిలకు పుస్తకాలిచ్చి మరీ చదువుకోమని ప్రోత్సహించేవారు. అమ్మాయిలకు రేషన్ బియ్యం ఇచ్చి స్త్రీలకు వంటిల్లే ప్రపంచమని పరోక్షంగా చెప్పేవారు. నేను ఈ ఆంక్షలకు కట్టుబడి ఉండాలను కోలేదు. అందుకే ఎవరేమన్నా పట్టించుకోకుండా చదువుపై శ్రద్ధపెట్టా. అదే మనకు గుర్తింపు తెచ్చిపెడుతుందని ముందుకు సాగుతుంది. ఆంగ్ల సాహిత్యం పూర్తయ్యాక ఢిల్లీ వెళ్లా. అక్కడే మాస్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్ చేశా. చదువు పూర్తయ్యాక మొదట్లో కాల్ సెంటర్‌లో కొన్నాళ్ల పాటు పనిచేశా. ఆపై ముంబయి వచ్చి ఓ ఐటీ కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ విధులు నిర్వర్తించా. అయితే ఈ ఉద్యోగాలేవీ నాకు సంతృప్తి ఎందుకంటే నేను కోరుకున్న కెరీర్ ఇది కాదు. నాకు చిన్నతనం నుంచి పుస్తకాలు చదవడం, కథలు రాయడమంటే చాలా ఇష్టం. ఈ మక్కువతోనే ఉద్యోగం వదిలేసి సినిమాలా రావాలనుకున్నా.అని చెబుతుంది అనుపర్ణ.

**.. 50 సీన్ల కథే సినిమాగా..!** అది నటనైనా దర్శకత్వమైనా.. ఇలా చిత్ర రంగానికి చెందిన ఏ డిగ్రీనైనా రాణించాలంటే అంత సులభం కాదు. అవకాశాల కోసం నిర్మాణ సంస్థల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి ఉంటుంది. తాను ఇలాంటి ప్రయత్నాలెన్నో చేశానంటోంది అనుపర్ణ. సినిమాల్లోకి రావడమంటే మాట్లాడుకోవడం సులభం కాదు. నేనూ అవకాశాల కోసం ఎంతో ఎదురుచూశా. ఎన్నో ప్రయత్నాలు చేశా. ఈ కోరికనే ఎక్కువ మొత్తంలో బడ్జెట్, నిర్మాణ సంస్థల సహకారం లేనిదే మనమేమీ చేయలేమని నాకు అర్థమైంది. అయితే లక్కీగా 2023లో నాకు 'రన్ టు ది రివర్' అనే సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. ఇది మంచి గుర్తింపునివ్వడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. దాంతో గత మూడేళ్లుగా నేను రాసుకుంటూ వచ్చిన కథను సినిమాగా తీయాలనుకున్నా. ఇలా అద్దె గదిలో నివాసముంటూనే 'సాంగ్స్ ఆఫ్ టెన్ ట్రీస్' కథ రాసుకున్నా. నిజానికి నేను రాసింది 50 సీన్లకు సరిపడే కథ మాత్రమే! మిగిలినదంతా చిత్రీకరణ జరిగేటప్పుడు ఆటోమెటిక్‌గా నా మనసులో కలిగిన భావాలను కథకు జతచేసి సినిమా పూర్తిచేశా. ముంబయికి వలస వచ్చిన ఇద్దరు మహిళల చుట్టూ అల్లుకున్న కథ ఇది. వాళ్లిద్దరి మధ్య స్నేహం, ఇంత పెద్ద మహిళా నగరంలో వాళ్ళు ఎదుర్కొన్న పలు దా సవాళ్లు, సమస్యలు.. వంటి అంశాలన్నీ తెరపై ప్రతిబింబిస్తాయి.. అంటోంది దర్శకురాలు.

**చీర వెనుక కథ ఇదీ!** ఇలా అనుపర్ణ తీసిన ఈ సినిమా తాజాగా అంతర్జాతీయ పురస్కారం గెలుచు కుంది. ఇటీవలే 82వ 'వెనిస్ చిత్రోత్సవం'లో పోటీపడిన ఈ చిత్రం నూతన దర్శకుల బృందం 'ఉత్తమ దర్శకురాలి'గా అవార్డును తెచ్చిపెట్టింది. ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న తొలి భారతీయ చిత్ర దర్శకురాలిగా చరిత్రకెక్కింది అనుపర్ణ. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, తమ ప్రాంతపు ఆర్ట్ వర్క్ ని ప్రతిబింబించేలా చీరకట్టులో ముస్తాబై వెనిస్ వేదికపై అడుగుపెట్టిన ఆమె.. అవార్డు అందుకుంటూ ఒకింత ఎమోషనలైంది. 'ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన నేను సినిమా రంగంలోకి అడుగుపెట్టడానికి ఎంతో కష్టపడ్డా.. సినిమాల్లోకొస్తానంటే మొదట మా అమ్మానాన్నలు, స్నేహితులు వద్దంటే వద్దన్నారు. ఇందులో నేను రాణిస్తానో, లేదోనని సందేహించారు. కానీ ఇప్పుడు వాళ్లే నన్ను చూసి గర్వపడుతున్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును నన్ను సినిమాల్లోకి రావద్దన్న చోటికే తీసుకెళ్తుండడం చాలా సంతోషంగా ఉంది. గర్వంగా అనిపిస్తోంది. ఇక నేను కట్టుకున్న చీర గురించి ప్రత్యేకంగా చెప్పాలి. బేసిగ్గా నేనో శారీ లవర్‌ని ఎక్కడికెళ్లినా చీరకట్టులోనే వెళ్లడానికి ఇష్టపడతాను.. ఈ వేదికపైనా అదే అటైర్‌ని ఎంచుకోవచ్చు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, మా ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన పురులియా ట్రైబల్ వాల్ పెయింటింగ్స్‌ని ప్రతిబింబించేలా ఈ చీరను నా ఫ్రెండ్ ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నా. మొత్తానికి నాకిష్టమైన చీర కట్టులో అవార్డు అందుకోవడం ఓ గొప్ప అనుభూతి! మాతృ దేశ సినీ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన భావన కలుగుతోంది' అంటోంది అనుపర్ణ. భవిష్యత్తులో సమాజంలో స్ఫూర్తి నింపే కథలతో ప్రేక్షకుల ముందుకు రావాలనుకుంటోన్న ఈ మహిళా దర్శకురాలి ప్రతిభను పలువురు కొనియాడుతున్నారు. □

## నేటి అలంకరణ

# శ్రీ మహాచండీదేవి



"రక్ష రక్ష జగన్మాతర్దేవి ! మంగళ చండికే
హారికే విపదాం రాశేః ! హర్ష మంగళకారికే
హర్ష మంగళ దక్షేచ శుభే మంగళ చండికే
మంగళ మంగళార్హేచ ! సర్వ మంగళ మంగళే
సదా మంగళ దే దేవి ! సర్వేషాం మంగళాలయే"
దేవానాం కార్యసిద్ధర్థ్యం మావిర్భవతిసా యదా !
ఉత్పన్నేతి తదా లోకే సా నిత్యా వ్యభిధీయతే !!

దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కొరకు మహాలక్ష్మి, మహాకాళీ, మహా సరస్వతీ త్రిశక్తి స్వరూపిణిగా మహాచండిగా అమ్మవారు ఉద్భవించింది. అమ్మవారిలో సర్వదేవతలు కొలువై ఉన్నారు.

– చండీదేవి అవతార విశ్లేషణ : చండీదేవి కాళీదేవిని పోలి ఉంటుంది. దయగల రూపంలోను ఒక్కొక్కసారి ఉగ్రరూపంలోను దర్శనమిస్తుంది. దయగల రూపంలో ఉన్నపుడు ఉమా, గౌరి, పార్వతి లేదా హైమవతి, శతాక్షి, శాకాంభరీ దేవి, అన్నపూర్ణ, జగన్మాత మరియు భవానీ అని పిలుస్తారు. అలాగే భయంకరమైన రూపంలో ఉన్నప్పుడు దుర్గ, కాళి మరియు శ్యామ, చంఢీ లేదా చంఢిక, భైరవి, చినమస్త మొదలైన పేర్లతో పిలువబడుతుంది. నవరాత్రుల మహోత్సవాల్లో దుర్గాదేవి తొమ్మిది రూపాల్లో ఒకటైన చండీదేవి అవతారం ఎలా జరిగిందంటే రాక్షసులు ఇంద్రుడి సింహాసనాన్ని ఆక్రమించడానికి వచ్చినపుడు దేవతలందరూ ఒకేచోట సమావేశమై పరమశివుడి దగ్గరకు వెళ్లి రాక్షసుల ఆగడాలను వివరించగా పరమశివుడు మాతృదేవతను ఆరాధించమని తెలుపగా మధుకైటబ, మహిషాసుర, శుంభనిశుంబ ఇత్యాధి రాక్షసులను సంహరించడానికి మాతృదేవత అనుగ్రహంతో తల్లి మహాకాళి ఛంఢి రూపాన్ని దాల్చింది.

**అమ్మవారి పూజ ఫలితం :** అమ్మవారిని ప్రార్థిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్లే. అమ్మవారి అనుగ్రహంతో విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారుతారు. ప్రార్థిస్తే కోరిన కోరికలు సత్వరమే లభిస్తాయి. బ్రహ్మాది దేవతలు అమ్మవారి వైభవాన్ని కీర్తించే శక్తివంతమైన మంత్ర కదంబమే చండీ లేదా దుర్గా సప్తశతి.

వస్త్రం : బంగారు రంగు వస్త్రం
పుష్పాలు : పసుపురంగు పూలు
నైవేద్యం : తెల్ల నువ్వులు కలిపిన బెల్లపు పొంగలి
మంత్రం : ఐం హ్రీం క్లీం చాముండాయై విచ్చే 108 సార్లు పఠించాలి
"ఐం అనగా సరస్వతి, హ్రీం అనగా లక్ష్మి, క్లీం అనగా గౌరి,
విచ్చే అన్నగా రమ్మని వేడుకోలు"

- భట్టిప్రోలు నటరాజ కుమార్

# పర్లేదు.. ఏడవనివ్వండి !



ఏదైనా కావాలి అని పిల్లలు ఏడవడం ఆలస్యం.. 'అమ్మమ్మా.. వద్దమ్మా' అని బతిమాలేస్తాం. అన్నం తిన్నానో మరింకెలాగో మొండికేస్తే చాలు కోరిందల్లా తెచ్చి చేతిలోపెడతాం. ఇలాగైతే వాటి విలువ వాళ్లకెలా తెలుస్తుంది? కాబట్టి.. కిందపడో ఏదైనా గాయం తగిలో ఏడుస్తుంటే వాళ్ల ధ్యాస మళ్లించాలినసందే. బుజ్జగించి ఏడుపు ఆపేలా చూడాల్సిందే. వద్దన్న పనిచేసో.. లేదన్న వస్తువు కావాలనో ఏడుస్తోంటే మాత్రం వాళ్లనలా వదిలేయండి. మనసు చివుక్కుమన్నా.. ఆ గోలకి తల నొప్పి వచ్చినా పట్టించుకోవద్దు. అప్పుడే భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం, తమని తాము సంభాళించుకోవడం వంటివి పిల్లలకు తెలుస్తాయి. అలాగే ప్రతి చిన్నదానికీ ఏడుపే పరిష్కారం కాదని తెలుస్తుంది. ఇక అలక! వాళ్లకి వాళ్లు హాని తలపెట్టుకోవడం, ఇంట్లో వస్తువులను పగులుకొట్టడం వంటివి చేయనంతవరకూ దాన్నీ పట్టించుకోవాల్సిన పనిలేదు. అలాగని అలా చేస్తే ఇవ్వమనీ కాదు. వారించాలి, ఆపడానికి ప్రయత్నించాలి. అంతేకానీ అడిగింది ఇవొవ్వద్దు. అలాకాకుండా అన్నం తినకున్నా, మాట్లాడకుండా కూర్చున్నా, కిందపడి ఏడుస్తున్నా పట్టించుకోవద్దు. లేదంటే 'ఇలా చేస్తేనే కావాల్సినవి వస్తా'యన్న భ్రమలోకి వెళ్లిపోతారు. తీరా పెద్దయ్యాక మార్చాలన్నా కష్టమే కాబట్టి, వదిలేయండి. అంతకుముందు ఇస్తానన్నవీ ఇవ్వొద్దు. అప్పుడు గోలచేస్తే అడిగినవి రాకపోగా.. వచ్చేవీ దక్కకుండా పోతాయని అర్థమవుతుంది.

## నేడు వెన్న ముద్దల బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో 8వ రోజైన వేపకాయ బతుకమ్మ అని పిలుస్తారు. తంగేడు, గునుగు తదితర పూలను ఎనిమిది ఎత్తుల్లో పేర్చి గౌరమ్మను వాటిపై పెడతారు.

**ఈ రోజు నైవేద్యం :** బెల్లం దంచి, నువ్వులు, వెన్న కలుపుతారు. వాటి ముద్దులు చేస్తారు. □

## మెనోపాజ్‌లో ఉన్నారా?



అందరికీ అందుబాటులో ఉండే పోషకాల గని.. వేరు సెనగ.. ముఖ్యంగా ఇవి మెనోపాజ్ దశలో ఉన్న మహిళల ఇబ్బందులినటన తగ్గిస్తాయట. ఈ గింజల్లోని ఫైటోఈస్ట్రోజెన్స్ వేడి ఆవిర్లు, రాత్రిపూట చెమట వంటివి అదుపులో ఉంచుతాయి. వీటిల్లో కాల్షియం, విటమినల్ కె, మెగ్నీషియం పుష్కలంగా ఉండటం వల్లఎముక బలాన్ని పెంచుతాయి. ఆస్టియోపోరోసిస్ రిస్క్‌ని తగ్గిస్తాయి. మెనోశాచ్చురేటెడ్, పాలీ ఆన్‌శాచ్చురేటెడ్ కొవ్వులు ఒంట్లోని ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండె వ్యాధి ముప్పుని తగ్గిస్తాయి. వేరుసెనగలో ఉండే నరటిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ సెరటోనిన్‌గా మారి భావోద్వేగాల హెచునచతుగ్గులను సమం చేస్తుంది. పోషకాల లేమి, రక్తహీనతకు పల్లీలు చెక్‌పెడతాయి. గుప్పెడు వేరుసెనగ గింజల్ని తిని చూడండి. రక్తపోటు అదుపులో ఉంటుంది. అంతేనా, ఇందులో యాంటీఏజింగ్ కాంపౌడ్ మాలిక్యుల్ రెస్‌వెరట్రాల్ చర్మాన్ని

# అటుకుల ప్రసాదాలు

## అటుకుల బూరెలు ..



**కావలసినవి :** బియ్యప్పిండి రెండుకప్పులు, మినపప్పు, బెల్లం తరుగు: ఒకటిన్నర కప్పు, మందంగా ఉండే అటుకులు: రెండు కప్పులు, కొబ్బరి తురుము: అరకప్పు, ఉప్పు: పావుచెంచా, యాలకుల పొడి: పావుచెంచా, నూనె: వేయించేందుకు సరిపడా.

**తయారీ విధానం :** 1. మినపప్పును నాలుగైదు గంటలు నానబెట్టుకుని ఆ తరువాత మెత్తగా రుబ్బి పెట్టుకోవాలి. ఇందులో బియ్యప్పిండి,ఉప్పు వేసుకుని కాస్త చిక్కగా తోపుపిండిని సిద్ధంచేసుకోవాలి. 2. అటుకుల్ని జల్లించుకుని, కడిగి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి బెల్లం తరుగు వేసి.. పావువకప్పు నీళ్లుపోయాలి. బెల్లం కరిగి చిక్కనిపాకంలా మారుతున్నప్పుడు అటుకులు,కొబ్బరి తురుము యాలకులపొడి వేసిబాగా కలిపి దగ్గరకు అయ్యాక దింపేయాలి. 3. అటుకుల మిశ్రమం చల్లగా అయ్యాక చిన్నచిననన ఉండల్లా చేసుకుని బియ్యప్పిండి మిశ్రమంలో ముంచి..కాగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకుంటే చాలు. కమ్మని బూరెలు సిద్ధం.,

## బెల్లం మిఠాయి..



**కావలసినవి :** అటుకులు–2 కప్పులు,కొబ్బరి తురుము – కప్పు, బెల్లం–పావుకిలో, నెయ్యి–కప్పు, యాలకుల పొడి–అరచెంచా, నువ్వులు–అరకప్పు, జీడిపప్పు, కిస్మిస్–అర కప్పు,

**తయారీ :** జీడిపప్పు, కిస్మిస్ నేతిలో వేయించాలి. బెల్లం పాకం పట్టి.. అందులో కొబ్బరి తురుము, జీడిపప్పు, కిస్మిస్ వేయాలి. కాస్త ఉడకనిచ్చి, అటుకులు, మిగిలిన నెయ్యి వేయాలి. రెండు నిమిషాలు సన్న సెగ మీద ఉంచి, కలియతిప్పి, దించితేసరి, అటుకులు కొబ్బరి బెల్లంతో రుచికరమైన కొబ్బరి మిఠాయి తయారైపోతుంది.

## అటుకుల కేసరి..



**కావలసినవి :** అటుకులు, చక్కెర–కప్పు చొప్పున, నెయ్యి– అరకప్పు, యాలకుల పొడి–అర చెంచా, జీడిపప్పు, కిస్మిస్– అర కప్పు, కుంకుమ పువ్వు.

**తయారీ :** ముందుగా కడాయిలో నెయ్యి వేసి అటుకుల వేయించాలి. వేడి తగ్గాక కొంచెం బరకగా పొడి చేసుకోవాలి. ఇందులో నెయ్యి,కొద్దిగా నీళ్ల పోసి ఉండలు రాకుండా ఉడికించాలి. పంచదార వేస్తూ కలియబెట్టాలి. దగ్గరగా అయ్యాక.. నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్మిస్, కుంకుమ పువ్వు వేసి కలపలాలి. అంతే కేసరి సిద్ధం.

## మోదకం ..



**కావలసినవి :** అటుకులు–రెండు కప్పులు, నెయ్యి–కప్పు, బెల్లం–పావు యాలకుల పొడి– అరచెంచా, జీడిపప్పు, కిస్మిస్– అరకప్పు, నచ్చిన ఫుడ్ కలర్ – కొద్దిగా.

**తయారీ :** కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి అటుకులు వేయించుకోవాలి. చల్లారాక మెత్తగా గ్రైండ్ చేయాలి. జీడిపప్పు, కిస్మిస్ నేతిలో వేయించాలి. బెల్లం పాకం మిశ్రమంతో మోదకాలు చుట్టుకోవాలి. ఇవి రుచీ, ఆరోగ్యం కూడా.

## అటుకుల లడ్డు...



**కావలసినవి :** అటుకులు– రెండు కప్పులు, పంచదార–కప్పు, కొబ్బరితురుము – అర కప్పు, యాలకులపొడి–అర చెంచా, నెయ్యి–తగినంత, జీడిపప్పు, కిస్మిస్–అరకప్పు.

**తయారీ :** కడాయిలో కాస్త నెయ్యి వేసి అటుకులు వేయించాలి. అవి కాస్త వేగాక కొబ్బరి తురుము, యాలకుల పొడి వేసి ఇంకాస్త వేయించాలి. చల్లారాక గ్రైండ్ చేసి.. ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో జీడిపప్పు, కిస్మిస్, పంచాదార పొడి, నెయ్యి వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలియతిప్పి.. చిన్న ఉండలుగా చుట్టుకోవాలి. ఇంకా తియ్యగా కావాలనుకుంటే..మిక్‌నసడే ఫ్రైట్ జామ్ కొద్దిగా కలపవచ్చు. ఇవి వారం పాటు తాజాగా ఉంటాయి.

## తియ్యటి అటుకులు ..



**కావలసినవి :** అటుకులు–రెండు కప్పులు, కొబ్బరి పాలు – రెండు కప్పులు, పంచదార–కప్పు, ఆకుప్చ ఫుడ్, కలర్–కొద్దిగా.

**తయారీ :** ముందుగా కొబ్బరిని గ్రైండ్ చేసి, అందులోంచి కొబ్బరి పాలు తీయాలి. సన్న సెగ మీద ఈ పాలు మరిగిస్తూ అందులో పంచదార వేయాలి. అది కరిగాక అటుకులు, ఫుడ్ కలర్ వేసికలియతిప్పికొద్దిగా ఉడికించి దించేయాలి. ఈ తియ్యటి ఆటుకుల పైన కాస్త కొబ్బరి కోరు చల్లితే.. రుచి పెరగడమే కాకుండా, మరింత ఆకర్షనీయంగా ఉంటుంది. □

# ఉదయాన్నే ప్రశాంతంగా..

ఏం చేస్తాం? అందరిలానే బ్రష్, వంట.. అంటూ జాబితా తీయొద్దు. మీకోసం మీరేం చేస్తున్నారో ఆలోచించండి. ఎందుకంటే రోజంతా బాగుండాలన్నా, మనసు ప్రశాంతంగా ఉండాలన్నా దాన్ని అందంగా తీర్చిదిద్దుకోవాలి అంటున్నారు నిపుణులు. ఉదయం లేవగానే చకచకా పనుల్లో పడతారా?



కొద్దిసేపటికే అలసట కమ్మేస్తుంది కదా ! అలాకాకుండా లేవగానే మీకోసమంటూ ఓ మంచి టీనో, కాఫీనో పెట్టుకొని నింపాదిగా తాగండి. ఆ తరవాతే పనుల్లోకి దిగండి. మళ్లీ సాయంత్రమే టీ లేదా కాఫీ అప్పటివరకూ ఆకలేసినా, ఊసుపోకపోయినా దాని జోలికి వెళ్లొద్దు. వీలుంటే పండ్ల ముక్కలను కోసిగానీ, జ్యూస్‌గా గానీ చేసి పెట్టుకోండి. ఇవి తింటే ఆకలీ తీరుతుంది. శరీరానికి కావాల్సిన శక్తీ అందుతుంది. ఉదయం నిద్ర లేవగానే చేశామా సరే! ఏ మాత్రం సమయం దాటినా వ్యాయామం చేయడానికి శరీరం మొరాయిస్తుంది కదూ ! అలాంటప్పుడు ప్రాణాయమం, ధ్యానం వంటివైనా చేయండి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఇంకా ఉదయం 9 గంటల లోపు నీరెండలో కనీసం పది నిమిషాలైనా నడవండి. ఇది శరీరానికి కావల్సిన డి విటమిన్ అందించి, శరీరాన్ని దృఢంగా మారుస్తుంది. అంతేకాదు 'డొపమైన్' హార్మోను విడుదలకూ సాయపడుతుంది. అలా రోజంతా ఆనందంగా ఉండొచ్చు. కాలక్షేపం అనగానే చేయి ఫోన్‌వైపే మల్లుతుంది కదా? సోషల్ మీడియాలో అలా కాసేపు పోస్టులు చూద్దామనో, ఒక్క రీల్ అనో మొదలుపెడతామా.. సమయం ఎలా గడిచిందో కూడా తెలియదు. ఇక్కడ సమయం వృథానే కాదు.. అది మనసుపై తెలియకుండానే చెడు ప్రభావం పడేలా చేయగలదు. కాబట్టి, నిద్రలేచాక కనీసం 3 గంటలు వాటి జోలికి పోవద్దు. పెద్దగా కష్టంలేని పనులే కదూ.. కానీ మనసునీ శరీరాన్నీ ఉల్లాసంగా మార్చేస్తాయి. కావాలంటే ప్రయత్నించి చూడండి. □

## గర్భిణుల వ్యాయామం

స్టూలు మీద పాదాలు నేలకూర్చి రిలాక్స్‌డ్‌గా కూర్చోండి. చిన్న నాపికిన్ లేదా టవల్‌ను అరచేతులకు వత్తిడిలేకుండా పెట్టి చేతులను గుండెల దగ్గరకు తీసుకురావాలి. టవల్ అరచేతుల మధ్య ఉంచి మెల్లగా ఐదులెక్కపెడుతూ ఊపిరి బిగబెట్టండి. నెమ్మదిగా శ్వాస వదలండి రిలాక్సవండి. తిరిగి ఎక్సర్‌సైజులు మొదలుపెట్టండి. ఈ విధంగా 10సార్లు రిపీట్ చేయండి. ఇదే పొజిషన్‌లో కూర్చుని అరచేతులను ఎడమవక్షోజం దగ్గరకు తీసుకురండి. ఊపిరి ఐదులెక్కపెట్టేదాక బిగపట్టి మెల్లగా ఊపిరి వదలండి. రిలాక్సవండి. ఇదే విధంగా కుడివైపుకూడా చేయండి. □




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.